జూన్ 2018

రూ. 20

# చైతన్యం

సంకల్ప బలం

## సామాజిక విలువల మాసపత్రిక



# 5వ తెలంగాణ ఆవిర్భావ దిన శుభాకాంక్షలు

# తెలంగాణ పురోగమిస్తున్నది... భారత దేశం గర్విస్తున్నది.

అరవైయ్యేళ్ళ నిర్లక్ష్యానికి చరమగీతం పాడిన
ఉద్యమకారుడి కలలు సాకారం...

బాధ్యతాయుతమైన పరిపాలనతో అద్వితీయ సారథ్యం...

పునాదుల నుంచి ఆరంభం
శరవేగంతో ప్రగతి దిశగా ప్రయాణం...

ఈ అభివృద్ధి అనితరసాధ్యం
అసమానం మన కేసీఆర్ సారథ్యం...

మన శ్వాస, మన భాష, మన ఆశల మణిపూసలు...

**తెలంగాణ ఆవిర్భావ నాలుగవ వార్షికోత్సవాలు**
**నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల హృదయాల్లో ఆనందోత్సవాలు**



నాలుగేళ్ల నాడు కన్ను తెరిచిన పసికూన రాష్ట్రం మన తెలంగాణ. పొత్తిళ్లలోని ఈ శిశువును కంటికి రెప్పలా సాకే బాధ్యతను తెలంగాణ ప్రజలు గౌరవనీయ ముఖ్యమంత్రి వర్యులు **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు** గారి అద్వితీయ సారథ్యానికి అప్పగించారు. ఈ బాధ్యతను చిత్తశుద్ధితో చేపట్టిన కేసీఆర్ గారి ప్రభుత్వం గత అరవై ఏళ్లలో ఏ ప్రభుత్వమూ చేపట్టని అనేక అభ్యుదయ పథకాలను వినూత్నంగా రూపొందించి, విశేషమైన శ్రద్ధాశక్తులతో అమలు చేస్తున్నది. అత్యంత ప్రాథమికమైన వ్యవసాయ రంగం మొదలుకొని విద్య, వైద్య, ఆరోగ్య, సాంస్కృతిక, ఐటి, పట్టణ, నగరాభివృద్ధి, మౌలిక వసతులు ఇంకా పారిశ్రామిక రంగాలలో అసమానమైన అభివృద్ధి కోసం అనేక వైవిధ్యభరిత కార్యక్రమాలు, పథకాలు రూపొందించింది. నాలుగేళ్ల ప్రస్థానంలో ఇవి జాతీయస్థాయిలో పోటీపడే తత్వాన్నిపెంచి, మన తెలంగాణను అగ్రస్థానంలో నిలబెట్టాయి. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల జీవితాల్లో ఆనందాన్ని ఆవిష్కరించాయి. వామనుడు త్రివిక్రముడిగా ఎదిగినట్లు కేవలం నాలుగేళ్లలో అత్యున్నత శిఖరాలను చేరుకొన్న మన తెలంగాణ వైపు నేడు భారతదేశం ఆసక్తిగా చూస్తున్నది. మన అభ్యుదయ పథకాలను అనుసరించేందుకు ఉత్సాహంతో ఎదురుచూస్తున్నది. ఈ అభివృద్ధి ఫలాలు మనందరివీ... తెలంగాణ గడ్డ మీద ప్రతీ వ్యక్తివీ! తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ నాలుగవ వార్షికోత్సవాల సందర్భంగా -

**అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు...**

**ఈ స్ఫూర్తిని కొనసాగిద్దాం... తెలంగాణ ఖ్యాతిని జాతీయస్థాయిలో నిలబెడదాం.**

ఎంతో ఎత్తుకు ఎదిగాం... ఎన్నెన్నో సాధించాం



జారీ చేయువారు: కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం




వ్యవస్థాపక సంపాదకురాలు:

**తీగవరపు శాంతి**


# చైతన్యం

సంకల్ప బలం


**సామాజిక విలువల మాస పత్రిక**

సంపుటి -7 జూన్ 2018 సంచిక -9


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| మిస్ మేఘమాల | 20 |
| కాశీ ఖండం | 31 |
| సంభాషణ సంస్కృతం | 35 |
| మా ఊరి నందుల కథ | 39 |
| ప్రహేళిక | 44 |
| రాశి ఫలాలు | 48 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| కథ కాని కథ | 6 |
| ఈ విశ్వం వయసు ఎంత | 9 |
| సంతాపమే సరైన మందు | 12 |
| ముల్లా నస్రుద్దీన్ కథలు | 14 |
| తెలుగు పాఠక నవలారాణి | 17 |
| మన విద్యా వ్యవస్థ | 33 |
| ఉచిత భోజన విద్యాలయాలు | 41 |
| బ్రహ్మకు ప్రీతికరమైన నిజ జ్యేష్ఠ మాసం | 45 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## మన రాష్ట్రంలో మనకి ప్రాధాన్యత ఏది ?

మన దేవాలయాలలో మనకి తగిన ప్రాధాన్యత లేదు అనేది తెలుగువారి ఆవేదన. మిగిలిన రాష్ట్రాలలో వారి కిచ్చే ప్రాధాన్యత చూసిన తెలుగు వారు మన ప్రభుత్వాలు మనకిచ్చే విలువ ఇదేనా? అని బాధపడుతున్నారు. ఉత్తర ప్రదేశ్ లోని కాశీ విశ్వేశ్వరుని దర్శించుకోవడానికి వెళ్లినా, మహారాష్ట్ర లోని శిరిడీ సాయిబాబాను దర్శించుకోవడానికి వెళ్లినా అక్కడ నివసిస్తున్న ప్రాంతీయ ప్రజలకు ప్రాధాన్యత నిచ్చి ఆ ప్రజల కు ముందుగా (దగ్గర మార్గం ద్వారా) దర్శన ఏర్పాట్లు కల్పిస్తున్నారు. అలాగ మాకు ఎందుకు కల్పించదు ?మన ప్రభుత్వం అని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ప్రజలు బాధపడుతున్నా రు. పొరుగు రాష్ట్రాల్లోనూ మనకి ప్రాధాన్యత వారి తర్వాతే, మన రాష్ట్రంలోనూ మనకి దర్శనాల విషయంలో ప్రాధాన్యత లేదు అని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రెండు రాష్ట్రాలలోని ప్రజలు ప్రధాన ఆలయాలలో భగవంతుని దర్శన విషయంలో వారికి తగిన ప్రాధాన్యత కలిగించాలని కోరుకుంటున్నారు. అంతేకాక ప్రధాన ఆలయాలలో ఆ ప్రాంత కళాకారులకు తగిన ప్రాధాన్యత నివ్వాలని కోరుకోవడం కూడా తప్పులేదు కదా! ఇకపోతే కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలు "మానస సరోవరం " వంటి అతి ముఖ్యమైన ప్రదేశాల సందర్శనార్థం ఆ రాష్ట్ర ప్రజలకు ఆర్థికంగా సహాయాన్ని అందిస్తోంది. కర్ణాటక -30 వేల రూపాయలు, ఉత్తరప్రదేశ్-1లక్ష రూపాయలు, గుజరాత్ -20 వేల రూపా యలు, రాజస్థాన్-1లక్ష, తమిళనాడు -50 వేల రూపాయలు, హరియానా - 50 వేల రూపాయలు, కర్ణాటక -35 వేల రూపాయలు, ఢిల్లీ 30 వేల రూపాయలు, ఛత్తీస్ ఘర్ 25 వేల రూపాయలు మధ్యప్రదేశ్- 30 వేల రూపాయలు చొప్పున అతి ముఖ్యమైన ప్రదేశాల సందర్శనార్థం ఆ రాష్ట్ర ప్రజలకు ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా సహాయాన్ని అందిస్తున్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల ప్రజలకు మాత్రం ఇంకా ప్రభుత్వం సహాయాన్ని అందివ్వడం లేదని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఇక్కడి ప్రజలకు కూడా అందించాలని కోరుకుంటున్నారు. ఇంకా ఆలయాలకు ఉత్స విగ్రహాలను తిరుమల తిరుపతి దేవస్థానం కొంత సబ్సిడీతో అందజేస్తోంది. కానీ అవి అందేవరకు దగ్గర దగ్గర సంవత్సరకాలం పడుతోంది. అది అలా ఉండగా దేవాలయాల పురోభివృద్ధికి ఏమీ చేయడం లేదని, హుండీలో డబ్బులు వారే తీసుకుంటున్నారని, జీతాలు మాత్రం చెల్లిస్తున్నారని ఆరోపణ. కానీ దేవాలయాల అభివృద్ధి బాధ్యత కూడా తిరుమల తిరుపతి దేవస్థానం వారు చేపట్టడం లేదని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. దేవస్థానాలలో అక్కడ పూజారులు కానీ అధికారులు కానీ కొన్ని జాగ్రత్తలు పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అక్కడ పరిశుభ్రత పాటించడమేకాక, అక్కడకు వచ్చే భక్తులు కూడా శుభ్రత పాటించేటట్టు చెయ్యాలి. అలాగే దర్శనాల విషయంలో భక్తులనందరినీ సమానంగా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉంది. భగవంతుడు అందరికీ సమానమే అన్న విషయాన్ని మరచిపోవద్దు.
ఎన్నో దేవాలయాలలో ఉచిత భోజన సదుపాయం కలిగిస్తున్నారు, కానీ అక్కడ పరిశుభ్రత పాటించడం లేదు. భక్తులు పాటించి తీరేటట్లు నియమ నిబంధనలు పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ కి అతి ముఖ్యమైన దేవాలయం తిరుపతి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుపతి వెంకటేశ్వర స్వామి ఒక్క తెలుగు వారికే కాక ప్రపంచంలోని ప్రజలందరికీ ప్రత్యక్ష దైవం అటువంటి దేవాలయంలో కూడా వివాదాలు చోటు చేసుకోవడం నిజంగా తెలుగువారికి అవమానం. ముఖ్యంగా అన్య మతస్థులు తిరుపతిలో ప్రచారాలు చేయడమే కాక వారిని అక్కడ కమిటీలలో ఉంచడం దగ్గర నుండి అనేక విషయాలలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. అక్కడ దేవాలయాలలో పూజారులతో కూడా ఎప్పుడూ రాని వివాదాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయి? అలాగే విజయవాడ కనక దుర్గ దేవాలయంలో జరిగిన సంఘటనల గురించి కూడా అందరికీ తెలిసినవే. ఇంత ఆధ్యాత్మిక దేశం అయిన మన దేశంలో ముఖ్యంగా ఆంధ్ర దేశంలో ఇటువంటి వివాదాలు ఎందుకు జరుగుతున్నాయి? కొన్ని దేవాలయాలు అయితే నైవేద్యానికి కూడా నోచుకోని పరిస్థితి. ఎందుకు ఈ పరిస్థితి ఏర్పడుతోంది? ప్రభుత్వం ప్రజల సున్నిత విషయాల మీద దెబ్బ తగులుతూంటే, తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం లేదా? ఇవన్నీ ప్రజల భక్తి భావాలకు సంబంధించిన విషయాలు. ఇటువంటివి ప్రజలు పట్టించుకోరు అనుకోవద్దు. ప్రతీ విషయాన్ని ప్రజలు ఓట్ల రూపంలో చూపిస్తారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. అధికారం ఉంది కదా! అని చూపిస్తాం, పెత్తనం చెలాయిస్తాం అంటే ప్రజలు చూస్తున్నారు. ఒక్కసారి ఉవ్వెత్తున లేవకుండా, సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

దేవాలయాలలో రాజకీయాలకు తావివ్వకుండా, మన దేశ ఆధ్యాతికతను కాపాడుకుందాం.
మన దేశ ప్రజల మానసిక బలం భక్తి భావన, భగవంతుడు అని మరచిపోవద్దు.



**తీగవరపు శాంతి**

# అభిప్రాయ వేదిక

బాలాంత్రపు రజనీకాంతరావు గారి ముఖ చిత్రంతో వెలువడిన మే నెల పత్రిక చాలా సుందరంగా వుంది. మానసిక కాలుష్యం గురించి వ్రాసిన సంపాదకీయం ఆలోచింపచేసేలాగా ఉంది. సంపాదకీయం మీ పత్రికకు హైలైట్.

- మురళీధరరావు, అమలాపురం

కాలమే దొంగపిల్లి అని చక్కగా సెలవిచ్చారు భువనచంద్ర గారు. వర్తమానం లో జీవించటం అనేది అందరూ నేర్చుకోవలసిన ఒక జీవిత పాఠం. చక్కని కథ ప్రచురించినందుకు మీకూ, రచయితకూ మా ధన్యవాదాలు.

-శారద, రంగారావు, సరోజ, సుబ్బారావు, హైదరాబాదు

కాలమానం గురించి చక్కగా వివరించారు శ్రీ వేమూరి వారు. పూజలో స్థల కాలాల గురించి చెప్పటంలో అంతరార్థం బాగా విశదీకరించారు. చక్కని వ్యాసం ప్రచురించినందుకు మీకు ధన్యవాదాలు.

- పట్నాయక్, మేఘన, రవి, లక్ష్మి, విజయవాడ

వేసవి విడిది- భారతీ శర్మ గారు ఊహాలోకంలో విహరింపజేశారు. నిజంగా ఎవరైనా ఇలాంటి క్యాంపులు నిర్వహిస్తే ఎంత బావుణ్ణు!

- మల్లికార్జునశర్మ, న్యూ ఢిల్లీ

పోడూరి గారు చక్కగా వివరించారు 'రజని' గారి గురించి. మన ఆకాశవాణికి ఇలాంటివారు వేసిన గట్టి పునాదులవల్లే, ఈరోజుకు కూడా ఆకాశవాణి వన్నె తగ్గకుండా ఉంది. ఆయనకు నా నివాళులు.

భాను, బిందు, రమేష్, శైలజ-హైదరాబాదు

అప్పుల తిలాష్టకం చాలా బాగుంది. ప్రస్తుత పరిస్థితులను కళ్ళకు కట్టినట్టుగా కవితలో చూపించారు రచయిత. ధన్యవాదాలు.

రామారావు, మధుమతి చిక్కడపల్లి

మన విద్యా వ్యవస్థ గురించి రాం మోహన్ గారు అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తాను. చాలా చక్కగా వివరించారు రచయిత.

- రామ శాస్త్రి, రిటైర్డ్ టీచర్, అత్తాపూర్, హైదరాబాద్

డిజైనర్ గెడ్డం చాలా ఫన్నీ గా ఉంది. చాలా బాగా వ్రాసారు రచయిత.

- సాయి తేజ, మల్కాజిగిరి

ప్రహేళిక చాలా బాగుంటోంది. ఇంత మంచి శీర్షిక తీసుకువస్తున్నందుకు మీకు ధన్యవాదాలు.

- సుబ్రహ్మణ్య శర్మ, అవధాని హైదరాబాద్

రాశిఫలాలు బాగా కరక్ట్ గా ఉంటున్నాయి. మాకు బాగా ఉపయోగకరంగా ఉంటున్నాయి.

- చంద్రమోహన్, విశాఖపట్నం

ఈ నెల చైతన్యం మాస పత్రిక శతవసంతాల లలిత గీతాల చక్రవర్తి కీ.శే.బాలాంత్రపు రజనీకాంత రావు స్మృత్యర్థంగా ఆయన ముఖ చిత్రంతో పాటు పోడూరి శ్రీనివాసరావుగారు రాసిన రజని సమగ్ర జీవిత చిత్రణ ఆ మహానుభావునికందించిన గొప్ప నివాళి. నానాటికీ మితిమీరుతున్న కామాంధుల దుష్కృత్యాలను ఎండగడుతూ రాసిన సంపాదకీయం ఆలోచనాత్మకం. ఎప్పటి లాగానే భువనచంద్ర గారి దొంగపిల్లి దృష్టాంతంతో రాసిన ఆర్టికిల్ బాగుంది. మనుషుల మనస్తత్త్వాలను విశ్లేషించిన విధానం చదువరులను ఆకట్టుకునే రచన.ఆయనకు అభినందనలు.కవనశర్మ గారి విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వ్యాసం లేక పోవడం వెలితిగా ఉంది.ప్రతినెలా ఆయన రాస్తున్న సైన్సు విషయాలు మామూలు వారికి కూడా అర్థమయ్యేంత సరళంగా ఉంటున్నాయి.ముఖ్యంగా బడిలో చదువుకునే పిల్లలున్న తల్లిదండ్రులు ఇవి చదివి పిల్లల శాస్త్రీయ దృక్పథాన్ని పెంపందించవచ్చు.మిగతా అన్ని శీర్షికలకు చెందిన వ్యాసాలు కూడా ఎప్పటిలానే ఆసక్తికరంగా ఉన్నాయి.సాహిత్య ప్రహేళిక నిజంగా మెదడుకు మేత.విలువలతో కూడిన పత్రికను నిత్యనూతనంగా నిర్వహిస్తున్న సంపాదకవర్గానికి అభినందనలు.

తుమ్మూరి రాం మోహనరావు, ఆదిలాబాద్

# భువనచంద్ర



## కథ కాని కథ

"చూస్తూనే వున్నాను. పిల్లాడు మట్టి నోట్లో పెట్టుకున్నాడు. కళ్లప్పజెప్పి చూస్తూనే వుంది కానీ గబగబా వెళ్లి ఆ మన్ను తియ్యలేదు. ఏం మనిషి?" పనిమనిషితో సుశీల అనడం శేషారత్నానికి వినిపిస్తూనే వుంది.

"ఏం మనిషా! నా దారిన నేను బజారుకి పోతుంటే, 'అత్తమ్మా నేనూ వస్తా అని వెంటబడి వచ్చింది, ఏ మనిషీ? నేను కూరగాయలు కొంటుంటే పిల్లాడ్ని గాలికొదిలేసి మార్కెట్లో కనబడ్డ కమలమ్మతో కబుర్లు వేసుకుంది ఏ మనిషీ? నాకు మోకాళ్ళ నెప్పులనీ, గబగబా నడవలేనని తెలిసి కూడా పనిమనిషితో నంగనాచి కబుర్లు వొలకబోస్తున్నది ఏ మనిషీ?" వంటగదిలోకి దూసుకువెళ్లి కోడల్ని కడిగేసింది శేషారత్నం.

"ఓహో, వరండా లోంచి వంటగదిలోకి బాణం దూసుకొచ్చినట్టు దూసుకురాగలవు గానీ రెండడుగుల దూరంలో వున్న పిల్లాడు మన్ను నోట బెట్టుకుంటుంటే నడవలేవా?" వ్యంగంగా అన్నది సుశీల అత్తగారితో.



వాకిట్లో 'అప్పాచీ' బండి ఆగిన చప్పుడుకి ఇద్దరూ సైలెంటయ్యారు. శేషారత్నానిది బాగా కలిగిన కుటుంబమే. ఇద్దరు కొడుకులూ ఓ కూతురు. సుశీల రెండో కోడలు. పెద్దకోడలు కూడా ఓ యాభై మైళ్ళ దూరంలో వున్న మరో వూళ్ళో ఉంటోంది. పెద్దకొడుకు ఇంజినీరు, రెండోవాడు సాఫ్ట్ వేరు. భర్త ఊళ్ళో వున్నాడు. ఆయనదో చిద్విలాసం. బోలెడు ఆస్తి వుండగా పనేందుకు చెయ్యాలనే రకం.

కొడుకెదురుగా నవ్వుతూనే వున్నా, అటు శేషారత్నానికీ ఇటు సుశీలకీ ఇద్దరికీ ఒకరంటే ఒకరికి మంటగానే వుంది.

"ఏమిటమ్మా అలా వున్నావ్?" రోజూ వేసే ప్రశ్నే అవ్వాళా వేశాడు మోహన్ రావు.

"అంతా బాగానే వుందిరా. నేనూ బాగానే వున్నాను" కేజువల్ గానే అన్నా, మోహన్ కి ఏదో చిత్రంగా అనిపించింది.

"మోకాళ్ళ నెప్పులు ఏమైనా తగ్గాయా? లేకపోతే, డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళేదా?" పట్టి పట్టి తల్లిని చూస్తూ అడిగాడు

మోహన్. ఆ మాటకి శేషారత్నం గుండె నిండిపోయింది. 'కుక్కలెన్ని మొరిగితేనేం, నా కొడుక్కి నేనంటే పురాణం అనుకుని మురిసిపోయింది శేషారత్నం.

"ఏం లేదురా, ముందు నువ్వు కాఫీ తాగి విశ్రాంతి తీసుకో" మోహన్ తల నిమిరి హాల్లోకి వెళ్ళింది.

"ఏమోయ్ ... ఎలా వున్నావ్" పెళ్ళాన్ని పలకరించాడు మోహన్.

"ఎలా ఉంటానూ? బ్రహ్మాండంగా వున్నా. ప్రశాంతంగా వున్నా. ఆనందంతో మైమరచిపోతున్నా" చిటపట మొహంతో అన్నది సుశీల.

"ఓహో... అంత అద్భుతంగా వుంటే ఇంకేం మరీ!" పుండు మీద కారం జల్లినట్టు నవ్వి, బట్టలు మార్చుకోడానికి లోపలికెళ్ళాడు మోహన్.

అతనికి తెలుసు. తల్లి అప్పటిదాకా చచ్చే చాకిరీ చేసివుంటుందనీ, తనొచ్చే టైమైంది గనక పెళ్ళాం అప్పుడే 'డ్యూటీ' లోకి దిగి, పొద్దున్నించీ తెగ పని చేసినట్టు 'షో' ఇవ్వబో తోందనీ. అయితే తనకి తెలిసినట్టు ఏనాడూ పెళ్ళాం ముందు బయట పడలేదు.

"హూ... పిల్లాడ్ని పట్టుకోవడం నావల్ల కావడంలేదు. అన్ని పనులూ అయ్యాకే ఆ పనిమనిషి చేతులు దులుపుకుంటూ వచ్చింది. మీకేం..?" కాఫీ గ్లాసు చేతికిస్తూ మోహన్ తో అన్నది సుశీల.

"అవునవును. నిజంగా నీకు రెస్ట్ ఉండటం లేదు. పోనీ ఓ నెల మీ అమ్మగారింటి దగ్గర దింపిరానా?" సుశీల మొహం వంకే చూస్తూ అన్నాడు మోహన్.

"హూ... ఇప్పటికే మా అమ్మ మన పిల్లతో నానా యాతనా పడుతూ వుంటుంది. అది చాలదని నేనూ పిల్లాడు కూడా వెళ్లి ఆవిడ నెత్తిన కూర్చోవాలా? నా చావు నే చస్తా లెండి" విసవిసా వంటగది లోకి నడిచింది సుశీల.

ఆ మాటలన్నీ అత్తగారికి వినపడతాయని సుశీలకి తెల్సు. అసలు అత్తగారు వినాలనే అన్నదని మోహన్ కీ తెలుసు.

ఆలోచనలో పడింది శేషారత్నం. కావాలనే కూతుర్ని సుశీల తల్లితో పంపింది. పుట్టింట్లో వుండేది తల్లీ తండ్రీ ఇద్దరే. వాళ్ళిద్దరికీ మరే వ్యాపకమూ లేదు. కూతురు ఉంటే వాళ్ళకీ కాస్త టైం పాస్ అవుతుందనే గాక, శేషారత్నానికి కూతురు దగ్గరవడం ఇష్టం లేక పంపిందని శేషారత్నానికి తెలుసు.

మరుసటిరోజు పొద్దున్నే, "మోహనా, నన్ను అన్నయ్య ఇంటి దగ్గర దింపరా, మీ వదినకి నలతగా వుందిట" సూట్ కేస్ తో సిద్ధంగా వున్న శేషారత్నం కొడుకుతో అన్నది. తల్లివంక జాలిగా చూశాడు మోహన్. పెళ్ళానికి తన తల్లి పొడ గిట్టటంలేదని అతనికి బాగానే అర్థమవుతోంది.

"సరేనమ్మా" సూట్ కేస్ కార్లో పెట్టాడు.

"వెళ్ళొస్తాను సుశీలా,,, ఆరోగ్యం జాగ్రత్త" చెప్పేసి కారు ఎక్కింది శేషారత్నం.

********

శేషారత్నం కన్న కడుపు ఉడికిపోతోంది. కొడుకు రావడం ఆలస్యం.... 'ఏవండీ ఇవ్వాళ హోటల్లో తిందామండీ, ఏవండీ ఇవ్వాళ సినిమాకి పోదామండీ, ఏవండీ సరదాగా పిల్లల్ని పార్కుకి తీసుకుపోదామండీ' అంటూ కోడలు సతాయించడం శేషారత్నం భరించలేకపోతోంది.

వాడసలే ఓ పెద్ద కనస్ట్రక్షన్ కంపెనీలో సివిల్ ఇంజినీర్. పగలంతా బోలెడు చోట్లకి వెళ్ళి నానా హైరానా పడి ఇంటికి రాగానే పెళ్ళాం సన్నాయి నొక్కుళ్ళు. ఏం? రోజూ ఏదో ఓ ప్రోగ్రామ్ ఎందుకూ వెయ్యడం? హోటల్ కి పోయినప్పుడల్లా అయిదొందలో, వెయ్యో బిల్లు కట్టాలి. ఏం? అదే వంట ఇంట్లోనే చేసుకుంటే ఎంత ఖర్చు తగ్గుతుందీ? ఖర్చు సంగతి పక్కన పెడితే, ఎంత ఆరోగ్యంగా వుంటుందీ? కొంపలో బ్రహ్మాండమైన టి. వి. వుంది. నాలుగొందల ఛానళ్ళు వస్తాయి. వారానికి వెయ్యి రూపాయలు తగలేసి ఆ సినిమాలు థియేటర్లోనే చూడాలా? అసలు డబ్బుంటే వీళ్ళకి విలువ లేదా?

పదిహేను రోజుల తరవాత కోడలు సంపూర్ణ కొడుకు రాజేంద్రతో అనే మాటలు శేషారత్నానికి వినపడ్డాయి. "అది కాదండీ, పల్లెటూళ్ళో మీ నాన్నగారిని వదిలేసి ఆవిడ ఇక్కడా, మీ తమ్ముడి దగ్గరా వుండటం ఎందుకూ? అయినా, ఆవిడకి బోలెడంత మంట నేనంటే. సినిమాలకీ, షికార్లకీ మీచేత ఖర్చు పెట్టిస్తున్నానని. ఇప్పుడు ఎంజాయ్ చెయ్యకపోతే ముసలితొక్కులం అయ్యాక ఏమి ఎంజాయ్ చేస్తాం? ఆమాత్రం ఆలోచన ఆవిడకి రాదా?" అని.

సైలెంటై పోయింది శేషారత్నం. బిడ్డలంటే పిచ్చి ప్రేమ. వాళ్ళని వొదిలి ఉండలేక నెలకో, రెండు నెల్లకో వచ్చి ఇద్దరి దగ్గరా కొన్ని రోజులుండేది!

శేషారత్నం మనసు వికలమైంది. కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. సెల్ ఫోన్ మోగింది. కూతురు అపర్ణ ఫోనది.

"హలో ... అపూ.. నేనే మీ అమ్మని" ఆనందంగా అన్నది శేషారత్నం.

"అమ్మా... ఎలాగున్నావ్.. మరే పిల్లలు అమ్మమ్మేదీ అని కలవరిస్తున్నారు. ఓ వారం ఇక్కడికి వచ్చెయ్యకూడదూ! మీ అల్లుడుగారు కూడా నిన్ను రమ్మని మరీమరీ చెప్పమన్నారు" గడగడా అన్నది అపర్ణ.

"అలాగే, రాజేంద్రతో చెప్పి రేపే బయల్దేరతా... నువ్వా వాడికోసారి ఫోన్ చేసి చెప్పు" సంతోషంగా అన్నది శేషారత్నం. కూతుర్ని చూసి అప్పటికి ఆర్నెల్లు అయిందాయే !

*******

అల్లుడు ఆఫీసు నుంచి రాగానే అపర్ణ, "ఏవండీ, ఇవ్వాళ హోటల్ కి వెళ్లాల్సిందే" ముద్దుగా అడగటం విన్నది శేషారత్నం. కుతూహలంగా చెవులు రిక్కించింది.

"దేవిగారి ఆజ్ఞ. కాదనడానికి నాది గుండే .. చెరువా !" అపర్ణ బుగ్గ మీద చిటిక వేసి అన్నాడు అల్లుడు కరుణాకర్.

"అమ్మా... ఇవ్వాళ భోజనం హోటల్లో... ఆ తరవాత సినిమా" ఉత్సాహంగా తల్లితో అన్నది అపర్ణ.

"హాయిగా వెళ్ళిరామ్మా" తృప్తిగా అన్నది శేషారత్నం.

ఉహూ... నువ్వూ రావాల్సిందే" పట్టు పట్టింది అపర్ణ.

"నేనెందుకే ...నేను పిల్లల్ని చూసుకుంటూ ఇంట్లో వుంటాను గానీ, మీరిద్దరూ వెళ్ళిరండి. అయినా, యీ వయసులో ఎంజాయ్ చెయ్యకపోతే ఎప్పుడు ఎంజాయ్ చేస్తారూ?" కూతురి బుగ్గ పుణికి అన్నది శేషారత్నం.

****

ఈ కథ కథ కాదు. అన్ని చోట్లా జరిగే వ్యవహారమే. అప్పటిదాకా అత్తలతో పనిచేయించి, మొగుడు రాగానే తామే అన్ని పనులూ చేస్తున్నట్టు పోజులిచ్చే కోడళ్ల కథ.

కూతురు చేస్తే,'అహో' అని మురిసిపోయి, అదే పని కోడళ్ళు చేస్తే పొదుపు గురించీ, ఆరోగ్యం గురించీ కుక్క మీదా, పిల్లిమీదా పెట్టి ఉపన్యాసాలిచ్చే అత్తల కథ.

ఇటు పెళ్ళానికి, అటు తల్లికీ ఏం చెప్పుకోవాలో, ఎలా సయోధ్య కుదర్చాలో తెలియక ఇద్దరి మధ్యా నలిగే కొడుకుల కథ

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, తల్లులు తమ కొడుకుల పిల్లల కంటే, కూతుళ్ళ పిల్లల మీద ఎక్కువ ప్రేమనీ, ఎక్కువ పక్షపాతాన్నీ చూపించడం. ఎందుకీ వివక్ష? ఒకే కుటుంబంలో ఇన్ని తేడాలు ఎందుకూ?

ఓ పెద్దాయన అన్నాడు, "స్వామీ, ఇది ఇవాళ్టి సమస్య కాదు. ఇదో పురాణవైరం. ఈ కథల్లోని శేషారత్నం భర్తలాగా, ఎవరింట్లోనూ పీఠం వేసుకోకుండా, పల్లెటూళ్ళో పాడీ పంటా చూసుకోవడం మహోత్తమం" అని.

"కూతురు తన కడుపు చించుకు పుట్టింది, అందువల్ల కూతురి సంతోషాన్ని తల్లి ఎప్పుడూ కోరుకుంటుంది, అయితే కోడలు పుట్టింది తన కడుపులోంచి కాదు కదా...? అందుకే తప్పులెన్నుతుంది!" అన్నది ఓ మహా విజ్ఞురాలైన తల్లి.

(19 వ పేజీ చూడండి )

# వేమూరి వేంకటేశ్వరరావు



## ఈ విశ్వం వయస్సు ఎంత?

బ్రహ్మ ఆయుర్దాయం 100 సత్య లోకపు దినాలు (లేదా సంవత్సరాలు) అని అనుకున్నాం కదా. ఈ కాలాన్నే 'పర' అంటారు. ఇందులో సగం 'పరార్ధం.' మన బ్రహ్మకి ఏభై ఏళ్ళ వరకూ ఉన్న కాలం ప్రథమ పరార్ధం. మన ఇప్పటి బ్రహ్మ ఇప్పటి వయస్సు 51; కనుక మనం ఇప్పుడు ద్వితీయ పరార్ధంలో ఉన్నాం. ఈ 51 వ సంవత్సరాన్ని శ్వేత వరాహ కల్పం అంటారు. (మన భూలోకంలో ప్రభవ, విభవ, లాంటి పేర్లు ఉన్నట్లే, సత్యలోకంలో ప్రతి 'ఏడు' కి ఒక పేరు ఉందన్న మాట..) ఈ శ్వేత వరాహ కల్పంలో ప్రస్తుతం నడుస్తూన్న మన్వంతరం పేరు వైవశ్వత మన్వంతరం. ఈ వైవశ్వత మన్వంతరంలోని 28 వ మహాయుగంలోని కలియుగంలో, ప్రథమ పాదంలో ఉన్నాం. ఈ కలియుగం శ్రీకృష్ణ నిర్యాణంతో ఉరమరగా 5,000 ఏళ్ళ క్రితం మొదలైంది. ఈ ప్రథమ పాదంలోనే కలియుగం ఇలా మండిపోతోంది. ఇహ చతుర్ధ పాదంలో ఎలా ఉంటుందో మీ ఊహకి వదిలేస్తాను.

పై పేరాలో 'మన ఇప్పటి బ్రహ్మ ఇప్పటి వయస్సు' అని వాడేను. చదువరులలో కుశాగ్రబుద్ధులు కొందరు, "మరొకప్పుడు మరొక బ్రహ్మ ఉండేవాడా?" అని అడగొచ్చు. అలా అడిగేవారికి ఒక కథ చెబుతాను. సావధానంగా ఆలకించండి.

ఆష్టావక్రుడు, రోమహర్షుడు

ఒకనాడు స్వర్గలోకంలో ఇంద్రుడు చాల ఉషారుగా ఉన్నాడు. అప్పుడే రాక్షసుల మీద దండయాత్ర చేసి, వారిని హతమార్చి, విజయోత్సాహంతో ఉన్నాడేమో వ్యక్తి అఘమేఘాల్లోనే ఉన్నాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఒక విజయ స్తంభం – ఛ! స్తంభం ఏమిటి, మరీ భూలోకపు రాజుల్లా – ఒక పెద్ద భవనం నిర్మించటానికి సమకట్టేడు. (ధర్మరాజులవారు రాజసూయ యాగం చేసే ముందు మయ సభ నిర్మించ లేదూ, అలాగన్న మాట.) వెంటనే విశ్వకర్మకి కబురు పెట్టేడు. విశ్వకర్మ ఇంద్రుడి ఆజ్ఞని శిరసావహించి రాజభవనానికి కావలసిన హంగులన్నీ కూర్చి ఒక దివ్యమైన కట్టడానికి రూపు రేఖలు దిద్దుతున్నాడు. కట్టబోయే భవనం నమూనాలు చూసినప్పుడల్లా ఇంద్రుడి మనస్సులో కొత్తకొత్తవి, పెద్దపెద్దవి అయిన ఊహలు మొలకెత్తటం మొదలెట్టేయి. తనంతటి వాడు తను. రాక్షసుల చేత మట్టి కరిపించిన తను. తన అంతస్తుకి తెస్సోడుతూన్న భవనమా? అందుకని భవనం చుట్టూ ఒక ఉద్యానవనం కావాలన్నాడు. విశ్వకర్మ 'సరే' అన్నాడు. తర్వాత వనంలో పాలరాతి లతాగృహం అన్నాడు. విశ్వకర్మ 'సరే' అన్నాడు. తర్వాత పాలరాతి గోడలమీద రత్నాలు తాపడం పెట్టాలన్నాడు. విశ్వకర్మ 'సరే' అన్నాడు. ఆ తర్వాత జలయంత్రాలు, అంబుస్ఫోటాలు కావాలన్నాడు ఇంద్రుడు. ఇలా అధికార మదాంధతతో రోజుకో కొత్త కోరిక వెలిబుచ్చుటం మొదలు పెట్టేసరికి విశ్వకర్మకి విసుగు పుట్టుకొచ్చింది.

విశ్వకర్మ రహశ్యంగా ఊర్ధ్వలోకమైన సత్యలోకానికి ప్రయాణమై వెళ్ళేడు. బ్రహ్మకి అసలు విషయం అవగాహన అయింది. పరిస్థితికి తగిన చర్య జరుగుతుందని నచ్చుజెప్పి, విశ్వకర్మని

దిగువకి పంపి తనేమో ఊర్ధ్వలోకమైన వైకుంఠానికి వెళ్ళేడు. అక్కడ విష్ణుమూర్తి కథ అంతా సావధానంగా విన్నాడు.

మరునాడు ఇంద్రుడు సింహాసనారూఢుడై, అప్సరసల సాన్నిధ్యంలో ఆనంద డోలికలో ఊగిసలాడుతూ ఉన్న సమయంలో పట్టుమని పదేళ్లు కూడ నిండని ఒక బాలుడు ఒక చేతిలో దండం, మరొక చేత కమండలం, చంకలో కృష్ణాజినం, ముఖంలో దివ్యమైన తేజస్సుతో ఆస్థానంలో ప్రవేశించేడు. అతడు సకల విద్యా కోవిదుడని చెప్పకుండానే తెలుస్తోంది.

ఇంద్రుడు ఆ బాలుడిని చూసి సింహాసనం దిగి ఎదురేగి స్వాగతం పలికేడు. అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి యథోచితంగా అతిథిని సత్కరించి, "స్వామీ, తమరెవరో, తమ రాకకి కారణం ఏమిటో శలవియ్యండి" అంటూ వినయ విధేయతలతో అడిగేడు.

"ఓ, మహాబలీ! ప్రపంచంలో ఎక్కడా కనీ వినీ ఎరగని అత్యద్భుతమైన రాజప్రాసాదాన్ని నిర్మిస్తున్నావని నాలుగు నోట్లా విని విషయావలోకన చేసి పోదామని వచ్చేను. గతంలో ఏ ఇంద్రుడూ ఇటువంటి సౌధాన్ని నిర్మించలేదటగదా?"

గర్వమదాంధతతో ఉన్న ఇంద్రుడు ఈ ముక్కుపచ్చలారని బాలుని ధిషణని పరాభవించటానికా అన్నట్లు, తూష్ణీంభావంతో, "వత్సా, ఎంతమంది




ఇంద్రులని చూసేవేమిటి? అహ, ఎంతమంది ఇంద్రుల గురించి విన్నావేమిటి?" అని హేళనగా అడిగేడు.

ఆ ప్రశ్నకి సమాధానంగా మందస్మిత వదనారవిందంతో ఆ బాలుడు ఇలా అన్నాడు.

"దేవేంద్రా! కుమారా! సావధానంగా విను. నేను చాల మంది ఇంద్రులని చూసేను. నీ తండ్రి కశ్యపుడిని నాకు తెలుసు. బ్రహ్మకి కుమారుడు, నీకు తాత అయిన మరీచిని నాకు తెలుసు. ఆ బ్రహ్మ విష్ణుమూర్తి నాభి లోని కమలం నుండి ఉద్భవించటం నేను స్వయంగా ఎరుగుదును. ఆ మాటకొస్తే సాక్షాత్తూ ఆ విష్ణుమూర్తినే నేను ఎరుగుదును.

"సృష్ట్యాది ప్రళయ పర్యంతం జరిగే కార్యక్రమాన్ని అంతా కళ్లారా చూసిన వ్యక్తిని నేను. ఒక సారి కాదు. పదే పదే చూసిన వాడిని. ప్రళయ సమయంలో విశ్వస్వరూపం ఎలా ఉంటుందో తెలుసా? 'ఈ విశ్వం' లోని స్థావర జంగమాత్మకమైన ప్రతి అణువు నామరూపాలు లేకుండా నశించిపోయి ప్రళయ నిశీథిలోని అనంతంలో లీనమై అదృశ్యమైపోతుంది. ఆ దృశ్యం వర్ణనాతీ-

తం.

" 'ఈ విశ్వం' అన్నాను కదూ? ఇటువంటి విశ్వాలు ఎన్నో! ఎన్నని ఎవరు లెక్కపెట్టగలరు? అవి అనంతం. సముద్రంలోని నీటి బుడగలులా అనంతమైన విశ్వాలు అలా ఉద్భవిస్తూనే ఉంటాయి, నశిస్తూనే ఉంటాయి. ఒకొక్క విశ్వంలో సృష్టికార్యాలు నిర్వహించటానికి ఒకొక్క బ్రహ్మ. ఇటువంటి విశ్వాలలోని ప్రపంచాలలో ఇక ఇంద్రులు ఎంతమంది ఉంటారో? వారిని లెక్క పెట్టే ఓపిక ఎవ్వరికి ఉంది? సముద్రపుటొడ్డున ఉన్న ఇసక రేణువులని లెక్కపెట్టగలమా?

"ఒకొక్క ఇంద్రుడు ఒకొక్క మన్వంతరం పాటు రాజ్యం ఏలుతాడు. ఇలాంటి ఇంద్రులు 28 అయేసరికి బ్రహ్మకి ఒక రోజు....."

ఇలా చెప్పుకు పోతూన్న ఆ కథనాన్ని ఆ బాలుడు హఠాత్తుగా ఆపి, నేల మీద బారెడు వెడల్పున బారులు తీర్చి పోతూన్న చీమలని చూసి ఒక చిరునవ్వు నవ్వేడు.

"మహానుభావా! ఎందుకు కథనాన్ని ఆపివేసేరు? ఎందుకలా నవ్వుతున్నారు?" అని ఇంద్రుడు ఆత్రుతగా అడిగేడు.

"ఎందుకు నవ్వుతున్నానా? అది పరమ రహశ్యం. దుఃఖానికి మూల కారణం ఏమిటో ఈ రహశ్యంలో ఇమిడి ఉంది. చీకటిలో తాడుని చూసి పాము అని ఎలా అనుకుంటామో, దీపపు వెలుగులో అది పాము కాదు, తాడే అని ఎలా తెలుసుకుంటామో అలాగే జ్ఞానోదయం అయిన వ్యక్తి ఈ సృష్టిలోని నిజానిజాల తారతమ్యాన్ని తెలుసుకో గలుగుతున్నాడు. చూడు, ఈ చీమల బారు ఎంత పెద్దగా ఉందో. బారెడు వెడల్పుతో ఒక నదీ ప్రవాహంలా పాకుతూన్న ఈ చీమలన్నీ ఒకనొకప్పుడు నీలాగే ఇంద్ర పదవిని అధిష్టించిన వారే. వారి కర్మానుసారం ఇలా చీమల జన్మ ఎత్తి కర్మ పరిపక్వం కొరకు ఎదురుచూస్తున్నారు....."

ఆ బాలుడు ఇలా ఉపదేశం చేస్తూ ఉంటే సభలోనికి మరొక విచిత్రమైన వ్యక్తి వచ్చేడు. అతనికి నఖశిఖ పర్యంతం జుత్తే. ఛాతీ మీద మాత్రం గుండ్రంగా కొంత మేర రోమాలేవీ లేకుండా బోడిగా ఉంది. ఆ ఖాళీ చుట్టూ వలయాకారంగా బొద్దుగా జుత్తు పెరిగి ఉంది.

ఇప్పటికే సంభ్రమాశ్చర్యాలలో మునిగి తేలుతూన్న ఇంద్రుడు తేరుకొని, "మహానుభావా! తమరు ఎవ్వరు? ఎక్కడనుండి వస్తున్నారు? నేను మీకు ఏ విధంగా సేవ చెయ్యగలను?" అని కుశల ప్రశ్నలు వేసేడు.

"ఇంద్రా! నువ్వు దిగ్విజయ యాత్ర ముగించుకొని ఒక అత్యద్భుతమైన భవనం నిర్మిస్తున్నావని విని ఆ భవనం చూసిపోదామని వచ్చేను.

"నేనెవరినా? నన్ను రోమహర్షుడు అంటారు. నా వక్షస్థలం చూస్తున్నావు కదా. ఒకొక్క ఇంద్రుడు మరణించినప్పుడల్లా ఒకొక్క వెంట్రుక ఈ వక్షస్థలం నుండి రాలి పోతుంది. అందుకనే మధ్యలో వెంట్రుకలు లేకుండా బోసిగా ఉంది.

"ఈ ద్వితీయ పరార్ధం పూర్తి అయేసరికి ఇప్పటి బ్రహ్మ జీవితం చాలిస్తాడు. అప్పుడు వచ్చే మహా ప్రళయంలో నేను కూడ లీనమయిపోతాను. ఇటువంటి అల్పాయుద్దాయంతో పెళ్లి చేసుకుని జంఝాటన పెంచుకోవటమెందుకని బ్రహ్మచారిగా ఉండిపోటానికే నిశ్చయించుకున్నాను. ఆ విష్ణు మూర్తి ఒక్క సారి కళ్ళు తెరచి మూసే వ్యవధిలో ఒక బ్రహ్మ జీవిత కాలం పూర్తి అయిపోతుంది."

ఈ మాటలు చెబుతూ రోమహర్షుడు అకస్మాత్తుగా అదృశ్యమైపోయాడు. చీమల బారు గురించి చెబుతూ ఉన్న బాలుడు ఎప్పుడో అదృశ్యమైపోయాడు.

ఇదంతా వింటూన్న ఇంద్రుడికి గర్వభంగం అయింది. తను భవన నిర్మాణ పథకాన్ని విరమించుకున్నట్లు విశ్వకర్మతో సవినయంగా మనవి చేసుకున్నాడు.

అదండీ, భారతీయులు ఈ విశ్వం ఎంత పురాతనమైనదో చెప్పటానికి ఈ కథ అల్లి చెప్పేరు.

విశ్వం వయస్సు 13.7 బిలియను సంవత్సరాలు అని ఎవ్వరైనా చెబితే వారికి ఈ కథ చెప్పండి.

# ఆదూరి హైమవతి



## సంతాపమే సరైన మందు

ఆంధ్రకేసరి హైస్కూల్లో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం జరుగుతున్నది. హెడ్ మాస్టారు గారు విడివిడి గా ఒక్కో క్లాస్ ఉపాధ్యాయులనూ, తల్లిదండ్రుల నూ వేరు వేరు గదుల్లో సమావేశపరిచారు. వారి పిల్లల గూర్చిన ఇబ్బందులూ, తలిదండ్రుల విన్నపాలూ అన్నీ పర్సనల్ గా తెలుసుకుంటూ సంబంధిత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతోనూ, అవసరం మేరకు హెడ్మాస్టారు గారితోనూ సంప్రదించసాగారు.

ఎనిమిదో తరగతి గదిలో పంకజ తల్లిదండ్రులకు ఆఫీసు ఉండటాన వారికి బదులుగా ఆమె తాతగారు హాజరయ్యారు. పంకజ అన్నిట్లోనూ ఫస్టే. ఆటలు, పాటలు, నృత్యమూ, సంగీతమూ,చిత్రలేఖనములతో పాటుగా చదువులోనూ ముందే ఉంటుంది. అలాంటి వారి గురించి చెప్పేదేముంటుందీ!.

ఐతే పంకజ విషయంలో ఒక విషయం ఉంది. దాన్ని అందరి ముందూ చెప్పటానికి ఉపాధ్యాయ బృందం మొహమాట పడి హెడ్ మాస్టారి గదికి పంకజ తాతగారైన పర మేశ్వర్రావుగారిని పంపారు. హెడ్ మాస్టారు గారు చెప్పిన విషయం విని సబ్ కలెక్టర్ గా చేసి రిటైరైన పరమేశ్వ ర్రావు గారు చిన్న బుచ్చుకున్నారు.

అదిగమనించి హెడ్ మాస్టారు గారు "మన్నించండి సార్! అంత తెలివైన పిల్ల, అన్నిట్లోనూ ఫస్ట్ ఉండే మా స్టూడెంట్ ఈ ఒక్క విషయం లోనూ బాగుండాలని మీకు చెప్పాను. మావిద్యార్థిని అన్నిట్లోనూ బాగుచేయడం మా బాధ్యతకదా! తల్లిదండ్రులు తోట మాలులైతే ఉపాధ్యాయులం తోట కాపలాదారులం కదా! ఏ మొక్కకు ఏ చీడ పీడలు పట్టాయో గమనించి తోట మాలికి చెప్పడం మా ధర్మమని చెప్పాము .మిమ్ము బాధించి ఉంటేమన్నించ గలరు " అన్నారు.

పరమేశ్వర్రావుగారు "లేదు మాస్టారూ ! మీరు సరైన పనే చేశారు. ఈ వేసవిలో ఆచీడ వదిలించే మందు నేను వేస్తాను. చీడ వదిలిందీ లేనిదీ మీరు తర్వాత తెలియ పరచండి" అని, సెలవు తీసుకుని లేచి వచ్చారు.

ఇంటికి వచ్చాక ఆయన భార్య భారతమ్మను పిలిచి రహస్యంగా మాట్లాడారు. ఆమె అన్నింటికీ తల ఊచి అంగీకారం తెలిపాక, ఆ సాయంకాలం పంకజాన్ని పిలిచి "అమ్మా! పంకజం! ఎటూ వేసవి సెలవులు కదా! మన ఊర్లో ఉన్న మన తోటలూ పొలాలూ చూసి వద్దాం వస్తావా! మామిడికాయలు పక్వానికి వస్తే పండ్లూ, పచ్చడి కాయలతో ఊరగాయలూ పెట్టించుకువద్దాం. నేను బామ్మా వెళు తున్నాం. మేం వెళ్లితే నీ ఒక్కర్తెవే ఉండాలి ఇంట్లో --ఆలోచించి చెప్పు. ఉదయాన్నే మేం కార్లో బయల్దేరి వెళుతున్నాం. వచ్చేపనైతే వెళ్ళి బట్టలు సర్దుకో" అనిచెప్పి రామాయణం చదువుకోడంలో లీనమయ్యారు. క్లాసులూ, పాఠాలూ, పరీక్షలు వీటన్నింటితో విసిగి ఉండటాన కాస్త ఛేంజ్ గా ఉంటుందని,- మరునాడు తాత, బామ్మగార్లతో పాటుగా పంకజం కార్లో పల్లెకు బయల్దేరింది. దారిపొడవునా

కనిపిస్తున్న పొలాలూ, కూరగాయల, పూల తోటలూ అన్నీ చూస్తూ దార్లో కారాపి పిల్లాపేర్లో కాళ్లు పెట్టి ఊస్తూ మహదా నంద పడింది పంకజం. మధ్యాహ్నానికి ఊరుచేరారు. వస్తున్నట్లు ఫోన్ చేసి చెప్పటాన వారికి లంచ్ ఏర్పాటు చేసి, ఇల్లంతా శుభ్రపరచి ఉంచారు పాలేర్లు.

వారంతా తాతగారిపట్ల, బామ్మగారిపట్లా చూపుతున్న శ్రద్ధకూ, గౌర వానికీ ఆశ్చర్యమేసింది పంక జానికి . బామ్మ, తాతగారూ కూడా వాళ్ళ నలాగే స్వంత వారిలాప్రేమగా పిలవడం మర్యాదగా మాట్లాడటం గమనించింది. తాతగారు పాలేర్ల పిల్లలనంతా పిలిపించా రు. "బంగార్లూ ! మా మనవరా లు పంకజానికి ఊరుకొత్త. ఎప్పు డో పసితనంలో వచ్చింది. గుర్తు కూడా ఉండి ఉండదు.మీరు ఊరంతా చూపండి. మన పెర ట్లో కట్టిన ఉయ్యాలల్లో ఊగండి. బామ్మగారు అందరికీ తిను బం డారాలు పంపుతారు.హాయిగా తినండి. రేపు ఉదయాన్నే అంద రం మామిడి తోటకెళ్దాం." అని చెప్పగానే అంతా 'భలే భలే తాతగారూ!' అంటూకేరింతలు కొట్టారు.

వాళ్ళంతా తాతగారినీ, బామ్మ నూ చేతులు పట్టుకుని ఊపడం, దగ్గరగా వచ్చి మాట్లాడటం, తాతా బామ్మ కూడా వారిని బుగ్గ లు నొక్కి, ముద్దు పెట్టుకుని, తల నిమురుతూ దగ్గరకు తీసు కోడం నచ్చలేదు పంకజానికి. అంతా పెరట్లో వేప, చింత చెట్ల కుకట్టిన తాటి ఉయ్యాలల్లో సెటి లయ్యారు. ఒకర్నొకరు ఊపుకుం టూ పాటలు అందుకున్నారు. తన నెవ్వరూ గౌరవంగా చూడక పోడం, ప్రత్యేక శ్రద్ధ చూపక పో డం ఏమాత్రం నచ్చలేదు పంక జానికి. బామ్మ చేయించి పంపిన పకోడీలు, పల్లీలూ అంతాపంచు కుతిని పంకజానికి ప్రత్యేకంగా ఇవ్వ లేదు. అంతా తినగా మిగి లిన వాటిని విధిలేక తీసుకుంది పంకజం, ఆకలిగా ఉండటాన. ఆరాత్రి నిద్రపట్టక అటూ ఇటూ కదులుతూనే ఉంది. తనను స్కూల్లో ఎంత స్పెషల్ గా చూస్తా రు! ఈపల్లె కుంకలు తనను పట్టించు కోకుండా వాళ్ళలో వారే ఆడుకోడం నచ్చనేలేదు. నేరక పోయి వచ్చాను.అనుకుంటూ తెల్లవారు ఝామున నిద్రపోయిం ది. బామ్మ తట్టి లేపుతుంటే లేచింది. అప్పటికే వాకిట్లో పిల్లల అరుపులు కేకలు కోలాహలంగా ఉన్నాయి. గబగబాలేచి తయారై వచ్చింది.ఆమె వేసు కున్న పలచటి సిల్క్ పంజాబీ డ్రెస్ చూసి అంతా పక పకా నవ్వారు.' వీటితోనా తోటకు వచ్చేది.' అని. ఏడుపు వచ్చింది పంకజానికి. బామ్మ లోపలికి పిలిచి ' తోటలో వేడి గా ఉంటుంది.వెళ్ళి నేను అక్కడ పెట్టిన పరికిణా జాకెట్ వేసుకురా! చక్కగా అందరిలో కలసిపోతావ్ " అని ఇచ్చిన పరికిణా జాకెట్ వేసుకు వచ్చింది. అంతా ట్రాక్టర్ లో ఎక్కి గలగలామాట్లాడుకుంటూ కూర్చు న్నారు. దార్లో తాతగారు "బంగార్లూ!మీలో ఎంత మంది కి కోతికొమ్మచ్చి వచ్చు? ఎంత మందికి ఈతకొట్టడం వచ్చు?ఎందరికి కబడ్డీ ఆట వచ్చు?"అని అడిగారు. అంతా" తాతగారూ! మేం మన పంట కాలువ ఆచివర నుంచీ ఈ చివరవరకూ ఈదగలం. కోతి కొమ్మ చ్చిలో ఈ సుందరి ఫస్ట్ ,చిటారు కొమ్మ ఎమ్మెక్క గలదు. కబడ్డీలో ఎప్పు డూ సుబ్బు ఫస్ట్. "అని చెప్పారు.

"మరిమీలో ఎందరికి రంగోలీ వచ్చు?"అని తాతగారు అడగ్గా నే "తాత గారూ ! మన మామిడి తోటలోని హనుమాన్ గుడిచు ట్టూ ఇప్పుడే మే మంతా రంగోలీ పెడతాము.మీరే ఎవరి రంగోలీ బావుందో చెప్పాలి. "సరే అలాగే మరి మపూలతోటలోని పూలు కోసి ఉంచమని పుల్లనకు చెప్పను. ఆపూలతో మన హను మాన్ జీకి పులమాల అందంగా అల్లి నవారికి కూడా బహుమతులుంటాయి" అనితాతగారు అనగానే అంతా 'హోహోహో భలేభలే ' అని అరిచారు. ఎందుకో ఇదంతా చికాగ్గా ఉంది పంకజానికి.

(ఇంకా వుంది)

# పాలెపు బుచ్చిరాజు



## ముల్లా నస్రుద్దీన్ కథలు

### పరిచయం

బాలలూ!

మీరు తెనాలి రామకృష్ణుని కథలు ఎన్నో చదివారు కదా! చాలా హాస్యంగా, వినోదాన్ని, విజ్ఞానాన్ని కలిగించేవిగా, ఒక్కొక్కసారి కనువిప్పు కలిగించేవిగా, గర్వం గలవారికి బుద్ధిచేప్పేవిగా, మరొకసారి కన్నీరు తెప్పిస్తూ, రకరకాలుగా మనల్ని అలరిస్తాయి. అలాంటివే ఈ ముల్లా నస్రుద్దీన్ కథలు కూడా.

చాలా వందల సంవత్సరాల క్రిందట టర్కీలో, చిన్నా చితకా వ్యాపారం చేసుకుంటూ బతికే ఒక బీద కుటుంబంలో పుట్టాడు నస్రుద్దీన్. అతని తండ్రికి భగవంతుడంటే భయమూ భక్తీ కూడా. కష్టపడువారిని భగవంతుడు ఆదరించును అని నమ్మి, నిత్యమూ దైవ పూజలు చేసుకుంటూ ఊరూరా తిరిగి, సరుకులు అమ్ముకుంటూ, వచ్చిన దానితో సంతోషపడి బతుకు వెళ్ళ బుచ్చేవాడు. అతని కొడుకు నస్రుద్దీన్ కి తండ్రి బుద్ధులు ఏమాత్రం రాలేదు సరికదా, సమయం దొరికినప్పుడల్లా, నిద్రపోతూ, కాలాన్ని వృధా చేసే వాడు. ఏ పని చెప్పినా దానిని శ్రద్ధగా చేసేవాడు కాడు. అతని తండ్రి అతని మీద ఎన్నో ఆశలు పెంచుకున్నాడు. వాడిని పెంచి పెద్ద చేసి, బడికి పంపి, మంచి చదువులు చెప్పించి, గొప్ప మత గురువుగా చెయ్యాలని కలలు కనేవాడు. ఆ రోజుల్లో మత గురువులదే రాజ్యం. ప్రజలకి వారెంత చెప్పుతే అంత.

"బాబూ! నస్రూ! బాగా చదువుకోరా నాన్నా!" అని చక్కగా బోధించి, బడికి పంపేవాడు తండ్రి. నస్రు ఎంత బద్ధకస్తుడైనా, చదువులో మాత్రం చురుకుగా ఉండే వాడు. ఏదైనా ఒకసారి వింటే మరిచే వాడు కాదు. దానికి తోడు, హాస్యంగా మాట్లాడి, తోటిపిల్లల్ని నవ్వించేవాడు. వాదోపవాదాలు వస్తే, నస్రుద్దీన్ దే పై చేయి. ఇలా మన నస్రు పెరిగి పెద్ద వాడై, తన చిలిపి చేష్టలతోను, నవ్వులాటలతోను, తన వీధిలో ను, ఊరిలోనే కాక చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా మంచివాడని పేరు తెచ్చుకున్నాడు. ఈ వార్త ఆ నోటా, ఆ నోటా వ్యాపించి, ఆ దేశపు రాజుగారి దాకా వెళ్ళింది. రాజుగారు కూడా అతని చాకచక్యాన్ని మెచ్చుకుని, తన కొలువులో ఒకడిగా చేర్చుకున్నారు. దానితో అతని పలుకుబడి బాగా ఎదిగింది. దేశం అంతా అతని చేష్టల్ని పొగుడుతూ ఉండేవారు. పలుకుబడితో బాటు ధనం కూడా సంపాదించడంతో, అతని అభివృద్ధి ని చూసి ఓర్వలేనివారు కొందరు అసూయతో అతనికి శత్రువులు అయ్యారు. ఏమయితేనేం, నస్రు మాత్రం తన ధోరణిలో ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ , సంతోషంగా ఉండేవాడు.

అతని శత్రువులు మాత్రం ఊరుకోక అతన్ని ఎలాగైనా పడగొట్టాలని ఎత్తులు వేస్తూ ఉండేవారు. వారి ఎత్తులకి పై ఎత్తులువేయగల తెలివితేటలు ఉన్నవాడు నస్రుద్దీన్. తన చాకచక్యంతో వారికి శృంగ భంగం చేసి తప్పు చేసినందుకు అందరూ పశ్చాత్తాప పడేలా చేసేవాడు నస్రుద్దీన్. అలా అతను చేసిన పనులే కథలు కథలుగా చెప్పుకుని ప్రజలు ఆనందించేవారు. ఈ విధంగా అతని కీర్తి, టర్కీలో-

నే కాకుండా అరేబియా, ప్రష్యా వంటి విదేశాల్లో కూడా వ్యాపించింది. అలా తరాలతరబడి అనుశ్రుతంగా వచ్చిన కథలే ఈ ముల్లా నస్రుద్దీన్ కథలు.

ఇప్పుడు మనం అటువంటి కథలు కొన్ని చదివి ఆనందిద్దాం.

# మొట్టమొదటి ఉద్యోగం

నస్రుద్దీన్ బడికి వెళ్లి శ్రద్ధగా చదువుకుంటూ, బాగా లోక జ్ఞానం కూడా సంపాదించాడు. వాడు పెరుగుతున్నకొద్దీ బాధ్యతలు కూడా అర్థం కాసాగాయి. తన తల్లి తండ్రులు చాలా బీదవారని, తనని చదివించడానికి, చాలా కష్టపడుతున్నారని గ్రహించాడు. తానూ ఉద్యోగం చేసి ఏదో కొంత సంపాదించి, వారికి సాయం చేయాలని అనుకున్నాడు. కాని ఏం చేయాలి? తానేమో పగలంతా బడిలో ఉంటాడు. సాయంత్రం ఇంటికి వచ్చి నిద్రపోతాడు. ఇలా అయితే ఎలా సాగుతుంది? ఆలోచించి, ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చాడు. పగటి పూట బడికి వెళ్ళినా సాయంత్రం సమయంలో కొన్ని గంటల సేపు ఏదైనా కూలిపని చేసి ఇంతో అంతో సంపాదించ వచ్చును కదా! ఈ ఉపాయం తట్టగానే తండ్రి దగ్గరికి వెళ్లి తన ఉద్దేశం చెప్పాడు.

తండ్రికి అది అంతగా నచ్చ లేదు. “ నాయనా! నువ్వు బడికి వెళ్లి చదువుకుంటున్నావు. మంచి చదువులు చదివితే ఏ మతగురువుగానో స్థిరపడి మంచి పేరు తెచ్చుకోవచ్చును. డబ్బు కూడా సంపాదించ వచ్చును. కాని ఇలా ఉద్యోగం చేస్తే, చదువు మీద శ్రద్ధ తగ్గి రెంటికి చెడ్డ రేవడి అవుతావు. మా పాట్లు ఏవో మేము పడుతున్నాం. ఆ విషయం నువ్వు మరిచిపో!” అని సలహా చెప్పాడు.

నస్రుద్దీన్ ఆ సమాధానంతో తృప్తి పడ లేదు. తలిదండ్రులకి ఎలాగైనా చేదోడుగా ఉండాలని ఉంది. అందువల్ల, “ నాన్నా! నువ్వు నా చదువు గురించి బాధ పడకు. చదువులో ఏ లోపము రాకుండా, బడికి వెళ్లి చదువుకుం టూనే నేను సాయంత్రం పూట మాత్రం కొన్ని గంటల సేపు ఏదై నా కూలిపని చేసి డబ్బు సంపాది స్తాను. వచ్చిన సంపాదన నా చదువుకి, ఇంటి ఖర్చులకి కూడా పనికి వస్తుంది.” అని నచ్చ జెప్పాడు. కొడుకు పట్టు పట్టడంతో, సరేనని ఒప్పుకున్నాడు తండ్రి. తెలిసిన వాళ్లకి నలుగురికీ విషయం చెప్పి నస్రుకి ఎక్కడైనా పని ఇప్పించమని కోరాడు. వాళ్లందరూ వ్యాపారస్తులు. ఎందరో పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయం ఉన్న వారు. కొన్ని రోజుల తరవాత వాళ్ళలో ఒకాయన తనకి తెలిసిన ఒక ధనవంతుడికి చెప్పి నస్రుకి, ఆ యింట్లో పనికి కుదిర్చాడు.

ప్రతిరోజూ సాయంత్రం వచ్చి, ఆ యింట్లో వంట చేసే మనిషికి సాయం చేయడం, బజారునుంచి, కూరగాయలు, సామాను తెచ్చి అందించడం, ఇంకా చిన్నా చితకా పనుల్లో సాయం చెయ్యడం నస్రు పని. నస్రుకి తన కొత్త ఉద్యోగం చాలా నచ్చింది. భలే హుషారుగా ఉంటూ, యజమాని దగ్గర వినయంగా పని చేస్తూ, ఎప్పుడూ మాట పడకుండా, పని చేయ సాగాడు. యజమానికి కూడా నస్రు మీద మంచి అభిప్రాయం ఏర్పడింది. రాను రాను కొన్ని ముఖ్యమైన పనులు కూడా అప్పగించ సాగాడు. యజమానికి రావలసిన డబ్బూ, దస్కనం, ఖర్చులు వగైరా లెక్కలు చూడడం, వచ్చిన డబ్బులెక్క సరి చూసి, దాచడం కూడా నస్రుద్దీనే చేసేవాడు. యజమాని అతని తెలివి తేటలు, పనితీరు చూసి జీతం బాగా పెంచాడు. నస్రుద్దీన్ కూడా తన పనిలో ఏ లోపము రాకుండా జా-

గ్రత్త పడుతూ, చెప్పిన దానికంటే ఎక్కువ పని చేసే వాడు.

ఇలా ఉండగా ఒకనాడు అనుకో-కుండా ఆ యింటికి చాలామంది చుట్టాలు వచ్చారు. వాళ్ళు ఆ దారిన మరో ఊరికి పోతూ, రాత్రి భోజనానికి అక్కడ ఆగారు. అంతమందిని ఒక్కసారి చూసి వంట మనిషి కంగారు పడిపోయింది. అందరికీ వంట చేయాలంటే, ఇంట్లో ఉన్న వస్తువులు చాలవు. తొందరగా వంట చేయకపోతే యజమాని దగ్గర మాట పడవలసి వస్తుంది. అందుచేత నస్రుని పిలిచి, గబగబా బజారుకి వెళ్లి మూడు గుడ్లు పట్టుకు రమ్మంది. నస్రు "ఓ! అదెంత పని!" అనుకుంటూ, పరుగు పరుగున బజారుకి వెళ్లి, వచ్చేటప్పుడు నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చాడు, వంటామె అడగ్గానే ఒక గుడ్డు ఆమె చేతిలో పెట్టాడు. ఆమె అసలే తొందరలో ఉంది. వాడి వైపు కోపంగా చూస్తూ, "మూడు కదా తెమ్మన్నాను. ఒకటే తెచ్చావేం? ఫో! మళ్లీ వెళ్లి రెండు తీసుకురా!" అని వెనక్కి పంపింది. వాడు తిరిగి పరుగు పరుగున పోయి, నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చాడు. ఈ సారి కూడా ఒకటే గుడ్డు తెచ్చి ఆమెకి ఇచ్చాడు. ఆమెకి కోపం నసాళానికెక్కింది. వెంటనే యజమానిని పిలిచి, "చూడండి! వీడు నాతో పరాచికాలాడుతున్నాడు. బజారు నుంచి మూడుగుడ్లు తెమ్మంటే, ఒక్కొక్కటీ తెస్తున్నాడు. ఇలా అయితే నేను ఎప్పుడు వంట చేసేది? ఎప్పుడు చుట్టాలకి పెట్టేది?" అని చెప్పి వాపోయింది.

యజమాని "ఎందుకురా? అలా చేసేవు? తప్పుకదా?" అని అడిగితే నస్రు అమాయికంగా మొహం పెట్టి, "మరి అన్ని ఒక్కసారే ఒకదాని మీద మరొకటి పెట్టి తెస్తే, అవి చితికి పోవూ! మనకి డబ్బు నష్టం కదా! అందుకే విడి విడిగా తెచ్చాను" అన్నా డు. అది విన్న యజమాని వాడు నిజంగానే అలా నమ్మి తెచ్చాడని తెలుసుకుని, "ఈ సారి అలా చేయకుండా ఏమేమి అవసర మో తెలుసుకుని, దూరం ఆలోచించి, అన్నీ ఒక్కసారే తీసుకు రా. లేకపోతే సమయం వృథా ఔతుంది కదా-!"అని మందలించి పంపాడు.

నస్రు "సరే! ఈ సారి అలా తప్పు చేయను." అని తలూపాడు.

కొన్నాళ్ళకి ఆ ఇంటి యజమాని జబ్బు పడ్డాడు. విపరీతమైన కడుపు నొప్పితో బాధపడసాగాడు. భరించలేక చచ్చిపోతాననే భయంతో, నస్రుని పిలిచి, "ఒరే! ఈ నొప్పి నన్ను చంపేసేలా ఉందిరా. వెంటనే వెళ్లి వైద్యుడిని పిలుచుకురా!" అని పంపాడు.

క్షణం ఆలస్యం చేయకుండా నస్రు వెళ్లి వైద్యుడిని పిలుచుకు వచ్చాడు. ఆయన రోగిని పరీక్షించి, "కాస్త అజీర్ణం చేసింది, అంతే" అని మందులు ఇచ్చాడు. అవి వేసుకోగానే యజమాని కాస్త తేలిక పడ్డాడు. సమయానికి వైద్యం చేయించి ప్రాణాలు కాపాడినందుకు నస్రుని మెచ్చుకున్నా డు. లేచి వసారాలోకి రాగానే మరొక నలుగురు మనుషులు అక్కడ నుంచుని కనపడ్డారు యజమానికి.

ఎందుకు వచ్చారు? " అని అడిగాడాయన నస్రుని.

నస్రు తల వంచుకుని వినయంగా జవాబు చెప్పాడు. "మరి మీరే కదా చెప్పారు. సమయం వృథా చేయకుండా అన్నిపనులు ఒకే సారి చేయాలని. అందుకే!" అన్నాడు.

"అర్థం కాలేదు. వివరంగా చెప్పు" అడిగాడు యజమాని.

"మీరేమో ప్రాణాలు పోతాయేమో అని భయ పడుతున్నారు. ఒకవేళ వైద్యుడు ఇచ్చిన మందులు పని చేయక, మీకేమైనా అయితే, స్మశానానికి తీసుకుపోవడానికి అప్పటికప్పుడు మనుషులు దొరక్కపోవచ్చు. అందుకే ముందు గా చెప్పి వీళ్ళని తెచ్చాను" అన్నాడు అమాయికంగా.

ఈ సారి యజమానికి కోపానికి బదులు ఆపుకోలేని నవ్వు వచ్చింది. "హోరి భడవా! నీ తెలివి తెల్లారా!" అని నవ్వుకుంటూ, "ఈ రోజు నుంచి నీ జీతం పది కాసులు పెంచాను ఫో!" అన్నాడు.

(వచ్చే నెల ఇంకో కథ)

# పోడూరి శ్రీనివాసరావు



## తెలుగు పాఠక నవలారాణి - యద్దనపూడి సులోచనారాణి

1960 వ దశాబ్దంలో, సుమారు 15 సంవత్సరాలకు పైగా, తెలుగు పాఠక లోకాన్ని తన రచనలతో ఒక ఊపు ఊపి, మహిళా రచయిత్రిగా ఉన్నత శిఖరాలను అధిరోహించి, అత్యంత ప్రజాదరణ, పాఠకాదరణ కలిగిన అత్యుత్తమ నవలా సామ్రాజ్ఞిగా, పాఠక సింహాసనాన్ని అధిరోహించిన సాధారణ పాఠకుల కళల రాణి - శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి.

చదివింది పదో తరగతే అయినా పాఠకుల నాడి తెలిసిన రచయిత్రిగా, వారిని ఊహాపుటంచుల్లో, విశాల భవనాల్లో, పడవల్లాంటి పెద్ద కార్లలో, అత్యంత సుందరాకారుడైన హీరో చెయ్యి పట్టుకుని నడిపించి, విహరింపచేసినట్లు కలలుకన్న కన్నె పాఠకులు ఎందరో ఆ దశకంలో. అటువంటి అత్యంత పాఠకాదరణ పొందిన శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి 21-5-2018 న అకస్మాత్తుగా, అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఉన్న క్యూపర్టినో నగరంలో ఉన్న తన కుమార్తె శైలజ ఇంటిలోనే, నిద్రలోనే ... శాశ్వత నిద్రలోకి జారుకోవడం తెలుగు పాఠకలోకానికి ఆశనిపాతమే! కొద్దిరోజుల్లోనే అమెరికా యాత్ర ముగించుకుని, హైదారాబాదు వచ్చి, తన స్నేహితులతో సంతోషంగా గడుపుతానని చేసిన బాసలు అడియాశలే అయ్యాయి.

1939 వ సంవత్సరం, ఏప్రిల్ 2 వ తేదీన కృష్ణా జిల్లా మొవ్వ మండలంలోని 'కాజ' గ్రామంలో సులోచనారాణి గారి జననం జరిగింది. ఆమె వ్రాసిన నవలలు, కథలు, కన్నెపిల్లల కలల రాకుమారుడిలా హీరో, ఆ కలలలో తేలిపోయే అమ్మాయిల అంతరంగాలు ... ఆ రోజుల్లో ప్రతివారి నోటా సులోచనారాణి పేరే ప్రభంజనంలా మారుమోగుతుండేది. వివాహానంతరం హైదరాబాదు చేరిన సులోచనారాణికి అత్తవారింట్లో పుస్తక పఠనమే ప్రధాన వ్యాపకంగా మారింది.

సులోచనారాణి తన పదిహేన వ ఏటే సాహితీరంగంలో అడుగుపెట్టింది. 1956 లో ఆమె తొలి కథ 'చిత్ర నళినీయం' ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమైంది. వివాహమైన తొలినాళ్లలోనే పెళ్లి-కానుక, బహుమతి, మనుషులు - మమతలు, ఆత్మీయులు వంటి కథలను రచించడం జరిగింది.

'జ్యోతి' మాసపత్రిక ప్రారంభిస్తున్న సమయంలో రాఘవయ్య గారు, బాపు రమణలతో కలిసి, యద్దనపూడి సులోచనారాణి గారి ఇంటికి వెళ్లారు. వారి ప్రారంభ సంచికకు నవల వ్రాయమని సులోచనారాణి గారిని వారు ముగ్గురూ కోరడం జరిగింది. అప్పటివరకు సులోచనారాణి కథలు మాత్రమే వ్రాయడం జరిగింది. పైగా ఆ సమయంలో సులోచనారాణి 8 నెలల గర్భవతి కూడా. అందువల్ల కాదని సున్నితంగా తిరస్కరించడంతో, రెండు గంటలు తర్జన భర్జన జరిగిన తర్వాత, బాపు - రమణల బలవంతంతో, ఒక పెద్ద కథ వ్రాయటానికి ఒప్పుకున్నారు. ఆ విధంగా సులోచనారాణి చేతినుంచి జాలువారిన తొలి నవలగా రూపు దిద్దుకున్న పెద్ద కథే 'సెక్రటరీ'. సెక్రటరీ పెద్ద హిట్! సులోచనారాణి గారి మాటల్లో "సెక్రటరీ తర్వాత

అన్నీ నవలలే ... నా జీవితమంతా నవలలతోటే అయింది... వాటిల్లోనే విహరించాను"

1963 లో తన తొలి నవల 'సెక్రటరీ' తో నవలారాణిగా మారిపోయారు. నవలా ప్రక్రియలో ఓ కొత్త ట్రెండ్ సృష్టించారు. 1975 లో అక్కినేని, వాణిశ్రీ హీరో హీరోయిన్లు గా వచ్చిన 'సెక్రటరీ' సినిమా తెలుగు చలన చిత్రరంగంలో ప్రభంజనమే సృష్టించింది.

సెక్రటరీ నవల వెలుగులోకి వచ్చి 53 ఏళ్ళు దాటినా, ఈనాటికీ 'రాజశేఖరం - జయంతి' పాత్రల చిత్రీకరణ, ఆ సీరియల్ కు జ్యోతి మాసపత్రికలో బాపుగారు చిత్రీకరించిన రేఖలు, పాఠకుల హృదయంపై చెరగని ముద్ర వేసాయి. అప్పటివరకు చాలామంది రచయితలే ఉండేవారు. రచయిత్రుల ప్రాభవం సులోచనారాణి గారితోనే మొదలైందని చెప్పవచ్చు.

అప్పటివరకు స్త్రీ అందాన్ని వర్ణించడం టోన్ సాగిన నవలా ప్రక్రియలో - సులోచనారాణి గారి నవలలు కొత్త ఒరవడిని సృష్టించాయి. ప్రత్యేక వ్యక్తిత్వం, ఆత్మాభిమానం కలిగిన స్త్రీ పాత్ర చిత్రీకరణ, మహిళల్లో స్ఫూర్తిని నింపుతూ, ప్రశ్నించడం, అన్యాయాన్ని ఎదిరించడం, వగైరా ప్రత్యేకతలతో ఆంధ్ర పాఠకలోకానికి చేరువయ్యారు సులోచనారాణిగారు తమ ప్రత్యేకతల ద్వారా. అలాగే 1970 లో వచ్చిన 'జీవనతరంగాలు' కూడా విశేష ప్రజాదరణ పొందింది.



సులోచనారాణిగారు వందకు పైగా నవలలు, కథలు రచించి, తన కీర్తి కిరీటంలో ఎన్నో తురాయిలను అలంకరించుకున్నారు. అసంఖ్యాకంగా వ్రాసిన నవలలు ఎన్నో హిట్ చిత్రాలుగా రూపుదిద్దుకున్నాయి. వీటిలో ప్రధానంగా చెప్పుకోదగ్గవి. మీనా, జీవనతరంగాలు, రాధాకృష్ణ, బంగారుకలలు, విచిత్రబంధం, జై జవాన్, ఆత్మగౌరవం, ప్రేమలేఖలు మొదలైనవి.

టి వి రంగంలో కూడా శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారి అనేక రచనలు టివి సీరియళ్ళుగా రూపుదిద్దుకున్నాయి. అందులో ప్రముఖమైనవి: ఆగమనం, ప్రియసఖి, ఋతురాగాలు, చక్రవాకం, కస్తూరి, రాధా - మధు, మొగలిరేకులు, శ్రావణ సమీరాలు మొదలైనవి. ఈ టివి సీరియల్స్ కూడా ఎంత ప్రజాదరణ పొందాయో ... వాటి ప్రసార సమయంలో ఎంతమంది స్త్రీ పురుషులు తమ పనులను మానుకునైనా షెడ్యూల్ మార్చుకునైనా, టివి లకు అతుక్కుపోయేవారో చెప్పనక్కరలేదు.

ఇదే విధంగా.... టివి సీరియళ్ళే కాదు, సినిమాలుగా రూపాంతరం చెందిన నవలలు కాదు.... విశేష పాఠకాదరణ పొందిన - ఆరాధన, ఆత్మీయులు, అభిజాత, అగ్నిపూలు, అమరహృదయం, అమృతధార, అనురాగగంగ, అనురాగతోరణం, గిరిజాకల్యాణం, మౌనపోరాటం, మౌనభాష్యం, మోహిత,

వెన్నెల్లో మల్లిక, సౌగంధి, సుకుమారి, ఇలా ఎన్నో, ఎన్నెన్నో రచనల ద్వారా పాఠకులను అలరించడంలో ప్రథమ స్థానంలో ఉన్నారు సులోచనారాణి గారు.

మానవ సంబంధాలను హృద్యంగా చిత్రీకరించడంలో సులోచనారాణిగారిది అండ్ వేసిన చేయి. వందకు పైగా ఆమె చేసిన రచనలు కోటికి పైగా కాపీలు అమ్ముడుపోయాయంటే, సులోచనారాణిగారి అంచనాలను పాఠకులు ఎంతగా ఆదరించారో తెలుస్తుంది.

1988 లో 'కోకిల' పేరుతో తొలిసారిగా 'ఆడియో క్యాసెట్ మాగజిన్ తీసుకొచ్చిన ఘనత కూడా శ్రీమతి సులోచనారాణిగారిదే.

శ్రీమతి సులోచనారాణి గారిపై రచయిత్రులు మాలతీ చందూర్, లత ల ప్రభావం, ప్రసిద్ధ రచయి త ఆస్కార్ వైల్డ్ సంభాషణలు, దర్శకుడు ఆల్ఫ్రెడ్ హిచ్ కాక్ సృష్టించిన సస్పెన్స్ ప్రభావం ఉన్నా యని ఆమె స్వయంగా తన మాటల్లో చెప్పారు. లత పాత్రల్లా గా ప్రశ్నించే విధానం, అన్యాయా న్ని ఎదిరించే నైజం వంటివి తన పాత్రల ద్వారా చెప్పించాలని ప్రయత్నించేదాన్నని శ్రీమతి సులోచనారాణిగారు చెప్పారు.

సులోచనారాణిగారు రచయితలకిచ్చే సలహా ఏమిటంటే 'మన చుట్టూనే బోల్డు కథలున్నాయి, సమాజంలో ఉన్న రుగ్మతలు, వాటి నివారణలు, కారుణ్యాలు, కార్పణ్యాలు, అనుబంధాలు, అనుభూతులూ, .... మనం చూడాలే కానీ, అవన్నీ మన కళ్ళముందే ఉన్నాయి. వేలవేల కథలున్నాయి.... మనం అర్థం చేసుకోవాలంతే. రచయితలు చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలిస్తే చాలు... కథలు వాటంతట అవే పుట్టుకొస్తాయి. కథలకోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. ఆ దిశగా మనం అడుగులేయాలి అంతే'.

ఎంతో దార్శనికత, సమాజ స్ఫూర్తి కలిగిన ఉత్తమ రచ యి త్రి శ్రీమతి యద్దనపూడి సులో చనారాణి. తెలుగు సాహితీ రం గానికి రచయిత్రి గొప్పదనం చాటిచెప్పిన మహారచయిత్రి శ్రీమతి సులోచనారాణి ఆకస్మిక మరణం తెలుగు సాహితీ ప్రపంచానికి పెద్ద గొడ్డలిపెట్టు.

ఆమె స్మృతికి నివాళిగా నా ఈ వ్యాసం.

---

( 8 వ పేజీ తరువాయి )

# కథ కాని కథ

"అయ్యా... అసలీ చిన్నచిన్న గొడవలూ, అపార్థాలూ, అత్తా-కోడలి జగడాలూ, కంప్లైంట్లూ, కన్నీళ్లూ లేకపోతే జీవితం మహా నిస్సారం కాదూ?" అని దీర్ఘం తీశాడు మరో నారద మహాముని.

మరి మీరేమంటారూ?

మళ్ళీ కలుద్దాం,

భువనచంద్ర

PS : ఈ నెల 'బోధన' చెయ్యలేదు. ఒక్కసారి మన ఇళ్ళల్లో, చుట్టుపక్కల జరుగుతున్న విషయాలనే నెమరు వేసుకుంటే, వినడానికే కాదు, మనవంతు కృషి చెయ్యడానికీ, ఆలోచించడానికీ కూడా చాలా మేటర్ దొరుకుతుంది. "Learn from the mistakes of others " అని. అనగా 'ఇతరులు చేసే తప్పులనుంచి నువ్వు పాఠం నేర్చుకో!" అని,

ఈ కథ కాని కథ మీద మీ అభిప్రాయం చెబుతారు కదూ!

మీ bhuvanachandra@gmail .com

# నండూరి సరోజాదేవి

సీరియల్

## మిస్ మేఘమాల IAS



( గత సంచిక తరువాయి )

ఉన్నట్టుండి పెద్ద శబ్దం చేసుకుంటూ,బ్యాండ్ మేళం వాళ్ళు ఆ వాయిద్యాలు మోగించడం మొదలు పెట్టారు!

"ఈ జనమంతా ఏమిటీ? వాళ్ళ హడావిడి ఏమిటీ? ఆ బ్యాండ్ వాయింపు ఏంటీ? ఎవరింట్లో అయినా ఫంక్షన్ జరుగుతోందంటావా?" మాలతిని అడిగింది మేఘమాల.

"పెళ్లి కాదు,ఏం కాదూ..నిన్ను తీసుకొస్తున్నామని, నాన్న ఎవరెవరికో చెప్పుంటారూ? అది ఊరు మొత్తం పాకి, ఇక్కడ నుండే ఆ హడావిడి మొదలయ్యుంటుంది"చాలా తేలిగ్గా ఆ విషయం చెప్పింది మాలతీ.

అది విన్న మేఘమాలకి ఆశ్చర్యంగా, మతిపోయినట్టు అనిపించింది!

"అంతే అయుంటుందమ్మా? మన ఇంటికి సంబంధించిన ఎటువంటి మంచి విషయానికి అయినా, అది తమ సంతోషంగా కూడా భావించడం మన ఊరి ఆనవాయితీగా అయిపోయింది.. మీ నాన్న గారు ఊరికి చేసే సేవకి, ఇచ్చే సలహాలకీ, వీళ్లంతా తమ కృతజ్ఞత ఇలాగ కనబరచేస్తూ వుంటారు" అన్నపూర్ణమ్మగారు కూడా ఆత్మీయంగా ఆ మాటలు చెప్పింది.

"దానికి నాన్నగారి మీద ఆ గౌరవాన్ని చూపించారంటే అది వేరు కానీ, నాక్కూడా ఏంటమ్మా ఇదీ? పాపం, ఇలా పొద్దున్న నుండీ ఈ జనమంతా శ్రమపడి ఎదురు చూడ్డం కాకపోతేనూ?" మేఘమాల జాలిగా తల్లితో అంది.

"నాకు తెలిసి వాడికీ అసలు ఇటువంటివేం నచ్చవు? అందరికి ఉపకారం చేసే గుణం ఉన్న కారణానే, వారంతా ఇలా కృతజ్ఞత చూపిస్తున్నారు అనుకున్నా ఏమీ ఆశ్చర్యం లేదు" శ్రీనివాసరావు గారు కూడా కలుగ చేసుకుంటూ, నారాయణ గారి పట్ల అలా తన ఆప్యాయతనీ చూపించారు.

ఇక, ముందు క్యాబ్లో కూర్చున్న వారందరి ప్రశ్నలకి వినోద్ కూడా..ఈ ఊరిలో తన మావయ్యకి వుండే పేరు ప్రతిష్టలను గురించి తెలియచెప్పక తప్పలేదు!

"పల్లెటూరుల్లో మంచితనం వున్న పెద్దల పట్ల, జనాలు చూపించే ప్రేమ గురించి నాకు తెలుసు కానీ .. మా మేఘమాల అమ్మగారి కోసం కూడా ఊరంతా ఇలా చేరడం, మేళాలు పెట్టి వాయించడం చూస్తుంటే నిజంగా నాకూ చాలా సంబరంగా అనిపిస్తోంది" అని మొహం నిండా వెలుగు నింపుకుని గౌరి తన సంతోషాన్ని చెప్పుకుంది.

అదో పెద్ద ఊరేగింపా అన్నట్టు,ముందు బ్యాండు మేళం వాళ్ళు మంచి సినిమా పాటలు వాయిస్తూ వెళ్ళగా, ఆ రెండు కార్లకి అటు ఇటూ చాలా మంది వరకు ఆడా, మొగా జనం నడుస్తూ రావడంతో ..వినోద్ వాళ్ళు ఇల్లు చేరేటప్పటికి చాలా సమయమే పట్టింది!

0000000000000

వినోద్ వెంటనే ముందు క్యాబ్ దిగిపోయి, గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తున్న మేనమావ దగ్గరకి వెళ్లి చేతులు రెండు పట్టేసుకుని తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు!

"నాయనా ఎలా ఉన్నావ్? చాలా కష్ట పడ్డావురా" అంటూ అల్లుడిని ఆప్యాయంగా నారాయణగారు దగ్గరకు తీసుకున్నారు.

అలాగే! కార్లో నుంచే స్నేహితుణ్ణి గమనించిన శ్రీనివాసరావు గారు, తనంతట తానే కారు డోరు తీసేసుకుని నారాయణగారిని చేరుకున్నారు.

నారాయణగారైతే,శ్రీనివాసరావు గారిని చూస్తూనే ఆనందం పట్టలేనట్టు గట్టిగా కౌగలించుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు!

"ఒరేయ్, నారాయణా! ఎలా ఉన్నావురా? పిల్లని నా దగ్గర వుంచేసుకుని, మీ అందరి మనసుల్ని ఎంతో బాధకి గురి చేసిన నన్ను క్షమించరా" అంటూ శ్రీనివాసరావుగారు కళ్ళల్లో నిండిన నీటిని తుడుచుకుంటూ, పశ్చాత్తాపంతో అన్నారు.

"అయ్యో! నువ్వలా అంటావేంటిరా? అసలు అందులో నీ తప్పేముందనీ? ఒక గట్టి నిర్ణయం తీసుకుని అది అమలు జరిగేటప్పుడు తిరిగి మళ్ళీ మేమే దానికి అడ్డు కాకూడదూ, అని నా మనసే నాకు తెలియ చెప్పింది. అందుకే, మీ విషయాలేం పట్టించుకోదల్చుకోలేదు".

"ఇక్కడ ఆ విషయాలన్నీ ఎందుకు? తర్వాత ఇంట్లో మాట్లాడుకుందురు గానిలే" అని వినోద్ మేనమామని హెచ్చరించడంతో, ఆయన కూడా అల్లుడి మాట వినడమే కాక, అక్కడున్న ఊరి పెద్దలని.. శ్రీనివాసరావుగారికి పరిచయం చేయడంలో పడ్డారు!

ఇక మేఘమాల కూడా కారు దిగడం చూస్తూనే, తెలుసున్న వాళ్లంతా ముందుకి వచ్చి.. .

" మాలతమ్మా నిన్ను చూసి చాలా రోజులు అయ్యింది, బాగున్నావా?" అని అడగసాగారు.

మేఘమాల వారందరి వైపు ఒకసారి నవ్వుతు చూసీ.. "నేను మాలతిని కానమ్మా. తనకి సిస్టర్ ని అవుతాను, నా పేరు మేఘమాల" అని చెప్పింది.

"అవునా? మీ పేరు మేఘమాలనా? అచ్చు మాలతమ్మ లాగానే ఉన్నవే? అయితే కనకరాజు చెప్పినట్టు, మీరేనా కలక్టరమ్మా? మీరేనా నారాయణ పెద్దయ్య గారి ఇంకో అమ్మాయా?"అంటూ మిగిలిన వాళ్ళందరూ కూడా కుతూహలంతో ఆమెని చుట్టుముట్టేశారు.

"అవును, నేను కలెక్టర్ ఉద్యోగం చేస్తున్నాను" నవ్వుతూ మేఘమాల మళ్ళీ వారికి సమాధానం చెప్పింది.

"మా ఊరికి కలక్టరమ్మ వచ్చిందీ, కలక్టరమ్మ కీ జై , జై జై" అంటూ వారిలో కొద్దిగా చదువుకున్న ఆడ పిల్లలు, మొగపిల్లలు గట్టిగా నినాదం చేయడం మొదలు పెట్టారు.

మేఘమాల పట్ల, ఆ జనం చూపే హడావిడికి గౌరీ అయితే ఆనందం పట్టలేక పోతోంది!

శాస్త్రి మనోభావం కూడా అలాగే ఉండీ, జరుగుతున్నదంతా ఆశ్చర్యంగా చుడసాగేడు!

మేఘమాల చుట్టూ చేరిన ఆ జనాన్ని ఇక తప్పించడం తనవంతు కర్తవ్యంగా భావించిన సెక్యూరిటీ విల్సన్ ఆ ప్రయత్నం చేయబోతుండగా.. మేఘమాల వద్దని వారించింది!

తన తండ్రి దగ్గరకి వెళ్లి చూడాలని ఎంతగా అనిపిస్తున్నా..ఆయన పట్ల వారందరికీ ఉండే అభిమానం తెలిసిన కారణంగానే, ముందు వారందరు సంతోషపడేలా పలకరించి మరీ, లోపలకి వెళ్ళదల్చుకుని అలా అక్కడే ఆగింది మేఘమాల!

ఇంటి పై గట్టు మీద నిలబడి అదంతా గమనిస్తున్న నారాయణగారు, అరుగుల మీద నిల్చున్న ఊరి పెద్దలు చిరునవ్వులు చిందిస్తూ..

"మన నారాయణగారి అమ్మాయి కలక్టరుగా వచ్చిందంటే మాటలా? కబురు విన్న జనం రాకుండా ఉంటారా, ఆ అమ్మాయిని చూడకుండా ఉంటారా?"

"ఏదేమైనా నారాయణ గారు చాలా అదృష్టవంతులు" అంటూ తలొకళ్ళు తలొక మాటా సరదాగా అనడం మొదలు పెట్టారు.

"నారాయణా! అమ్మాయిని అసలు ఇంతసేపూ నువ్వు చూడనేలేదు కదూ? దానికి అంతా నీ పోలికేరా. జనం, కబుర్లు వుంటే ఇంకేం గుర్తే ఉండవు."

"వినోద్! నువ్వెళ్ళి మేఘమాలని ఇంక తీసుకు వచ్చేయి" అంటూ శ్రీనివాసరావుగారు చెప్పారు

"నేనూ అదే అనుకుంటున్నాను" అంటూ వినోద్ ఆ జనం గుంపు దగ్గరకి వెళ్ళాడు.

"చూడండీ! కలక్టరమ్మ ఇంకా చాలా రోజులు ఇక్కడే వుంటుంది. తర్వాత వస్తే మీరందరు మళ్ళీ ఆవిడ దగ్గర గడపచ్చు, మాట్లాడచ్చు కూడా. ఇప్పుడే ఊరి నుండి వచ్చారు కనుక, కాస్సేపు ఇంట్లోకి వెళ్లనివ్వండీ" అంటూ మేఘమాల చుట్టూ చేరిన వారందరికీ అర్థమయ్యేటట్లు నెమ్మదిగా తెలియ చెప్పాడు వినోద్.

అతడు అలా చెప్పిన వెంటనే, చాలా మంది పక్కకి తప్పుకోవడంతో..

మేఘమాలకి ఊపిరి పీల్చుకున్నట్టై,"తప్పకుండా మళ్ళీ వద్దురు గానేమ్మా" అంటూ వాళ్ళతో చెప్పేసి, తల్లి చేతిని అందుకుని నెమ్మదిగా వినోద్ వెనక నడిచి ఇంటి వైపుకి వచ్చేసింది !

"రామ్మా, మేఘా రా! ఇదిగో మీ నాన్నా, నా ప్రాణ స్నేహితుడూనూ" అంటూ మేఘమాల చేతిని అందుకుని, నారాయణగారి చేతిలో ఉంచారు శ్రీనివాస రావుగారు.

అది రక్తసంబంధం, అనురాగం కలగలిపిన క్షణాలు అవ్వడంతో నారాయణ గారికి తట్టుకోలేని ఆనందం కన్నీళ్ల రూపంలో బయటికి వచ్చేసింది. వెంటనే కూతురి తలని ఆప్యాయంగా నిమురుతూ తన గుండెలకి అదుముకున్నారు!

మేఘమాలకి కూడా అదే పరిస్థితి ఎదురయ్యి, కళ్ళు దుఃఖంతో కాలవలే కట్టాయి. వెంటనే తను కూడా నారాయణగారి నడుం చుట్టూ రెండు చేతులు గట్టిగా బిగించేసి పట్టుకుంది!

ఇంటి పక్కన ఏర్పాటు చేసిన కుర్చీలలో అప్పటి వరకు మేఘమాలని చూడ్డం కోసం, ఎదురు చూస్తూ కూర్చున్న బాగా పరిచయస్తులైన కొంత మంది పెద్దిళ్ళ ఆడవాళ్ళు, మొగవారు ఆ తండ్రీ కూతుళ్ళ దగ్గరకి రావడమే కాక, వారి ఆ ఆత్మీయ అనుబంధానికి ఎంతగానో చలించి పోయేరు!

అంతే కాదు! అచ్చు మాలతి పోలికలోనే ఉన్న ఆమెని చూసి ముచ్చట పడ్డారు కూడా.

అలాగే! వారంతా అన్నపూర్ణమ్మగారిని పలకరిస్తూనే "మీ పిల్లలు ఇద్దరు చక్కగా ఒక్క పోలికలో ఉండడంతో, చూడ్డానికే మాకు రెండు కళ్ళు చాలటం లేదు అనుకోండి. ఈ అమ్మాయి కలక్టరట కదా? నిజంగా చాలా సంతోషంగా ఉంది" అంటూ మెచ్చుకోసాగేరు

వాళ్ళ మాటలు ఒక చెవిన పడ్డ నారాయణగారు.."అవునండీ, అనంతపురం జిల్లా కలెక్టర్ గా పని చేస్తోంది. అమ్మాయిని ఇంతలా పెంచి, ఇలా వృద్ధిలోకి తీసుకు వచ్చింది ఈ నా చిన్ననాటి స్నేహితుడేను" అంటూ వున్న విషయాన్ని వివరంగా చెప్తూ..

"అమ్మా! వీరందరూ మనకెంతో కావలసిన వారు. మీరు అంతా వస్తున్నారని తెలిసి, ప్రత్యేకించి నిన్ను చూడ్డానికే వచ్చారు" అని మేఘమాలకి అక్కడ అందరిని పరిచయం చేశారు నారాయణగారు.

మేఘమాల వెంటనే చేతులు రెండు జోడించి చిరు నవ్వుతో, అందరి వైపుకి చూస్తూ నమస్కరించింది!

ఆమె వినయానికి అక్కడ వారందరు ముగ్ధులవ్వడమే గాక, ఆమె కలెక్టర్ చదువుకి గౌరవమిస్తూ ప్రతి నమస్కారం చేశారు!

"నారాయణగారూ! మీ పాపని ఇంక లోపలకి తీసుకు వెళ్ళండీ" సుబ్బరాజుగారు అనే ఆయన సలహా ఇచ్చారు.

నిజానికి ఆ ఊరి పెద్దలు ఎవరు ఇంటికి వచ్చినా..నారాయణ గారి ఇంటి ఆడవాళ్ళు మొహమాటంతో వారెవరికీ ఎదురు పడ్డం చాలా తక్కువా. అన్నపూర్ణమ్మగారైతే ఇప్పుడు ప్రయాణం చేసి వచ్చిన కారణంగా ఇక వారి ముందు పడక తప్పలేదు!

కానీ, నారాయణగారి తల్లి నిర్మలమ్మగారు మాత్రం అందుకే

ఇంటి లోపల ఉండిపోయారు. పని మనిషి ద్వారా మాత్రం మనవరాళ్లతో సహా ఊరు అంతా కదిలి వచ్చిన వివరాలు తెలుసుకుంటూనే ఉన్నారు!

"అన్నపూర్ణమ్మ గారితో సహా వారి పిల్లలకి దిష్టి తీసేదాకా మాత్రం రావద్దని" ఆ నిర్మలమ్మ గారు పనిమనిషితో కబురు పంపడంతో,వాళ్లకి ఇంటి గుమ్మం బయట ఆగక తప్పలేదు.

అంతే కాదు! నారాయణగారి ఇంట్లో కొద్దిగా తిరిగే చనువున్న ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళని లోపలకి రమ్మనమని ఆ పెద్దావిడ కబురు పంపడంతో, వారు వెను వెంటనే ఇంటి లోకి వెళ్లడం కూడా జరిగింది.

ఆవిడ చెప్పిన విధానం ప్రకారం..మేఘమాలతో సహా అన్నపూర్ణమ్మ, మాలతీలకి పారాణి దిష్టి తీయడం పూర్తయ్యాక, హారతిని కూడా ఇచ్చి వాళ్ళని ఇంటి లోపలకి వెళ్ళమంటూ ఆ ముత్తైదు ఆడవారు గుమ్మం దగ్గర దారి ఇచ్చారు!

అది పూర్తయిన తర్వాత స్నేహితుడు శ్రీనివారావుని, సుబ్బ రాజుగారు, మునిమాణిక్యం గారు, గోపాలం గారితో పాటుగా మిగిలిన పెద్దలని కూడా ఇంట్లోకి ఆహ్వానించి, ముందు హాల్లో కూర్చో పెట్టారు నారాయణ గారు!

కాళ్ళు కడుక్కొచ్చిన వెంటనే అన్నపూర్ణమ్మగారు ఇంక ఆగలేనట్టు, మేఘమాల చెయ్యి పట్టుకుని మరీ అత్తగారి దగ్గరకి తీసుకెళ్ళిపోయింది!

"అత్తయ్యగారూ!ఇదిగో మీ ఇంకో మనవరాలు" అంటూ మేఘమాలని, ఆవిడ ముందుంచింది.

"ఇది కల కాదుగా? నువ్వు నా మనవరాలువే కదు తల్లీ? ఎంత చక్కగా ఉన్నవే అమ్మా? మీ అమ్మా, మాలతీల లాగే ఉన్నావు" అంటూ మనవరాలు తలను వంచి నుదుటి మీద ముద్దు పెట్టింది ఆ బామ్మగారు.

"అమ్మా,మేఘమాలా! ముందు బామ్మగారి పాదాలకి దణ్ణం పెట్టు" అంటూ కూతురికి హితవు చెప్పింది అన్నపూర్ణమ్మగారు.

దాంతో, మేఘమాల వెంటనే కిందకి ఒంగి ఆ బామ్మగారి పాదాలు చేతులతో పట్టుకుని మరీ నమస్కారం చేసింది!

"కొద్దిగా అక్షింతలు తీసుకురా అన్నపూర్ణా" అనే మాట వచ్చిందే తడవుగా, దేముడి గూట్లోంచి వాటిని తెచ్చి అత్తగారి చేతికి అందించింది ఆమె.

నిర్మలమ్మగారు వెంటనే ఆ అక్షింతలని మనవరాలి తల మీద వేస్తూ "ఆయురారోగ్య ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖంగా వర్ధిల్లు తల్లీ" అని ఆశీర్వదిస్తూనే పైకి నెమ్మదిగా లేవదీసీ, దగ్గరకు తీసుకుని ఇక ఆపుకోలేక గట్టిగానే ఏడిచేసిందావిడ.

ఆ సన్నివేశం అన్నపూర్ణమ్మగారి కళ్లల్లో కూడా నీళ్లు తెప్పించింది!

"బామ్మగారూ! ఎందుకు అంతలా దుఃఖించడం? నేను మీ అందరి కోసం వచ్చేశానుగా, ఏడవకండీ. మిమ్మల్ని చూసి అమ్మ కూడా బాధ పడుతోంది" అంటూ ఓదార్చింది మేఘమాల.

ఇంతలో వినోద్ అక్కడికి వచ్చి "అమ్మమ్మగారు ఎలా ఉన్నారు? ఆరోగ్యం బాగుందా?" అని కుశలం అడుగుతుంటే, నిర్మలమ్మ గారి దుఃఖం మరింతగా తన్నుకు వచ్చింది!

"ఏమయ్యిందీ? ఇలా బాధ పడిపోవడానికి కారణం ఏంటీ, మీ మనవరాలు వచ్చి కనిపించిందనా? మరి నేనింక ఉండనా, వద్దా?" ఆవిడని ఆటపట్టిస్తూ అడిగాడు వినోదు.

"నా తండ్రీ! ఇంకెప్పుడు ఆ మాట అనకురా? అన్నపూర్ణా, నేను ఆశించిన విధంగా.. ఏకంగా మనవరాలినే తీసుకు వచ్చేసి, అందరి మనస్సులో సంతోషాన్ని నింపావు. ఇంతకాలం నిన్ను కేకలేస్తూ విసుక్కున్నందుకు మన్నించు బాబూ" అంటూ మనవడి చెయ్యి పట్టేసుకుంది ఆవిడ.

"అమ్మమ్మగారూ!"అదేంటి, మీరలా అనచ్చునా? నామీద మీకా హక్కు ఉంది కనకనే కోప్పడేవారు. ఇలా ఇంకెప్పుడూ అనుకోకండి" ఆవిడ భుజాల చుట్టుగా

చెయ్యి వేసి, దగ్గరగా తీసుకున్నాడు వినోదు.

ఈ లోగా రానే వచ్చింది మాలతి!

"బామ్మగారూ! చూసారా? అమ్మా, నాన్నా అందరు కూడా మేఘమాల వచ్చాక నన్ను పూర్తిగా మర్చిపోయారు. అసలు పట్టించుకోవడమే లేదు .. మీరేం అలా కాదు కదా?" ఉడుకుమోత్తనం నటిస్తూ భర్తతో పాటుగా ఆ పెద్దావిడకి ఇంకోవైపుకి వెళ్లి, గారాబంగా ఆవిడ భుజాలను గట్టిగా పట్టుకుంది మాలతి.

"మాలతీ! బామ్మగారు కూడా సరిగ్గా అలాగేను. అమ్మ, నాన్న గారిలాగా నేనంటేనే ప్రాణం.. కదు బామ్మా?" అని అంటూ మేఘమాల కూడా ఆవిడ వెనక్కి వెళ్లి మెడల చుట్టూ చేతులు వేసేస్తూ, తోబుట్టువుని మరింత ఏడిపించిందీ.

ఆవిడ మాత్రం మనవడు,మనవరాళ్లు చూపే ప్రేమకి, ఒకళ్ళని ఒక్కళ్ళు అనుకునే చిలిపి వాదనలకి తబ్బిబ్బు అవుతూ ఆనందపడ సాగింది.

"బాగుందర్రా, మీ ముగ్గురు పనీ. ఆవిడకి ఊపిరి ఆడనివ్వరా ఏంటీ ?" అని నవ్వుతు మందలించింది అన్నపూర్ణమ్మగారు.

అదంతా చూసి సరదా పడిపోయిన గౌరి "కాస్సేపు అలాగే ఉండండి" అంటూ పరిగెత్తుకుంటూ హాల్లోకి వెళ్లి నారాయణ గారిని, శ్రీనివాసరావు గారిని వెంట పెట్టుకుని వచ్చి..మేఘమాలా వాళ్ళ ముగ్గురు చేసే సందడి చూపించింది.

తల్లిని, పిల్లలు ఆలా చిలిపితనంగా పట్టుకుని ఉన్న తీరుకి.. నారాయణగారు చూస్తూనే ముగ్ధులయ్యి, శ్రీనివాసరావు గారితో పాటుగా పక పకా నవ్వేశారు!

"బాగుందమ్మా,వాళ్ళతో పాటుగా నువ్వు కూడానూ?" అని నారాయణ గారు అంటూ స్నేహితునితో హాల్లోకి వెనుదిరిగి వెళ్లిపోయారు!

"చాల్లే, ఇంక ఆవిడని వదలండి" అంటూ అన్నపూర్ణమ్మగారు స్నానానికి వెళ్ళిపోయేరు.

"ఇంక మీరూ వెళ్లి టిఫిన్లు తినండి" అని బామ్మగారు అంటుంటే ..

"బామ్మ గారూ! ఒక్క నిముషం" అంటూ మేఘమాల, గౌరి వైపు చూస్తూ..

"నా వానిటీ బ్యాగ్ లో సెల్ ఉంది తీసుకురా గౌరీ, మాకు ఒక ఫోటో తీద్దువుగానీ" పంపించింది.

గౌరి రాగానే, ఫోటో ఎలా తీయాలో చెప్పి.. నిర్మలమ్మ గారితో ఆ ముగ్గురు రకరకాల ఫోజుల్లో, పనిలో పనిగా చాలా ఫోటోలు తీయించేసుకున్నారు!

ఆ తర్వాత రాము, శాస్త్రిలతో పాటుగా వినోద్ మేనమావ దగ్గరకి వచ్చి "మావయ్యా! శాస్త్రి గురించి నీకు అస్తమానూ ఉత్తరాల్లో రాసేవాడిని కదా? అతనే ఈ శాస్త్రి" అంటూ ఆయనకి పరిచయం చేశాడు

"ఇందాకటి నుండి నిన్ను గమనిస్తూనే ఉన్నాను. మా వాడి ప్రయత్నాలలో, నీ సహకారం ఎంతో ఉండేదని తరచూ తెలియ చేసేవాడు. చాల సంతోషం బాబూ" అంటూ నారాయణ గారు ఆప్యాయంగా అతనితో మాట్లాడి,

వాళ్ల కుటుంబ వివరాలన్నీ అడిగి తెలుసు కున్నారు కూడా.

"రామూ,అన్నట్టు! నువ్వు వెంటనే బయటికి వెళ్లి, అమ్మాయితో ఇందాక మాట్లాడిన ఆ పొలం పనులు చూసుకునే వాళ్ళని, కూలీ నాలీ చేసుకునే వారందరినీ, ఎంత మంది ఉన్నారో కనుక్కుని వారికి టిఫిన్ అందేలా చూడు. పాపం, పనులన్నీ పక్కన పెట్టి ఇలా మన కోసం వచ్చేసారు కూడా.

"అలాగే! ఎల్లుండి శనివారం, మన ఇంట్లో శ్రీ సత్యన్నారాయణ వ్రతం జరుపుకుంటున్నామనీ..వారందరికీ అన్నదానం ఉంది తప్పకుండా రమ్మనమని 12 గంటల సమయాన్ని కూడా చెప్పు" అంటూ అంతా క్లియర్ గా వివరించారు నారాయణగారు.

"సరే, మావయ్య గారూ" అంటూ, ఆ మాట అన్న తడవునే శాస్త్రితో వెళ్ళిపోయాడు రాము.

"నారాయణగారూ! మాకు ఇంక శలవు ఇప్పించండి" అంటూ సు-

బ్బరాజు గారు లేచి నిలబడ్డారు.

"భలేవారే! మీ అందరి కోసం వంటలు ఏర్పాటు చేయిస్తున్నాను. వ్రతం అయ్యే రోజు వరకు మీ పది మందికి పూర్తిగా మా ఇంట్లోనే భోజనాలు."

"చాలు, చాలు లెండీ. మీ అమ్మాయి వచ్చిన సంతోషం,-హడావిడిలో హాయిగా గడపకా, మాకెందు కండీ అవన్నీ" అంటూ నారాయణగారి మాటల్ని ముని మాణిక్యం గారు ఖండించారు.

"ఏం పర్వాలేదండీ, మీరందరు మా ఇంటి మనుష్యులు కారా? పోనీ, సరదాగా ఈ మూడు రోజులు ఉదయం పూట అయినా వచ్చేయండీ" అంటూ నారాయణగారు బలవంతం చేసారు.

"సరే లెండి, మేం వద్దంటున్నా మీరు ఊరుకునేటట్టు లేరు.ఒక సారి ఇళ్ళకి వెళ్లి మళ్ళీ వస్తాము" అంటూ వాళ్లంతా శ్రీనివాసరావు గారికి కూడా చెప్పి వెళ్లిపోయారు.

ఇంటి పనులకి, వంట పనులకి నారాయణగారు మనుష్యుల్ని ఏర్పాటు చేయడంతో, ఆడవాళ్ళకి సహితం ఏ పనులు లేకపోవడంతో ఇంట్లో అందరూ సందడి సందడిగా గడుపుతూ, కబుర్లాడుకుంటూ ఉండడంతో సమయం కూడా యెంతయ్యిందో తెలియనంత తొందరగా ఆ రోజంతా గడిచిపోయింది!

మేఘమాలైతే తన కలెక్టర్ ఉద్యోగం, భాధ్యతను కూడా మర్చిపోయినట్టే.. నిర్మలమ్మగారితో కూర్చుని కబుర్లు చెప్పడం, కొంత సేపు తండ్రి నారాయణ గారి వెంటవెంటే ఉంటూ.. ఆయన, ఆ ఊరి పెద్దలు చెప్పే మాటలు వింటూనే, వాళ్ళడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పడం వంటి వాటితో మరింత ఎంజాయ్ చేయసాగింది.

మేఘమాల దగ్గర కూర్చుని మరీ, కడుపు నిండా అన్నం తిని పించడమే కాకుండా..కొంత మంది రైతులు, మామిడి పళ్ళు,

తాటి ముంజులూ, రేగిపళ్ళు-బుట్టలు బుట్టలుగా ఇంటికి తేవడంతో ..

"ఇంక చాలు బాబోయ్" అంటున్నా వినకుండా, వాటిని కూడా ప్రేమగా ఆ కూతురికి తినిపించడంలో అన్నపూర్ణమ్మ గారు ఎనలేని సంతృప్తి పొంద సాగింది.

"పెద్దమ్మగారూ! ఇక్కడి ఈ మీ ఇంటి వాతావరణం, మీ ప్రేమా, అదుపులేని ఈ తిళ్ళు చూస్తుంటే..అమ్మగారితో పాటు,

నాకూ ఇంక వెళ్లాలనే అనిపించదేమో? నేనైతే నిజంగా ఇక్కడే ఉండిపోతాను" అంటూ గౌరి తన ఆనందాన్ని అంతా కూడా, అన్నపూర్ణమ్మగారి దగ్గర వ్యక్తం చేయసాగింది.

"పిచ్చి పిల్లా! నీకుండాలని ఉంటే ఎన్నాళ్లయినా తప్పకుండా ఉండచ్చు.. కానీ, మీ కలెక్టర్ అమ్మగారినే వొప్పించుకోవాల్సి వస్తుందేమో?" అని అన్నపూర్ణమ్మగారు నవ్వేశారు.

oooooooooooooo

మేఘమాలకి మొదట్లో కొంత సేపు ఆ ఇల్లు అంతా కొత్త కొత్తగా అనిపించినప్పటికీ, రాను రాను స్వేచ్చగా మసలడం అలవాటు అవ్వడంతో.. రాత్రి 8 గంటలకు మాలతి గదిలోకి వెళ్లి వాలు కుర్చీలో కూర్చుని కబుర్లు చెప్పడంలో పడిపోయింది!

"మేఘా! ఈ రోజు నువ్వొస్తున్నావని, నాన్నగారు ఒక పండగ లాగా ఎంత హడావిడి చేశారో చూశావా? నన్నే అందరు పూర్తిగా మర్చిపోయారు" అంటూ చిరు కోపం నటించింది.

"తల్లీ! ఈ మాట నీ కెప్పుడూ ఉండేదే కానీ..నువ్వు చెప్పినట్టు, ఇంట్లో ఏదో పెద్ద పండగ జరగబోతోందేమో అన్న ఫీలింగ్ నాక్కూడా వచ్చింది. ఇంటి ముందు, వెనుక దొడ్లో పెద్ద పెద్ద షామియానాలు వేయించడం, దానికి మామిడి తోరణాలు, లైటింగ్ ఎరేంజిమెంట్ చేయడం, ఇల్లు మొత్తం ముత్యాల ముగ్గులు వేయించడం..వీటి అన్నింటికీ మించి, ముఖ్యంగా మన వాళ్ళందరూ నా పై చూపించే అనురాగం జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. నేను నిజంగా చాలా అదృష్ట వంతురాలిని" మేఘమాల

ఎంతో ఆత్మ సంతృప్తితో ఆ మాట చెప్పింది.

"అంతేకాదు! నిజంగా ఇటువంటి తల్లి తండ్రులను పొందడం కూడా మనం చేసుకున్న అదృష్టమేను? అలాగే, శ్రీనివాసరావు మామయ్యగారు కూడా ఎంతో మంచివారు, నాతో చాలా అభిమానంగా మాట్లాడుతూ ఉంటారు"

"అవును కానీ! ఇల్లు ఇంత నీట్ గా సర్దబడి వుంది, ఇది ఎవరి ఇంట్రెస్టు మాలతీ?

"ఎక్కువ శాతం నాన్నగారికి ఎల్లప్పుడూ శుభ్రంగా కనిపించాలి. ఎక్కడ పెట్టే వస్తువు అక్కడే ఉండాలి. దుమ్మన్నది అసలు ఉండ కూడదు. అవసరమైతే ఆయనే శ్రద్ధ పెట్టి ఎప్పుడూ దులుపుకుంటూనే ఉంటారు!"

"ఇక డెకరేషన్, ఇల్లు అందంగా తీర్చి దిద్దడం అంటే అది నా పనే.. అది నాకెంతో ఇష్టం కూడా" ముచ్చటగా మొహం పెట్టి చెప్పింది మాలతి.

"అందుకేనా ఏంటీ, మీ గది ఇంత బాగుందీ? ఈ మంచం అయితే పాతకాలం సినిమాల్లో లాగా, చాలా ఎత్తుగా భలే బాగుందిలే? అసలు ఈ మంచం ఎలా ఎక్కుతావ్? దీనికి నిచ్చెన కానీ ఉందా, లేకపోతే వినోదే నిన్ను ఎక్కిస్తాడా?" అంటూ గల గలమని నవ్వేసింది మేఘమాల.

"ఊరుకో మేఘా, నీ హాస్యం నువ్వూనూ" అని మాలతి సిగ్గు పడిపోతూ అంది.

"సరదాగా జోక్ చేసానులే" అంటూ మేఘమాల సర్ది చెప్పింది.

"మేఘా! ఈ మంచం నీకంతగా నచ్చితే..పోనీ నువ్వూ, నేను ఇక్కడ పడుకుందాంలే" అంది మాలతి.

"అయ్యో! అలా అయితే పాపం, వినోద్ ఎక్కడ పడుకుంటాడు? అసలే ఇన్నాళ్లు మీరిద్దరూ దూరంగా కూడా గడిపారు" తనకు తెలియ కుండానే మేఘమాల మళ్ళీ వేళాకోళ మాడిందీ.

"బాబోయ్! ఇంక ఊరుకుంటావా?" అనంటూ సిగ్గు ముంచుకు వచ్చిన మాలతి తన రెండు చేతులతో మొహం కప్పేసుకుందీ.

"సరే సరే, ఇంకసలేం అననులే.. రా, ఇద్దరం నాన్నగారు వాళ్ళ దగ్గరకు వెళదాం. నిజంగా, ఆ స్నేహితులిద్దరు హాయిగా వెనక ఆరుబయట కూర్చుని మరీ కబుర్లు చెప్పుకుంటున్నారు. అంటూ మేఘమాల కుర్చీలోంచి లేచింది.

"నువ్వెళ్లు, నేను అందరికి భోజనాలు సిద్ధం అయ్యాయో లేదో చూసి వస్తాను" అని మాలతి చెప్పగానే, మేఘమాల ఇంటి వెనకవైపు ఉన్న పెరట్లోకి వెళ్లింది.

oooooooooooo

"స్నేహితులిద్దరు మంచి వెన్నెల వాతావరణంలో భలే మాట్లాడుకుంటూ కూర్చున్నారే?" అంటూ ప్రవేశించిన కూతుర్ని చూసి..

"నువ్వా రా తల్లీ, వచ్చి ఇక్కడ కూర్చో" అంటూ తన పక్క ఉన్న కుర్చీ చూపించారు నారాయణగారు.

మేఘమాల అయితే, అలా ఆ కుర్చీలో కూర్చోకుండా.. తండ్రి కాళ్ళ దగ్గర నేల మీద చతికిలపడీ, ఆయన కాలి మీద ప్రేమగా తలని వాల్చుకుంది!

"నారాయణా! మన మేఘమాల కారణంగా మనం అందరం కలిసి ఒకటిగా ఉండడం, వచ్చినప్పటి నుండీ అమ్మాయి అయితే ఎంతో ఆనందంగా గడపడం చూస్తుంటే..ఈ రోజు నేను ఎంత సంతోషం అనుభవిస్తున్నానో చెప్పలేను. ఈ అవకాశం మనకి కలిపించడానికి ఎంతగానో పాటుపడిన, వినోద్ కి ఏమిచ్చినా ఋణం తీరదు" అంటూ ఎంతో గాద్గదస్వరంతో శ్రీనివాసరావుగారు చెప్పారు.

"నిజమేరా! వాళ్ళ అత్తగారి బాధ తీర్చడానికి, ఏదో ఆవేశంలో నిర్ణయం తీసుకు వెళ్లాడనుకున్నాను కానీ, చాలా పట్టుదలగానే అనుకున్నది సాధించాడు? నువ్వు చెప్పినట్టు మనకెంతో మేలు చేసాడు" అని నారాయణ గారు కూడా ఒప్పుకున్నారు.

"ఏంటి మావయ్యా, నా గురించి ఏదో చెప్తున్నారు? అంటూ వినోద్ కూడా అక్కడికి వచ్చాడు.

"రావయ్యా, వినోద్. మేఘమాలతో పాటుగా, మన కుటుంబాలు కలవడానికి నువ్వు పడిన కష్టం గురించి మెచ్చుకోలుగా చెప్పుకుంటున్నాము" అంటూ తన పక్కకి వచ్చి కూర్చున్న అతడి భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వేస్తూ చెప్పారు శ్రీనివాసరావుగారు.

"పెద్దవాళ్ళు మీరు ఇద్దరు గుర్తించి, నన్ను పొగడడం అదృష్టమే కానీ..ఈ మేఘమాల గారు ఏమనుకుంటోందో మరీ? ఇంకా తిట్టుకుంటోందా, లేక ఒప్పుకుంటోందా?" ఆమెని వేళాకోళం పట్టిస్తూ అడిగాడు వినోద్.

"ఇంక అదేం అంటుంది నాయనా? మాటలే రానంత సంతోష సముద్రంలో మునిగి తేలుతూంటే తెలియటం లేదూ?" శ్రీనివాసరావుగారు, కూతురి మనసులో మాట కనిపెట్టినట్టే చెప్పారు.

ఆయన అన్న మాటలకి, మేఘమాల కిసుక్కున నవ్వేస్తూ "భలే చెప్పారు డాడీ?" అంది వెంటనే.

"నారాయణా! నిజం చెప్తున్నాను, నువ్వు మంచి అల్లుడిని సంపాదించావురా?" అని శ్రీనివాసరావు గారు మనఃస్ఫూర్తిగా అభినందించారు.

"అన్నట్టు,వాసూ! అమ్మాయికి మరి, పెళ్లి ప్రయత్నాలేమీ తలపెట్టలేదా?" మేఘమాల తలపై చెయ్యి వేసి నిమురుతూ, నారాయణ గారు అడిగారు.

"ఏదీ, ఆవిడగారు చేసికోవడానికి ఒప్పుకుంటేగా? ఎంతసేపూ చదువు, చదువూ. తర్వాత ఈ కలెక్టర్ బాధ్యత హడావిడీ, నాకైతే మనసులో ఆ బెంగ చాలా ఉండిపోయింది అనుకో " శ్రీనివాసరాగారు నిట్టూరుస్తూ స్నేహితుడికి చెప్పుకున్నారు.

"అలా ఏం కంగారు పడకురా. అమ్మాయికి తగిన మంచి సంబంధం చూసి తొందరలోనే చేసేద్దాంల్లే. మాలతిలాగా తనూ ఓ ఇంటిది అయిపోతే, మనం జీవితాన్ని మరింత హాయిగా గడిపేయొచ్చు" అని నారాయణగారు అంటుండ గానే ..

మేఘమాలకి ఎక్కడలేని సిగ్గు ముంచు కొచ్చి.."పోండి,నాన్నా! నాకేం పెళ్ళొద్దు" అనంటూ లేచి అక్కడ నుండి లోపలకి పారిపోయింది.

"హమ్మయ్యా! అది ఆ సిగ్గు పడడం చూస్తేనే, సగం పెళ్ళికి ఒప్పుకున్నట్టే అర్థమై పోతోంది? పోనిలే, మీరందరూ కలిసిన వేళ దానిలో ఈ మంచి మార్పే వచ్చింది నారాయణా?"

"మీరందరూ, అని అనడం తప్పురా.. మనందరం కలిసిన వేళ అన్న మాటని మాత్రం ఎప్పటికీ గుర్తుంచుకో?"

"అంతే కాదు! మేఘమాల ఏనాటికీ, నీ కూతురేను. అనుకోని కొన్ని పరిస్థితులలో దాని విషయం ఇలా బయట పెట్టాల్సి వచ్చింది అంతేను. అది కూడా నువ్వు ముందు తెలుసుకోవడం ఎంతయినా అవసరము వాసూ" ఎంతో గంభీర స్వరంతో నారాయణ గారు తన మనసులో ఉంచుకున్న విషయాన్ని చెప్పేశారు.

"నిజంగా, నువ్వు ఎంతో మంచి మనసున్న గొప్ప వాడివిరా నారాయణా. అందుకే ఊరు ఊరంతా నీకలా బ్రహ్మరథం పడుతోందీ..నువ్వు నా స్నేహితుడివి అవ్వడం నేను చేసుకున్న అదృష్ట భాగ్యమేనూ" అంటూ శ్రీనివాసరావుగారు చెమర్చిన కళ్ళతో, గుండె లోతుల్లోంచి వచ్చిన ఆ మాటలను చెప్పారు.

ఈలోగా మాలతి అక్కడికి వచ్చి.."నాన్నా! రండి, అన్నాలు వడ్డించేశారు" అని చెప్పగానే, స్నేహితులు ఇద్దరూ, వినోదు వెళ్ళడానికి ఉద్యుక్తులయ్యారు.

రాత్రి ఆ భోజనాలు అయిపోయాక, ఒకరి తర్వాత ఒకరు అందరూ కూడా హాల్లోకి చేరుకుని..ఏవో మాటల్లో మాటలుగా నారాయణగారు చెప్పే ఊరి విశేషాలు, సమస్యలు చాలా సేపు వింటూ కాలక్షేపం చేశారు!

చివరకి ఇక నిద్రకి ఉపక్రమించే ప్రయత్నాలు మొదలవ్వడంతో, అతిథుల రూంలో శ్రీనివాసరావుగారితో పాటుగా నారాయణగా-

రు, శాస్త్రి కూడా అక్కడే పడుకున్నారు!

ఇక గౌరి అయితే, నిర్మలమ్మ బామ్మగారికి నచ్చే అన్ని సంగతులు చెప్తూ.. ఆవిడ గదిలోనే కింద పడకకు చోటు సంపాదిచేసింది!

మేఘమాల మాత్రం తల్లిని వదలకుండా, వాళ్ళ గదిలో మంచం మీదే ఆవిడని కావలించుకు పడుకుని మరీ..జరిగిపోయిన ఏనాటి కబుర్లో చెప్పించుకుంటూ, తనకి తెలియ కుండానే ఎప్పటికో నిద్రలోకి జారుకుంది!

000000000000

మరునాడు కూడా లేచినప్పటి నుండీ ఆ ఊరిలో తెలిసున్న చాలా మంది వరకు పలకరింపుకి వచ్చి పోతూ ఉండేటప్పటికీ, మేఘమాలకి అసలు సాయంత్రం వరకు టైమే తెలియనంత తొందరగా గడిచిపోయింది!

ఆ సాయంత్రం మాత్రం 6 గంటలకి అన్నపూర్ణమ్మగారు చెప్పడంతో.. మేఘమాల, మాలతీ, గౌరీ, శాస్త్రి, రాముా, వీరందరూ వినోద్ తో కలిసి ఊరిలో ఉన్న తమ పొలాలకు చేరుకుని చాల సేపు హాయిగా గడిపేశారు!

అలాగే! దారిలో ఎంతో మంది ఆడ వారు, మొగవాళ్ళు వీళ్లకు ఎదురు పడినప్పుడు వారు ఆగి పలకరించడమే కాకుండా..ఒకే పోలికలో ఎంతో అందంగా ఉన్న మాలతి, మేఘమాలలను చూసి చాలా ముచ్చటపడి, అది వాళ్ళ ముందే వ్యక్తం చేయడం కూడా చూస్తుంటే..

అది ఆ కవలలు ఇద్దరికీ ఎంతో ఆనందం కలిగించినప్పటికీ, ఏదో తెలియని సిగ్గుగా కూడా అనిపించ సాగింది!

వినోద్ ఆ తర్వాత పనిగా తన వాళ్లందరినీ తీసుకుని..శ్రీరామ మందిరానికి కూడా వెళ్లి, ఆ దేవుళ్ళు అందరినీ దర్శించుకుని ఇంటికి తిరుగు మొహం పట్టేటప్పటికి రాత్రి 9 గంటలు దాటిపోయింది.

కారులో వెళ్ళమని తండ్రి చెప్పినప్పటికీ, వద్దంటూ సరదాగా నడుచుకుంటూనే వెళ్లడంతో మేఘమాలకి అయితే చాలా అలసిపోయినట్టు అనిపించడంతో.. భోజనం అయిన వెంటనే నిద్రపోవడానికి మంచం ఎక్కేసింది ఆమె!

00000000000

నారాయణగారు తలపెట్టిన ప్రకారం.. శనివారం నాడు యథా విధిగా "శ్రీ సత్యన్నారాయణ వ్రతం" పీటల మీద తమ భార్యా భర్తల ఇద్దరితో పాటుగా మేఘమాలని, మాలతీ, అల్లుడు వినోద్ లను కూడా కుర్చోపెట్టుకుని నిర్విఘ్నంగా పూజను జరిపించుకున్నారు.

నారాయణగారి దంపతులు ఎప్పటిలాగానే బంధువులకి, ఊరిలో బాగా కావలసిన వారికీ భోజనాల అనంతరం బట్టలు పెట్టి మరీ సాంప్రదాయ బద్ధంగా సాగనంపారు.

కొంతమంది తెలిసున్నవారికి అయితే మేఘమాలతో బట్టలు ఇప్పించి, వారు ఆమెని ఆశీర్వదిస్తుంటే నారాయణగారు ఎంతో సంతృప్తిని అనుభవించారు.

వినోద్ ఫోటో గ్రాఫర్ ని కూడా ఏర్పాటు చేయడంతో ఆ పూజా విధానం జరుపుకుంటున్నప్పుడు,ఆ తర్వాత ఫ్యామిలిలో అందరి గ్రూప్ ఫోటోతో బాటుగా.. మేఘమాల వాళ్లంతా తమ తమకు నచ్చిన పద్ధతిలో ఎన్నెన్నో ఫోటోలు తీయించుకుంటూ చాలా సరదా సరదాగా గడిపేశారు.

మేఘమాలకి అయితే ఆ వ్రతం గురించి తెలిసున్నా, అది ఎప్పుడు జరుపుకోకపోవడంతో..ఈ రోజున కొత్త బట్టలు కట్టుకుని, తన తల్లి - తండ్రులతో బాటుగా ఇలా ఆ వ్రతం చేసుకోవడం ఒక మంచి పనిగా అనిపించింది.

అలాగే!అమ్మా, నాన్నలకి, బామ్మకీ, శ్రీనివాసరావు డాడీకి దణ్ణం పెట్టీ .. ఆ దేవుని కథ అక్షింతలు తలపై వేయించుకుంటుంటే ఏదో తెలియని అనిర్వచనీయమైన ఆనందాన్ని కూడా పొందిందామె.

తాను అసలు ముందు వీళ్ళ కడుపునే పుట్టినప్పటికీ, అనుకోని విధంగా తను పసికందుగా ఉన్నప్పుడే వేరే చోట పెరిగి పెద్ద-

య్యి కూడా.. “ఆశ్చర్యం కాకపోతే! ఏదో డిటెక్టివ్ పరిశోధనలాగా తన కన్న తల్లి కోరిక మీద,వి నోద్ తనని వెతికి పట్టుకోవడం, తిరిగి మళ్ళీ తనకి జన్మనిచ్చిన వాళ్ళ దగ్గరకి చేర్చడం, ఎంతో విచిత్రమైన విషయమే అయినా..

అదంతా “ఆ భగవంతుని కృపా, కటాక్షం, జగన్నాధ నాటకమేను” అని కూడా మేఘమాలకి,ఈ రోజున ఎందుకో మనసున పరి పరి విధాల అనిపించ సాగింది.

“ఇంత మంచి కుటుంబంలో తను కూడా పుట్టినందుకు..ఎంతో ఉన్నతమైన విద్యా బుద్ధులు నేర్పించి, క్రమశిక్షణలో పెంచి పెద్ద చేసిన శ్రీనివాసరావు డాడీ ఆధ్వర్యంలో పెరిగినందుకు తను నిజంగా చాల చాలా అదృష్టవంతురాలు. జన్మ జన్మలకీ వీళ్ళే తనకి కావాలి” అని, జరిగిన అన్ని సంఘటనలను ఆత్మావలోకనం చేసుకున్న మేఘమాల, 'ఆ రమా సమేత వీర వెంకట సత్యన్నారాయణ స్వామికి' సాష్టాంగ నమస్కారం చేసి మరీ కోరుకుంది.

అలాగే! ప్రతి ఆడపిల్ల స్థిర చిత్తంతో, ధైర్య సాహసాలతో, ఆత్మ గౌరవంతో ఎదగాలని,సమాజంలో వారు మంచి పేరు, ప్రతిష్టలు తెచ్చుకుంటూ, కన్నవారికి గౌరవాన్ని పెంపొందేలా చూసుకుంటూ..అనుకోని కారణాలతో, ఊహించని పరిస్థితులలో ఒకవేళ ఎవరికైనా, ఏవైనా చిన్న చిన్న ఒడిదుడుకులు వంటివి ఎదురైనప్పటికీ వాటిని అధిగమిస్తూ జీవితాన్ని మరింత ఆనందమయం చేసుకోగలగాలని కూడా ఆ భగవంతుణ్ణి మనఃస్ఫూర్తిగా కోరుకుంది మేఘమాల.

పరిసమాప్తం

“ఈ మేఘమాలా IAS సీరియల్ ఎవరిని అనుసరించి కానీ, అనుకరించి కానీ రాయలేదని హామీ ఇస్తున్నాను.. ఇది కేవలం నా సొంత రచన” మీ సరోజ దేవి )

## అంకితం:-

శ్రీమతి యద్దనపూడి సులోచనా రాణిగారు ఈ రోజున(21-5-2018) తిరిగిరాని లోకాలకు తరలి వెళ్లిపోవడం..నాకు ఎంతో బాధాకరమై, తట్టుకోలేనటువంటి దుఃఖాన్ని కలిగించింది.

ఆవిడ మరణ వార్త వినగానే ఎంతగానో చెలించిపోయిన నాకు..వెను వెంటనే నా మనసున ఒక ఆలోచన కలిగి, అది “ఒక మంచి పనికి నాంది” కావడమే గాకుండా,మహా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి గారి పట్ల నా అభిమానం చాటుకునే అవకాశం పొందే మార్గం ఆ విధంగా ఆవిష్కృతమై నాకెంతో ఆత్మ సంతృప్తి నిచ్చెదయ్యింది.

అందుకే! ఎన్నో ఏళ్లుగా పాఠకులందరిని మెప్పిస్తూ,విజయవంతగా మునుముందుకు సాగుతున్న “చైతన్యం“ అనే మాస పత్రికలో ప్రారంభం నుండీ ముద్రింపబడుతున్న “మిస్ మేఘమాల IAS“ అనే, నేను రాసిన సీరియల్ సరిగ్గా ఈ రోజుతో నే (21-5-2018) రాయడం ముగింపు కాబడుతున్న సందర్భాన..

చిన్నప్పటి నుంచి నేను ఎంతగానో అభిమానించిన, ప్రాణసమానంగా భావించిన ప్రముఖ అద్భుత, మేటి తెలుగు వారి నవలా సామ్రాజ్ఞిని, శ్రీమతి యద్దన పూడి సులోచన రాణి గారికి..నా ఈ “మిస్ మేఘమాల ఐఏఎస్“ సీరియల్ ని మనస్ఫూర్తిగా "అంకితం“ ఇస్తున్నాను.



శ్రీమతి యద్దనపూడి సులోచన రాణి గారి పట్ల..నా అభిమాన భావన ;-

ఆవిడ రచనలని చిన్న వారి నుండి పెద్దవారి వరకు కూర్చున్న చోటు నుండి లేవకుండా కూర్చో పెట్టి చదివించగలిగాయంటే "ఆవిడ ఎంచుకున్న కథా వస్తువు, రాసే విభిన్న శైలి, వైవిధ్యమైన పాత్రలతో కూడి ఉండడమే కాకుండా.. "తన యొక్క స్త్రీ పాత్రతో మహిళల్లో ఆత్మ గౌరవం, ఆత్మ విశ్వాసం పెంపొందే నేపథ్యంలో..మహిళలలో ఎంతో స్ఫూర్తిని నింపారనడంలో ఎటువంటి సందేహము లేదు. అలాగే, మానవ సంబంధాలను తమ నవలలో ప్రతిభింబింప చేసీ..పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్న ఘనత కూడా ఆవిడదేను."

అంతటి గొప్ప రచయిత్రిని నా అదృష్టం కొద్దీ ఒకసారి హైద్రాబాదు నందలి వారి ఇంటిలో కలవడం జరిగిందీ. ఆవిడ రచనల పట్ల, ఆవిడ పట్ల నాకున్న అభిమానాన్ని తెలియ చేసుకునే యోగం కలగడం అన్నది .. నిజంగా అది నా పూర్వజన్మ సుకృతంగా భావించాను .

నాకు జ్ఞానం వచ్చాక, కథల పుస్తకాలు చదవడం మొదలుపెట్టినప్పుడు.. మొదటిగా చదివింది యద్దనపూడి సులోచనా రాణి గారి "సెక్రటరీ" నవలనేను. అక్కడ నుండే ఎన్నో, ఎన్నెన్నో ఆవిడ రచనలు చదివి, ఎంతగానో వారి యొక్క అభిమానినైనాను.

"మరణం ద్వారా స్వర్గలోకాలకి మీరు మరలి పోయినా.. ఓ గొప్ప రచయిత్రిగా"మిమ్మల్ని ఎప్పటెప్పటికీ ఎంతగానో అభిమానించే..

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)

## పోచినపెద్ది మురళీ కృష్ణ



### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రథమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తి తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.

(గత సంచిక తరువాయి)

భాగవక్త్రండు ఈశాన్య కోణాన్ని, భీషణుడు ఆగ్నేయ కోణాన్ని, శంకు కర్ణుడు నైరుతి కోణాన్ని, ధృమి చండుడు వాయవ్య కోణాన్ని, రక్షిస్తూ ఉంటారు. కాలాక్ష, రణ భద్ర, కౌలేయ, కాల కంపన అను ప్రమధులు గంగానదికి అవతలి వైపున కాపలా కాస్తూ ఉంటారు. వీరభద్రుడు, నభస్సు, కర్దమాలిప్త విగ్రహుడు, స్థూల కర్ణడు, మహా బాహుడు అను ప్రమధులు అసి నదీ తీరాన్నికావలా కాస్తున్నారు. విశాలాక్షుడు,మహా భీముడు, కుండోదరుడు, మహోదరుడు అనువారు దేహళీ తీరాన్ని కాపలా కాతున్నారు. నందిషేణుడు, పాంచాలుడు, ఖరపాదుడు, కరంటకుడు, ఆనందుడు, గోపకుడు, బభ్రుడు అనువారు వరుణా నదీ తీరాన్ని కాపలా కాస్తున్నారు.

కాశీ నగరంలో కపిలుడు, సావర్ణి, శ్రీకంఠుడు, పింగళుడు, అంశుమంతుడు, అనువారు తపస్సు చేసి పార్థివ శరీరముతో పరమేశ్వరునిలో ఐక్యమయిరి.

కాశీ నగరములో ఒక పుణ్యాత్ముడు శివలింగానికి నువ్వులు, అక్షింతలు సమర్పించి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి ఒక ఎలుక వాటిని తినడానికి వచ్చి, శివలింగము చుట్టు అనేక సార్లు ప్రదక్షణ చేసింది. ఆ పుణ్య ప్రభావము వలన ఆ ఎలుక సశరీరముతో శివునిలో ఐక్యము చెందింది.

గంగానది కెరటములచే తడపబడుచు, పాపహారి అయిన కాశీ నగరమునకు ఇతర నగరములు సమానమయినవి కావు. డుంఠి వినాయకుని గండస్థలమునుండి స్రవించుచున్న మద జలధారలు వరదలై ప్రవహించి, వరుణా నదిలో కలియుచున్నది. ఆ వరుణానది వరదలై పొంగి ప్రవహించి గంగానదిలో కలియుచున్నది. గంగానది నిండుగా ప్ర-

వహిస్తోంది.ఆ గంగానది ఒడ్డున ఉన్న కాశికా క్షేత్ర వైభవాన్ని వర్ణించుటకు బ్రహ్మకుకూడా సాధ్యము కాదు. ఉదయాన్నే నిద్ర లేవగానే ఎవరు "అవిముక్తము, అవిముక్తము , అవిముక్తము" అని మూడుసార్లు పలుకుతాడో వాడు ధన్యుడు.

కాశీ నగర పొలిమేరలో ఏప్రాణి అయినాదీర్ఘనిద్రకైకన్నులుమూసినట్లయిన(మరణించినట్లయిన) ఆ ప్రాణి కలలో తాను, పరమేశ్వరుడు ఒకటయినట్లుగా చూస్తాడు.

కాశీ నగరంలో ఒకస్త్రీ ఉదయాన్నే శివలింగం ఎదుట శుభ్రం చేస్తూ పరమేశ్వరునిలో ఐక్యమయినది.

ఓంకార నాథ శివ లింగం దగ్గర ఒక బిలము ఉంది. ఆ బిలము పాతాళ లోకానికి పోతుంది. ఆ బిలాన్ని మునులు రక్షిస్తూ ఉంటారు.

ఒక కప్ప తనను వెంటాడి వస్తున్న కాకికి భయపడి ఓంకార నాథుని ఆలయంలోనికి ప్రవేశించి శివలింగం చుట్టు ప్రదక్షిణ చేసింది. ఆ విధంగా ప్రదక్షిణము చేసిన పుణ్యం వలన ఆ కప్ప శివునిలో ఐక్యమైనిది. ఒక స్త్రీ తన పాటలతోను, మరొకత్తె తన నాట్యముతోను, మరొకత్తె పరమర్శ్వరుని స్తుతించి ఓంకారేశ్వరుని కారుణ్యాన్ని పొందారు. కాశీ నగరానికి వెళ్ళనివారు, మత్స్యోదరీ తీర్థాన్ని సేవింపనివారు, ఓంకారే-



శ్వరునికి ప్రణమిల్లనివారు దురాత్ములే.

" ఓ! కలశ సంభవా! పరమేశ్వరుడు పార్వతికి చెప్పిన త్రివిష్టపేశ్వరుని వృత్తాంతాన్ని చెబుతాను శ్రద్ధగా విను" అని కుమారస్వామి ఈవిధంగా చెప్పడం ప్రారంభించాడు.

విరజమను పీఠం దగ్గర శివుని పాద పీఠాన్ని ఒరుసుకుంటూ యమున, సరస్వతి, నర్మదా నదులు ప్రవహిస్తున్నాయి. ఆ నదులు త్రి సంధ్యలలోను తమ సుగంధ జలములతో త్రివిష్టపేశ్వర లింగాన్ని అభిషేకిస్తున్నాయి. ఈ మూడు నదులు త్రివిష్టపేశ్వరుని సమీపమునందు చంద్ర కళాలంకారములు, భుజగాభరణములు కల మూడు లింగాలను ప్రతిష్టించాయి. త్రివిష్టపేశ్వరుని, సాష్టాంగ దండ ప్రణామములతో అర్చించిన వారికి కర్మ బంధములు, మనోవ్యధ, పునర్జన్మ ఉండవు. గంగ , యమున, సరస్వతి, నదుల సంగమ స్థలమునందు పితృ తర్పణాలు సమర్పించిన వారు గయాతీర్థమునకు వెళ్ళవలసిన అవసరము లేదు. త్రివిష్టపేశ్వరునికి దక్షిణమునందు సరస్వతి నదిచే స్థాపించబడిన సరస్వతీశ్వర లింగాన్ని అర్చించిన వారికి సారస్వతమను పరమపదాన్ని ప్రసాదిస్తాడు. త్రివిష్టపేశ్వరునికి పడమటి దిక్కునందు యమునా నదిచే యమునేశ్వర లింగాన్ని ప్రతిష్ఠించింది. ఆ లింగాన్ని అర్చించినవారికి యమలోకము ప్రాప్తించదు. త్రివిష్టపేశ్వరునికి తూర్పుదిక్కునందు నర్మదానదిచే ప్రతిష్ఠించబడిన నర్మదేశ్వర లింగాన్ని అర్చించిన వారికి పునర్జన్మ ఉండదు.

ప్ర తీ రో జు త్రి వి ష్ట పే శ్వ రు ని ద ర్శించుకొన్నాడు లోకాలలోను ఒక వీసము తక్కువ బ్రహ్మతో సమానం అవుతాడు.

(ఇంకా వుంది)

# తుమ్మూరి రాంమోహన్ రావు



## మన విద్యా వ్యవస్థ

క్రితం నెల విద్యా వ్యవస్థకు సంబంధించిన కొన్ని విషయాలు ముచ్చటించుకున్నాం. దానికి కొనసాగింపుగా మరిన్ని మాటలు చెప్పుకుందాం. అందరికీ విద్య అన్నది అందరూ ఆమోదించే నినాదం. స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశలో అన్నీ సర్కారు బళ్లే. కాని అవి చాలా తక్కువ సంఖ్యలో ఉండేవి. ఉన్నత పాఠశాలలు జిల్లాకు రెండు మూడు కంటే ఎక్కువ ఉండేవి కావు. కళాశాలలు జిల్లాకొక్కటిగా ఉంటే మహా గొప్ప.

వసతుల పరంగా చూస్తే కనీస వసతులుఉండటమే అరుదు. అప్పట్లో స్త్రీ విద్యకై చాలా కృషి జరిగేది.యాభై అరవై విద్యార్థుల్లో ఇద్దరో ముగ్గురో ఆడపిల్లలు ఉండేవారు.పంతుళ్లు ఎక్కువ మంది H .S .C పాసయి బేసిక్ ట్రెయినింగ్ చేసిన వాళ్లే. దాదాపు అన్నీ తెలుగు మీడియం స్కూళ్లే. అయినా అప్పుడు చదువుకున్న విద్యార్థులతో పోలిస్తే ఇప్పటి విద్యార్థుల అవగాహనా పాటవం తక్కువే.మాకు ఆప్షనల్ మ్యాథమేటిక్స్ మరియు జనరల్ మ్యాథమేటిక్స్ రెండూ ఉండేవి. ఆ ఇద్దరూ కాలేజీలో చదవని వాళ్లే. అయినా వారి బోధన ఇప్పటి పోస్ట్ గ్రాడ్యుయేట్స్ కన్నా ఉత్తమంగా ఉండేది. త్రోవలో సారెదురైతే చాలా ప్రక్కగా జరిగి ఎంతో భయభక్తులతో వినయ విధేయతలతో మెలిగే వారు.

పల్లెటూళ్ల నుండి మైళ్లకు మైళ్లు నడిచి వచ్చి చదువుకున్న విద్యార్థులెందరో. అప్పుడీ మధ్యాహ్న భోజన పథకం అనేది లేదు. ఇప్పుడలాంటి కష్టాలేవి లేవు. కాని ఫలితం మాత్రం శూన్యం. పదవతరగతి పాసయిన విద్యార్థి తప్పులు లేకుండా ఇంగ్లీషులో కాదు మాతృభాషలో కూడా సెలవు చీటీ రాసే పరిస్థితి లేదు.అప్పట్లో ఏ పబ్లిక్ పరీక్షలకు ఏ పోలీసు బందోబస్తు ఉండేది కాదు.పిల్లల జవాబు పత్రాలు ఉపాధ్యాయుల ఇంటికే వచ్చేవి దిద్దడానికి.ఇప్పటిలా పేపర్ వ్యాల్యుయేషన్ సెంటర్లుండేవి కావు. ఇప్పుడు విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలు చదువుతున్నారు. దాదాపుగా అన్ని వర్గాలవారు తమ పిల్లల చదువు గురించి ఆలోచించే దశకు వచ్చింది. కాని చదువు నాణ్యతా ప్రమాణాలే చాలా నిరాశాజనకంగా ఉన్నాయి. ఇంకో విషయం అతి ముఖ్యమైనది కూడా సర్కారు బళ్ల సంఖ్యతో పాటు ప్రైవేటు పాఠశాలల సంఖ్య విపరీతంగా పెరిగింది.ఒకప్పుడు మాధ్యమంలో చదవడం గగన కుసుమం.కాని అదిప్పుడు కొనుక్కున్న వారికి కొనుక్కున్నంతగా పెరిగింది.

పై విషయాలను గనుక మనం విశ్లేషించుకున్నట్లయితే మనకేమనిపిస్తుంది. విద్యకు సంబంధించిన వనరులు పెరిగాయి. ప్రమాణాలు తగ్గాయి. కారణం ఏమిటి? లోపం ఎక్కడుంది?

ప్రభుత్వ పరంగా చూస్తే పాఠశాలలు పెంచారు. వసతులు కల్పించారు.ఉచిత భోజనం, ఉచిత పుస్తకాలు, ఉచిత దుస్తులు అందిస్తున్నారు. పంతుళ్లను పరీక్షించి పరీక్షించి అర్హులని తేల్చబడ్డ వారినే ఎంపిక చేస్తున్నారు. ఒకప్పుడు బతకలేక బడి పంతులు అనే సామెత చలామణిలో ఉండేది.ఇప్పుడు బతకాడినికి బడిపంతులు ఉద్యోగమంత ఉత్తమమైనది ఏదీలేదు. నెలకు అర లక్షజీతాలు తీసుకునే

ఉపాధ్యాలు వేలల్లో ఉన్నారు.ఇక ప్రయివేటు యాజమాన్యాలలో జీతాలు తక్కువ పని ఎక్కువ అనే పద్ధతే కొన సాగుతున్నా వారి వ్యాపారాత్మక విధానాలవల్ల ఫలితాలు సర్కారు బళ్లకంటే మెరుగ్గా ఉన్నాయి. ఆటో నడుపుకునే వార యినా(ఆర్థిక స్థాయి దృష్ట్యా) ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో తమ పిల్లల్ని చదివించుకుంటున్నారు.అంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదువు బాగుండదని ప్రజలు తేల్చేశారు. కాని ఇందులో పూర్తిగా నిజం లేదు.ప్రభుత్వ పాఠశాలలు అనుకున్నంత అధ్వాన్న స్థాయిలో ఏమీ లేవు. కాని కార్పొరేట్ యాజమాన్యాల మాయాజాలం ప్రజల్లో ఒక ఫాల్స్ ప్రిస్టేజిని క్రియేట్ చేసింది.ప్రభుత్వ పాఠశాలల పంతుళ్ల పిల్లలు సైతం ఆంగ్ల మాధ్యమ ప్రైవేటు పాఠశా లల్లో చదువుతున్నారంటే ఆ ప్రభావం ఏ మేరలో ఉందో ఆలోచించాలి.

ఇంకో ముఖ్యమైన విషయం. ఇదివరకు పల్లెల్లో చదివినా పట్నాల్లో చదివినా ఉన్నత స్థాయికి చేరుకున్న వాళ్లలో విద్యా ప్రమాణాలలో తారతమ్యత ఉండేది కాదు.ఎందుకు అప్పటి బోధన అయినా సరే,పాఠ్యాంశాల రూప కల్పన అయినా సరే-,విద్యా విధానమైనా సరే దాదాపు ఒకే విధంగా అమలు జరిగేది. విద్యార్థి రావలిన స్థాయికి రాక పోతే అదే తరగతిలో మళ్లీ మళ్లీ చదువవలసి వచ్చేది.ఆ భయానికైనా కొందరు చదివే వారు,- కొందరు మళ్లీ మళ్లీ చదవే వారు,కొందరు చదువ లేక మానేసే వారు.ఇప్పుడు డిటెన్షన్ సిస్టం తీసేయడంతో చదువక పోయినా విద్యార్థికి బాధలేదు.చదువు చెప్పక పోయినా ఉపాధ్యాయునికి చింత లేదు.సంవత్సరం పాటు హాజరుంటే నెక్స్ట్ క్లాసులోనికి ప్రమోటవుతున్నాడు.అప్పుడు నెల పరీక్ష, త్రైమాసిక,షాణ్మాసిక ,వార్షిక పరీక్షల విలువ ఏముంటుంది. అవి నామమాత్రపు పరీక్షలే.అప్పట్లో నెల పరీక్షలో తప్పినా మళ్లీ పరీక్ష నిర్వహించేవారు.

మరో ముఖ్యాతి ముఖ్యమైన విషయం.నాడు అన్ని వర్గాల వారికీ ఒకే పాఠశాల ఉండటం వల్ల ఉన్నత మేధా స్థాయి గల పిల్లల నుండి తక్కువ స్థాయి పిల్లలు గ్రహించే అవకాశముండేది.ఇప్పుడా పరిస్థితంతా ప్రైవేటు బళ్లకు మారి పోయింది.సర్కారు బళ్లలో ఎటూ దిక్కు లేని,విద్యంటే ఏ మాత్రమూ ఆసక్తిలేని బడికి సరిగా హాజరు కాని విద్యార్థుల వల్ల పంతుళ్ల ప్రయత్నాలు సఫలం కాలేక పాఠశాలల స్థాయి దిగజారి పోతున్నది.దానికి తోడు ఎక్కడలేని అదనపు బాధ్యతలు పంతుళ్ల మీద భారమయ్యేసరికి అధికారుల మెప్పుకై కుస్తీలతోనే సరిపోతుంది. ఇంకా చాల విషయాలు చర్చించాల్సినవి ఉన్నాయి.వాటి గురించి వచ్చే నెల మాట్లాడుకుందాం.

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు


చైతన్యం సంకల్ప బలం

## చందా రేట్లు

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
**CHAITANYAM SANKALPABALAM**
**A/c No. 1626201002070 - Canara Bank**
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:

Chaitanyam Sankalpabalam,
45058, Janapriya Utopia,
Hyderguda, Attapur
Hyderabad - 500 048

Email: teega51@gmail.com
Visit: www.chaitanyam.net

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు





# SPOKEN SANSKRIT

+91 9897959425

## (సంభాషణ సంస్కృతం -18)

**Unit-I**

शक्नोति-- शक्नुवन्ति
शक्नोमि— शक्नुम:

**1.** स: बालक: संस्कृते संभाषणं कर्तुं शक्नोति
**ఆ బాలుడు సంస్కృతంలో మాట్లాడ గలడు**
**That boy can (is able to) speak in Sanskrit.**
**2.** ते वृद्धा: वेगेन धावितुं शक्नुवन्ति
**ఆ వృద్ధులు వేగంగా పరుగెత్తగలరు**
**Those old people can (are able to) walk speedily.**
**3.** अहं संस्कृतं विना किमपि वक्तुं न शक्नोमि
**నేను సంస్కృతం కాకుండా వేరేది మాట్లాడలేను .**
**I can live with out Sanskrit.**
**4.** वयं भारतदेशस्य समुन्नत्यै सर्वमपि त्यक्तुं शक्नुम:
**మనం భారతీయులం దేశ హితం కోసం దేన్నైనా త్యాగం చేయగలం.**
**We are Indians and we are able to give/sacrifice every thing for the sake of our country.**
**Note:- Try to compose at least ten sentences by using these four words:**
शक्नोति-- शक्नुवन्ति
शक्नोमि— शक्नुम:

**Unit —II**
अवयवानां नामानि
**అవయవముల పేర్లు**
शिर:=**తల head ;** कपोल:=**చెక్కిలి cheek ;** ललाट:**నుదురు fore head**

भ्रू: =కనుబొమ eye brow ; अधर:=lip ; वक्ष:= chest ; नासिका = ముక్కు nose ; कर्ण:= చెవి ear ; नेत्रम्= కన్ను eye ; कनीनिका = కనుగ్రుడ్డు Eyeball ; चिबुक:=ఋగ్గ chin ; ओष्ठ:= పెదవి lip ; जिह्वा= నాలుక tongue; पृष्ठम् = వీపు/ నడుము back; वदनम् = ముఖము face ; मुखम् = నోరు mouth ;कन्धर: =కంఠము/ మెడ neck ; उर:= రొమ్ము chest ; उदर:= పొట్ట abdomen/stomach ; नाभि: = బొడ్డు navel ; नख:=గోరు nail ; अङ्गुष्ठिका = బొటన వ్రేలు thumb ; तर्जनी= చూపుడు వ్రేలు index finger ; मध्यमा = మధ్య వ్రేలు middle finger ; अनामिका = ఉంగరం వ్రేలు ring finger
कनिष्ठिका = చిటికెన వ్రేలు little finger ; हस्त: = చేయి hand
पाद:= కాలు /పాదము foot ; दन्त:= పన్ను tooth .

## Unit —III.

इत: पूर्वम्ఇంతకు ముందు x इत: परम् తరువాత
**Before x After**

**1.** गोपाल: इत: पूर्वं अध्यापक: आसीत् -- इत: परम् आचार्य: भविष्यति ||
**Formerly Gopal was a teacher and he will become professor in course of time.**
**2.** इत: पूर्वं सभा प्राचलत् इत: परं सांस्कृतिक कार्यक्रमा: प्रचलिष्यन्ति ||
**The meeting was held till now and cultural activities will follow next.**

## Unit –IV

एतादृश ఇటువంటి such , such like. –तादृश అటువంటి such like, like him – कीदृश ఎటువంటి what like, what type of .
**Note: - ఈ పదాలు నామవాచకాన్ని అనుసరించి మూడు లింగాలలోను కనిపిస్తాయి .**

పుంలింగం – స్త్రీలింగం – నపుంసకలింగం
**Masculine ---- Feminine -------------- Neuter**

| | | |
|---|---|---|
| एतादृश: | एतादृशी | एतादृशम् |
| तादृश: | तादृशी | तादृशम् |
| कीदृश: ? | कीदृशी ? | कीदृशम् ? |

एतादृश: (पुरुष: ) - एतादृशी (महिला) – एतादृशम्( पुस्तकम्)
तादृश: पुरुष: -तादृशी- महिला – तादृशम्- पुस्तकम्
कीदृश: पुरुष: ? –कीदृशी महिला ? - कीदृशम् पुस्तकम्)
1. एतादृश: उत्तम: पुरुष: समाजे आदरणीय: भवति ||

**This kind of good man is always respected in the society.**

**2.** एतादृशी उत्तमा महिला सर्वदा पूज्या भवति||

**This type of pious woman is to be honored always.**

**3.** एतादृशं उत्तमं काव्यम् अवश्यं पठनीयम् ||

**This sort of good treatise is always to be studied.**

**Unit –IV**

रिक्तम् **ఖాళీగా x** पूर्णम् **నిండుగా**

**Empty x full**

**1.** कासारे जलं रिक्तम् अस्ति

**చెరువులో నీరు లేదు**

**There is no water in the lake**

**2.** समुद्रे जलं पूर्णम् अस्ति

**సముద్రంలో నీరునిండుగా ఉంది**

**There is full of water in the sea.**

**3.** मम कोशे धनं रिक्तम् अस्ति

**నా జేబులో ధనం లేదు**

**There is no money in my pocket**

**4.** वित्तकोशे धनं पूर्णम् अस्ति

**బ్యాంకు లో ధనం పుష్కలంగ ఉంది .**

**There is abundant of money in bank.**

<><><>

**SUBHAASHITAM:**

**Kalidasa always stands first**

**(ఎటు చూసినా ఆయనే)**

**పూర్వం గొప్ప గొప్ప కవులెంతమంది ఉన్నారో తెలుసుకుందామని వ్రేళ్లతో లెక్కించడం మొదలు పెట్టారట . మనకైదు వ్రేళ్లుంటాయి. చిటికెన వ్రేలును ( little finger) సంస్కృతంలో కనిష్ఠిక అంటాం. ఉంగరం వ్రేలును (ring finger) అనామికా అంటాం. మధ్యనున్నవ్రేలు (middle finger) మధ్యమ. చూపుడువ్రేలు**

**(index finger) తర్జనీ. బ్రొటనవ్రేలు (thumb) అంగుష్ఠం. సరే చిటికెన వ్రేలుతో లెక్క మొదలయ్యింది. అది కాళిదాసు కైవశం చేసుకున్నాడు. ఇక ఆయనతో సమానులెవరా అని చూస్తే ఎవరూ కనబడలేదట . అందుచేత ఆ తరువాత వ్రేలుకు అనామిక (పేరు లేనిది) అనే పేరు సార్థకం అయ్యిందట.**

पुरा कवीनां गणनाप्रसङ्गे
कनिष्ठिकाधिष्ठितकालिदासा ||
अद्यापि तत्तुल्यकवेरभावात्
अनामिका सार्थवती बभूव||

**పురా కవీనాం గణనాప్రసంగే**
**కనిష్ఠికాధిష్ఠితకాళిదాసా**
**అద్యాపితత్తుల్య కవేరభావా**
**దనామికా సార్థవతీ బభూవ**

**ఎంత అద్భుతంగా ఉంది ఈ కల్పన!.**
**కాని కొంతమందికి లెక్కపెట్టేటప్పుడు చిటికెన వ్రేలునుంచి కాక బ్రొటనవ్రేలు నుంచి లెక్కపెట్టే అలవాటుంటుంది . మరి వాళ్ల సంగతేమిటి? వాళ్లకి కూడ సౌకర్యంగా ఉండడం కోసం మరో అద్భుతమైన శ్లోకం వ్రాశారు ఆంధ్రదేశీయులు, ప్రముఖ కవి,పండితులు కీ||శే|| శ్రీమాన్ అత్తిలి గోపాలకృష్ణమాచార్యులుగారు. అది కూడ ఎంత రమణీయంగ ఉందో చూడండి.**

पुरा कवीनां गणनाप्रसङ्गे
त्वङ्गुष्ठिकाधिष्ठितकालिदासा ||
तत्तौल्यमुद्भावयितृन्प्रतर्ज्याऽ
भूत्तर्जनी सार्थकनामधेया ||

**పురా కవీనాం గణనాప్రసంగే**
**త్వంగుష్ఠికాధిష్ఠితకాళిదాసా**
**తత్తౌల్యముద్భావయితృన్ ప్రతర్జ్యాఽ**
**భూత్తర్జనీ సార్థకనామధేయా**

**పూర్వం కవుల పేర్లు లెక్కపెట్టడం మొదలెట్టారట. బ్రొటనవ్రేలితో లెక్క మొదలయ్యింది. బ్రొటనవ్రేలు కాళిదాసుకు దక్కిందట. ఇక 'అతనితో నేను సమానం' అని ఎవరైన భావిస్తే వారిని భయపెట్టి చూపుడు వ్రేలు 'తర్జనీ' అని పేరు తెచ్చుకుందట. తర్జయతి అనయా ఇతి తర్జనీ (భయపెట్టేది కాబట్టి తర్జనీ). మనం ఎవరినైన భయపెట్టేటప్పుడు చూపుడు వ్రేలితోనే భయపెడతాం కదా! కాబట్టి ఎటు చూసినా ఎలా చూసినా కాళిదాసే గొప్పవాడు. కాళిదాసా మజాకా!**

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

కొనేవాడికి చెప్పాల్సిన మాటలు కొనేవాడికి చెప్పుతాడు. కొట్టాల్సిన చోట, మగతనం మీద కొడ్తే... ఏ మగాడు ఊరుకుంటాడు... కొంటాడు అంతే.... అయిదు వందలకు కొని పదిహేను వందలకు అమ్ముతాడు..అదీ కత్తెరగాడి దెబ్బ అంటే..

చివరకు నందుల సుబ్బయ్యకు కూడా కత్తెరగాడి అవసరం పడింది. ఎప్పుడూ తల దూర్చేవాడు కాదు. ఎద్దులు దిగగానే మొదట వచ్చి చూసేది కత్తెర గాడే ..... కొనేవాళ్లను పంపేది తానే... కానీ ఏ రోజూ 'కమీషన్' అడగలేదు. కానీ ఆఱు పుండైన ఎద్దును, పండుకునే ఎద్దును, పొడిచే ఎద్దును, గాలికుంటు తగిలిన ఎద్దును అమ్మిచ్చి పుణ్యం కట్టుకుంది కత్తెర గాడే.

## పాడి వైభవం

నందుల వారింట నందీశ్వరుల వైభవం అలా ముగిసింది. నందీశ్వరుల తర్వాత చెప్పుకోవాల్సింది మా ఇంట పుట్టిన బర్రెలు. మా యింట ఎప్పుడూ కనీసం రెండు బర్రెల పాడి వుండేది. పుష్కలంగా పాలు, పెరుగు దొరికేవి. ఎప్పుడు కావాలంటే అప్పుడు అమ్మ వెళ్లి, బఱ్ఱె వీపు తట్టి, పొదుగు కడిగి, పాలు పిండేది.

ఎద్దుల వైభవం నడిచినన్ని రోజులూ బర్రెలకు కూడా వైభవం బాగానే నడిచింది. మంచి గడ్డి, కడుగు నీళ్లు, కుడితి అన్నీ బాగానే వుండేటివి. తిండి పుష్కలంగా ఉంటే పాలు పుష్కలంగానే ఇచ్చేవి. బర్రెలు సూటిపైనా, పాలిచ్చేపైనా, ఎండిపోయినా ఒకే రకంగా పోషణ జరిగేది. బఱ్ఱె ఈనిందంటే దానికి మనుష్యులకు చేసినట్లు బాలింతతనం చేసేవాళ్ళు. దూడకున్న తడిని, ఒక రకమైన బంక బంకగా వుండే దూడను శుభ్రంగా నాకుతుంది. దూడ కాళ్ళ గిట్టల మొనలు మెత్తగా సున్నితంగా ఉంటాయి. అవి గిల్లి తల్లికి పెడతారు. పుట్టిన గంటలోపే లేచి నిలబడుతుంది. రెండు జతల కాళ్ళ మధ్యలో చిన్న కర్రతో నెమ్మదిగా తట్టడుస్తారు. దీన్ని 'కొంకులు కొట్టటం ' అంటారు. కాలికీళ్లను సరిచేయటమన్నమాట.

ఆ తరువాత వండిన ఆముదంలో చూపుడు వేలు ముంచి దూడ నోట్లో పెట్టి దాని దవడలను వెనుకకు ముందుకు కదిలిస్తారు. అంటే చీకటం నేర్పుతారు. ఆ తరువాత తల్లి పొదుగు దగ్గరకు తీసుకువెళ్లి పాలు తాగిస్తారు. దూడ పుట్టిన వెంటనే తల్లి దాన్ని శుభ్రంగా నాకకున్నా, కాలి గిట్టల మొనలు తినిపించకున్నా తల్లికి,





పిల్లకు అనుబంధమేర్పడదు. పాలు 'చేపు ' కు రావు. అందుకే ఈ తతంగమంతా.

మా ఇంట్లో పుట్టిన బఱ్ఱె దూడలన్నీ ఆడవే, అంటే పెయ్య దూడలు. మా నాయన చాలా గర్వంగా చెప్పేవాడు. 'మా ఇంట్లో మనుషులకు పుడితే మగపిల్లలు, బర్రెలకు పుడితే ఆడపిల్లలు' అని. మనుషుల్లో మగపిల్లలు లాభదాయకం, పశువుల్లో ముఖ్యంగా బర్రెల్లో ఆడ సంతానం లాభదాయకమని వ్యవసాయ కుటుంబాలు భావిస్తాయి.

మా ఇంట్లో పుట్టిన దూడలు అన్నీ ఆరోగ్యంగా పెరిగాయ్. నాకు తెలిసినంతవరకు ఒకే ఒక దూడ చనిపోయింది. పుట్టిన నాలుగు రోజుల తరువాత అకస్మాత్తుగా చనిపోయింది. మామూలుగా అయితే పల్లెటూర్లలో దూడలు చనిపోతే బర్రెలు పాలు ఇవ్వవు. అందుకై దూడ బ్రతికేవుందని బర్రెకు భ్రాంతి కలిగించటానికి చనిపోయిన దూడ చర్మం ఒలిచి, దానిలో వరిగడ్డి కూరి మళ్ళీ కుట్టేసి దూడ ఆకారంలో తయారు చేసి బర్రెముందు నిలబెడతారు. అప్పుడు బఱ్ఱె తన దూడను నాకి దానిపై వున్న ప్రేమతో దానికి పాలివ్వాలని 'చేపుకు' వస్తుంది. చేపుకు రావటమంటే .... పొదుగులోకి పాలు నింపటమన్నమాట. తన బిడ్డ కోసం నింపిన పొదుగును మనిషి వంపుకుంటాడు. మా ఇంట్లో దూడ చనిపోతే 'నకిలీ' దూడను తయారుచేద్దామన్నారు. అమ్మ దానికి అంగీకరించలేదు.

మొదటిది చనిపోయిన లేతదూడ చర్మాన్ని వొలవటం, రెండవది తల్లిని మోసం చెయ్యటం. ఈ రెండు కారణాలవల్ల ఆ పనికి అమ్మ ఇష్టపడలేదు. అయితే ఆ అవసరం లేకుండానే అమ్మ తన ప్రేమతో బఱ్ఱె వీపు తట్టి పొదుగు కడిగి, ఆముదం రాసి పిండటం ప్రారంభించగానే బఱ్ఱె చేపుకు వచ్చేది.

(ఇంకా వుంది)

## ఎలక్ట్రాన్



# ఉచితభోజన విద్యాలయాలు

పట్టభద్రుడైన నాగరాజు ఇకపై చదువులు చదివే సామర్థ్యం లేక ఊళ్లోనే ఉన్న ఓ సర్దార్జీ కార్ఖానాలో చేరాడు. నైట్ కాలేజీలో చదివి బి.యిడి. డిగ్రీ దొరపుచ్చుకొన్నాడు. తర్వాత జిల్లా టీచర్ అర్హత పరీక్ష కూడా పాసయ్యాడు. మూడు సంవత్సరాలైనా ప్రభుత్వం అతనివైపు కన్నెత్తి చూడలేదు. ఇలాకా ఎమ్మెల్యే చిలక పలుకులు పలికాడే తప్ప ఏమీ చెయ్యలేకపోయాడు. నాగరాజు తనలాంటి మరి కొందరితో కలిసి విన్నపాలు చేసుకొన్నాడు. నిరసన ప్రదర్శనలు చేశాడు. గొలుసు నిరాహార దీక్షలు చేశాడు. చివరికి ఎలాగైతేనే ఓ మాధ్యమిక పాఠశాలలో ఉద్యోగం దొరికింది. ఒకటినుంచి ఎనిమిదో తరగతి వరకు నగరపాలక సంస్థ అధ్వర్యంలో నడుస్తున్న ఆరు మాధ్యమిక పాఠశాలల్లోనూ అదొకటి.

తనని పడేసిన నాలుగో నెంబరు పాఠశాల పేరు ' నగరపాలిక విద్యాప్రదాన మాధ్యమిక పాఠశాల.' ఆంగ్లంలో ఎమ్ ఏమ్ ఎస్-4 అంటే మున్సిపల్ మిడిల్ స్కూల్ నెంబరు 4. ఊరికి కాస్త దూరంలో ఒక రాళ్ళ క్వారీ పరిసర ప్రాంతంలో ఆ స్కూలు ఉంది. ఏ విధానా తప్పించుకోలేని అభ్యర్థులకే ఆ స్కూల్లో పోస్టింగ్ జరుగుతుంది. నాగరాజుకి ఆ స్కూల్లో పోస్టింగ్ చేస్తూ ఉత్తర్వులు వచ్చిన వెంటనే, ముహూర్తమూ, మంచిరోజూ, అని చూడకుండా ఆ మధ్యాహ్నం రెండు ప్రాంతంలో స్కూలికి వెళ్ళాడు. ఏవో రికార్డులు చూసుకొంటున్న ప్రధానోపాధ్యాయుడు రామశర్మ సాదరంగా ఆహ్వానించాడు.

" మీ ఆర్డరు తాలూకు కాపీ నాకు నిన్న సాయంత్రమే అందచేయబడింది. వస్తారో, రారో అనుకొన్నాను."

"అర్హత సంపాదించిన ముడుసంవత్సరాల తర్వాత వచ్చిన అవకాశం. ఎందుకు వదులుకొంటాను సర్?"

"ఉన్నవి ఎనిమిది తరగతులు. విద్యార్థుల సంఖ్య తరగతికి పాతిక, ఇరవైల దరిదాపుల్లో. స్కూల్లోని మొత్తం విద్యార్థుల సంఖ్య 200. ఉన్న టీచర్ల సంఖ్య ఈ పూటే చేరిన మీతో, నాలుగేళ్లుగా ఉన్న నాతో సహా నలుగురు. ఉదయం తొమ్మిదింటినుంచి మధ్యాహ్నం పన్నెండు వరకూ, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగింటివరకూ స్కూలు నడుస్తుంది. నాలుగు తర్వాత అందరిచేతా అరగంటసేపు ఆటలు ఆడించాలి. శనివారం బడి ఒంటి పూట నడుస్తుంది. పన్నెండూ ఒంటిగంట మధ్యలో పిల్లలకి పోషకాహారం తినిపించాలి. ఒక వంట వాడూ, సహాయకురాలూ పదిన్నరకి వచ్చి, అది కావాలి, ఇది లేదు అని సతాయించి, సణుక్కుంటూ స్కూలునీ, విద్యార్థుల్నీ ఏదో ఉద్ధరిస్తున్నట్టుగా వంటచేసి, ఒంటిగంట తర్వాత వెళ్లిపోతారు. ఆ భోజనాల సమయంలో మన నలుగురిలోనూ ఎవరో ఒకరు పర్యవేక్షణ చేయకపోతే సంగతులింతే! మునిసిపాలిటీవాళ్ళు ఏవో వాళ్ళ నిర్ణీతమైన కొలతలతో ఓ వారం రేషన్ ఆదివారం పూట అందించి, రెండు రోజులకోసారి ఇన్ని కూరగాయలు పడేసి పోతారు. ఈ లెక్కాపత్రాల నన్నింటినీ మనం ధ్రువపర్చి సంతకం చేసి యివ్వాలి. అటు సుద్దులు చెప్పాలో, ఇటు పద్దులు చూస్తూ ముద్దలు తినిపించాలో తెలియని పరిస్థితి. అయినా మీరు కంగారు పడొద్దు.

ఈ పాఠశాలల తత్త్వం బోధపడితే మీరే సర్దుకు పోతారు!" ఆయన మాటల్లో వైరాగ్యం నాగరాజుకి కొట్టవచ్చినట్లు కనబడింది.

"పిల్లలెవరూ కనబడటల్లేదు, సెలవుకాని యిచ్చారా?"నాగరాజు అడిగాడు.

"పిల్లలొక్కరే కాదు, ఉన్నఇద్దరు టీచర్లూ మధ్యాహ్నం భోజనాలయిన తర్వాత ఇళ్ళకి వెళ్లిపోతారు. క్లాసుకు నలుగురో అయిదుగురో శ్రద్ధగల విద్యార్థులుంటారు. నేనే మధ్య మధ్యన వెళ్ళి వాళ్ళకి ఏదో చెప్పి, వచ్చి ఇలా కూర్చుని ఏదో పని చేసుకుంటూ కూర్చుంటాను."

"మరి ఆ యిద్దరు టీచర్లూ ఎందుకు వెళ్లిపోతారు?"

"ఒకరు ప్రసాద్. మరొకరు కామేశం. వాళ్ళు కావాలనే ఈ స్కూలుకి వేయించుకొన్న మతలబుల మొండిఘటాలు. మధ్యాహ్నం పిల్లలే ఎలాగూ వెళ్లిపోతారు కాబట్టి, వీళ్ళు ఇద్దరూ పోయి వాళ్ల దుకాణాల వ్యాపారం చూసుకొంటారు. ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోరు. ఎప్పుడైనా ఇనస్పెక్షన్ జరిగినప్పుడు మట్టుకు ముందస్తు సమాచారం అందుకొని, ఆ రోజు బుద్ధిగా స్కూలు అయిపోయేవరకూ ఉంటారు. పిల్లల తల్లిదండ్రుల్ని పిలిచి కౌన్సిలింగ్ చేస్తే, క్వారీలో పిల్లలు కూడా పనిచేస్తే కానీ తమకి గడవదని గోల పెడ్తారు. కార్మిక నాయకులు వాళ్ళకి దన్నుగా నిలబడ్తారు. మునిసిపల్ అధికారులకి విషయం చెబ్తే పిల్లల్ని బెల్లిపించే లౌక్యం నేర్చుకోమంటారు. నేర్చుకున్న లౌక్యమేమిటంటే నోరుమూసుకొని కూర్చోడం. మధ్యాహ్నం భోజనంకోసం రావడం, అటుతర్వాత చిన్నచిన్న సంపాదనలకోసం వెళ్లిపోవడం తల్లిదండ్రుల పేదరికానికి సూచికలుగా గుర్తించి ఓ నిట్టూర్పు విడవడం తప్ప చేసేది లేదు. ఓ సారి స్కూలుని చుట్టబెట్టి రండి. స్కూలు పేదరికం తెలుస్తుంది!"

నాగరాజు లేచి వెళ్ళి ఓ సారి స్కూలునంతా కలయజూశాడు. ఇంగ్లీష్ యు ఆకారంలో ఉంది. చెరోపక్క నాలుగేసి గదులు. ఒక గదిలో మొత్తం పదిమంది విద్యార్థులు గుమిగూడి కనబడ్డారు. అందర్నీ పేర్లడిగి తెలుసుకొన్నాడు. వాళ్ళు అన్ని తరగతులకీ చెందిన వాళ్ళు. ఒక ఎనిమిదవ తరగతి విద్యార్థి చిన్న తరగతుల వాళ్ళకి కూడికలూ, తీసివేతలూ చెబ్తున్నాడు. అతని పేరు మురళి. మరొక ఏడవ తరగతి విద్యార్థి శంకర్ తెలుగు పదాల డిక్టేషన్ చెబ్తున్నాడు. 'పద్మభూషణుడు- విష్వక్సేనుడు-కుంభకర్ణుడు..' కుర్రవాళ్లు రాస్తున్నారు. ఇలాంటి విద్యార్థులే స్కూలు గౌరవాన్ని నిలబెడ్తారనుకొన్నాడు నాగరాజు. ఓ అరగంట అక్కడే ఉండి చాలామంది సందేహాలు తీర్చాడు. నాలుగింటికి గంట వినబడింది. ఆ గంట కొట్టింది హెడ్మాస్టర్ రామస్వామి. ఆ స్కూలుకి అటెండర్ అనే వాడెవడూ లేడు. అందరూ వెళ్లిపోగా ఆ ఇద్దరు విద్యార్థులు మట్టుకు నాగరాజు వెంబడి వెళ్లారు.

మధ్యగా కుడి ఎడమల రెండు బ్లాకుల్నీ కలుపుతూ రెండు గదులు. ఒక గది హెడ్మాస్టర్తో సహా తామందరూ కూర్చునే గది. దాని తీరు వచ్చినప్పుడే తెలిసిపోయింది. తలుపులూడిపోయిన ఓ కర్ర బీరువా. మాసిన రిజిస్టర్లూ, నలిగిన దస్త్రాలూ. పెద్దాయనకి మాత్రమే ఒక మేజా. ఆయన ఇంటివద్దనుంచి తెచ్చుకొని వేసిన ఓ నీలంరంగు టేబుల్ క్లాత్. ఒక గోడకి గడియారం. ఓ నాలుగు ప్లాస్టిక్ కుర్చీలు.

దాన్నిమరోసారి చూడనవసరంలేదు కాబట్టి నాగరాజు పక్కగదిలోకి వెళ్ళాడు. గదిలో రెండు పొడుగాటి బల్లలున్నాయి. వాటిమీద బియ్యం బస్తా, పప్పుదినుసుల మూటలూ, చింతపండు బుట్టలూ ఉన్నాయి. పోపు సామానులూ అవీ మాసిన సీసాల్లో తలుపులు లేని అలమార్లలో ఉన్నాయి. ఒకపక్కన కమ్మర్షియల్ సైజు గాస్ స్టవ్ ఉంది. మరొక పక్కగా మసిబారిపోయిన అల్యూమినమ్ పాత్రలూ, ఇనపతీగల బుట్టల్లో కొన్ని కూరగాయలూ ఉన్నాయి. బంగాళాదుంపలు, ఉల్లిపాయలూ పర్వాలేదనిపించినా, పండిపో

యిన దొండకాయలూ, ముదురు బెండకాయలూ, వడిలిపోయిన తోటకూరా నాగరాజు మనసుని ఒక్కసారిగా కలచివేశాయి. ఆ గది పొగబారిపోయి, బూజులతో నిండి ఉంది. వంటగదికి బయట వరండాలో ఒక పక్కగా ఓ పెద్ద సిమెంట్ కుండీ ఉంది. వంటకీ, విద్యార్థులకీ ఉపయోగంగా ఉండే సిమెంట్ నీళ్లకుండీ! కుండికి దిగువభాగంలో రెండు కుళాయిలున్నాయి. రెండు అల్యూమినం గ్లాసులు సన్నపాటి గొలుసులతో వేళ్లాడ దీయబడ్డాయి. పైన ఉన్న గుండ్రటి ఇనపమూతని ఎత్తి చూశాడు. లోపల కుండీలో గోడలకి నాచు పట్టి ఉంది.

గదులన్నింటికీ పైన బంగాళాపెంకుల కప్పు. చాలా పెంకులు పగిలి ఉన్నాయి. గోడలన్నీ పెచ్చులు ఊడిపోయి, యిటుకలు కనబడ్తున్నాయి. మూడు బ్లాకుల వరండాలూ గుంటలుపడి ఉన్నాయి. గదుల్లోని తాటి దూలాలికి బూజులు వేళ్లాడుతున్నాయి. ప్రతి తరగతి లోనూ తెల్లబారిపోయిన నల్లబల్ల. టీచరు కూర్చోడానికి మకిలి ఇంకిపోయిన ప్లాస్టిక్ కుర్చీలు తప్ప మేజాలు లేవు. ఒక్క ఏడు, ఎనిమిది తరగతుల గదుల్లో తప్ప, విద్యార్థులు కూర్చోడానికి ఒక్క నేలబారుబెంచీ కూడా లేదు. ప్రాంగణానికి ప్రహరీ గోడలేదు. కుక్కలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. తాము కూర్చునే గదిముందు వరండాలో ఒక రైలుపట్టా ముక్క వేలాడదీసి ఉంది. గంటకొట్టడానికి ఒక ఇనపకడ్డీ ఉంది.

నాగరాజు తిరిగివచ్చి రామశర్మ ఎదురుగా కూర్చున్నాడు. ఆ యిద్దరు విద్యార్థులూ బయట నిల్చున్నారు. రామశర్మ వారినిద్దర్నీ పేరుపెట్టి పిలిచి లోపలికి రమ్మన్నాడు.

"ఈ స్కూల్లో నాకు నైతిక బలం ఇచ్చేవాళ్లు ఈ ఇద్దరూ, మీరు చూసిన మరికొద్దిమందే! ఏ సహాయం కావల్సినా చేస్తారు. మీరు స్కూలునంతటినీ చూసి వచ్చారు. ఎన్నో ప్రశ్నలతో మీరు సతమతమౌతున్నారని మీ ముఖం చూస్తేనే తెలుస్తోంది. సవరించడానికి ప్రయత్నం చేయలేదని కాదు. చేసి,చేసి చేతులెత్తేశాను. ఇంటిపన్నుల్లో మున్సిపాలిటీ తీసుకొంటున్న రెండు శాతం లైబ్రరీ సెస్సుని కూడా నగర పాలక సిబ్బంది జీతాలకోసం సర్దేస్తున్నారు. గ్రంథాలయాల పేరుమాట దేముడేరుగు కానీ, ఈ స్కూల్లో గోడకి దేశ, ప్రపంచ పటాలు కూడా తగిలించడానికి, ఆఖరికి భూగోళం చూపించడానిక్కూడా సొమ్ముల్లేవంటున్నారు. అటుచూస్తే ప్రైవేటు స్కూళ్ళలో ఆధునిక ఎలెక్ట్రానిక్ ఉపకరణాలతో విద్యాబోధన చేస్తున్నారు. ఒకనాటి రాళ్ళక్వారీ యజమాని అతని కుటుంబ పరిస్థితుల కారణంగా రాజస్తాన్ తిరిగి శాశ్వతంగా వెళ్లిపోతూ, ఏదైనా స్కూలు పెట్టమని ఈ బిల్డింగ్ ని మునిసిపాలిటివాళ్లకి ధారదత్తం చేశాడు. అప్పట్లో ఊరిలోని కొందరు పెద్దలు మిడిల్ స్కూలు స్థాపనకి నడుము వంచి శ్రమపడ్డా, ఈ వార్డు మెంబర్లు ఏ విధమైన శ్రద్ధా తీసుకోని కారణంగా మిగిలిన మునిసిపల్ స్కూళ్లకన్నా అధ్వాన్న స్థితిలో ఉంది. ఆ నలిగిపోయిన ఫైళ్లలో నేను స్వదస్తూరితో రాసిన ఉత్తరాల కార్బన్ కాపీలు తీరుబడిగా చదవండి. బడుగువర్గాల విద్యార్థుల కోసం ఈ మధ్యాహ్నభోజన పథకం చేబట్టినా, రాష్ట్ర పాలకవర్గం లక్ష్యమే వేరన్న సంగతి తేలిపోయింది. వారొకందుకు ఈ పథకాన్ని ప్రవేశపెడ్తే, తల్లిదండ్రులు ఒకపూట భోజనం కోసం పిల్లల్ని పంపిస్తున్నారు."

"సర్! ఇవన్నీ తెలియని విషయాలు కావు. ఆ రాజకీయాలు మనకి అనవసరం. ముందస్తుగా మనం వంటగది వ్యవహారం చూడాలి. మంచినీటి సరఫరా సంగతి చూడాలి. ఏదైనా జరగరానిది జరిగితే 'విషాహారం' తినిపించిన నాలుగో నెంబరు మున్సిపల్ స్కూలు అని అపనింద వచ్చేది మనకే!"

"బాధ్యత మీదే అనకుండా మనదే అన్నారు. యిది చాలా సంతోషించవలసిన విషయం నాగరాజు గారూ," అన్నాడు రామశర్మ.

(ఇంకా వుంది)

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

( ఆధారం : న = అసలు అక్షరం 'వ' )

**నవపఢనుంబు జోమరువ నాచవరైవ రతాహఢత్షజువ్**
**నవపనవీనిచాతజక్షవండు కొక్షంయయుపేగుయావి యుం**
**ఢవరువ కుఝ్ఘుపీనవ నిఢాయ నిఖావ వితూభ వైముసీ**
**పవిష రచాగటో నిఢనలాతరు చంలజు రావ్మపాక్షువే**

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

ఊరక రారు మహాత్ములు
వారధముల ఇండ్లకడకు వచ్చుటలెల్లన్
గారణము మంగళములకు
నీ రాక శుభంబు మాకు నిజము మహాత్మా

మే నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు:



శ్రీ వేదుల సుబ్రహ్మణ్యం



శ్రీ తుమ్మూరి రాంమోహన్ రావు



శ్రీ కె మురళీమోహన్



చైతన్యం

# కొత్త రామానందం



## శ్రీ బ్రహ్మ దేవుడికి ప్రీతికరమైన నిజ జ్యేష్ఠ మాసం

శ్రీ మహా విష్ణువుకు వైశాఖ మాసం... శ్రీ పరమ శివుడికి కార్తీక మాసం ఏవిధంగా ప్రియమైనవో... జ్యేష్ఠమాసం సృష్టికర్త అయిన శ్రీ బ్రహ్మదేవుడికి అత్యంత ప్రీతికరమైనది. ఈ నెలలో సృష్టికర్తను పూజించడం మంచిది.

ఈ నెలలో ఏదో ఒక రోజు నీటిలో నిండిన కడవను

"దేవదేవ హృషీకేశ సంసారార్ణవ తారక
ఉదకుంభ ప్రదానేన యా
స్వామి పరమాం గతిమ్ "

అనే శ్లోకాన్ని పఠిస్తూ దానం ఇవ్వవలెను. అంతే కాకుండా ఈ నెలలో దాహంతో ఉన్నవారికి నీటిని ఇవ్వడం వల్ల అనంతమైన పుణ్యఫలాలు లభించడంతో పాటు త్రిమూర్తుల అనుగ్రహం కలుగుతుంది.

ఈ నెలలో మొదటి పదిరోజులు అంటే శుక్లపక్ష పాడ్యమి మొదలుకొని దశమి వరకూ 'గంగానది'లో స్నానమాచరించాలని శాస్త్ర వచనం. వీలున్నవారు గంగానదిలో స్నానమాచరించవలెను. గంగానదిని స్మరిస్తూ స్నానమాచరించి, గంగానదిని పూజించి ప్రతిదినం పది భక్ష్యాలను నైవేద్యంగా సమర్పించవలెను.

నమో భగవత్యై
దశ పాప హరాయై
గంగాయై నారాయణ్యై
రేవత్యై దక్షాయై శివాయై
అమృతాయై విశ్వరూపిన్యై
నందిన్యై తే నమో నమః

అనే శ్లోకాన్ని పది రోజుల్లో అయిదు వేలసార్లు పఠించాలని శాస్త్రవచనం. వీటన్నిటితో పాటు ఈ మాసంలో పాదరక్షలు, విసనకర్ర, గొడుగు, చందనము, పద్మపురాణం వంటి వాటిని దానం చేయవలెను. ఈ విధంగా క్రమం తప్పక విధులను పాటించడం సర్వ పాప హరణం! అనంత పుణ్య ఫలదాయకం!!

ఈ నెలలో బ్రహ్మదేవుడి ప్రతిమను బియ్యపు పిండి లేదా గోధుమ పిండితో తయారు చేసుకుని పూజా మందిరంలో ఉంచి పూజించడంతో పాటు వస్త్రాలను సమర్పించడం మంచిది.

జ్యేష్ఠ మాస శుక్ల తదియ నాడు 'రంభా తృతీయ వ్రతం' ఆచరిస్తారు. పూర్వం భృగుమహర్షి సలహా మేరకు పార్వతీదేవి ఈ వ్రతాన్ని ఆచరించి శివుడిని భర్తగా పొందినట్లు పురాణ కథనం. కాబట్టి పెళ్లికాని యువతులు ఈ వ్రతాన్ని ఆచరించడం మంచిది. అరటి చెట్టు మొదలు వద్ద సావిత్రిని ప్రతిష్ఠించుకుని పూజ చేయాలి.

జ్యేష్ఠ శుద్ధ పంచమి నాడు పితృదేవతలను పూజచేయాలని శాస్త్రవచనం. ఈ రోజున పితృదేవతలను పూజించ, పిండ ప్రదానాలు, అన్నదానం చేయటం శ్రేష్ఠం.

జ్యేష్ఠ పౌర్ణమి నాడు రైతులు పంట వేయడానికి ముందు భూమిని దున్ని, ఏరువాక సాగే పూర్ణిమ కనుక, దీనిని 'ఏరువాక పూర్ణిమ' అనే పేరుతో వ్యవహరిస్తారు. భూమిని దున్నే ముందు భూమితో పాటు ఎద్దులు, నాగలిని పూజోంచడం ఆనవాయితీ.

రైతులే కాకుండా ఇతరులు కూడా వాటిని పూజించి ఫలితాలను పొందుతారు. ఈ రోజున ఎవరికీ అప్పులు ఇవ్వరు. డబ్బు పెట్టి కొనరు. ఇంట్లోది ఏదీ బయటకు పోకూడదని నమ్ముతారు. పిండివంటలు చేసుకుంటారు.

తమ అయిదవ తనం వర్ధిల్లాలని, ముత్తైదువులు జ్యేష్ఠ పూర్ణిమ లేక అమావాస్యరోజున వటవృక్షం క్రింద సావిత్రీదేవిని పూజించడంతో పాటు వటవృక్షానికి పూజలు చేసి, ప్రదక్షిణలు చేసి నమస్కరించి ఐదుగురు ముత్తైదువులకు దక్షిణ తాంబూలాలు ఇస్తారు.

సృష్టి స్థితి లయకారుల్లో, లయకారుడైన పరమశివునికి సంబంధించిన వ్రతం తిందుకాష్టమి వ్రతం. ఈరోజు మొదలు ప్రతి నెలా బహుళ పక్షంలో అష్టమి రోజు శివుడిని షోడశోపచారాలతోనూ, అష్టోత్తరాలతోనూ పూజించవలెను. ఈవిధంగా ఒక సంవత్సర కాలం చేసి ఉద్యాపన చేయవలెను. ఈ వ్రతం చేయడం వల్ల శివానుగ్రహం కలిగి కష్టాలన్నీ తొలగిపోతాయని శాస్త్రవచనం.

జ్యేష్ఠ బహుళ ఏకాదశికి సిద్ధి ఏకాదశి అని కూడా పేరు. ఈ దినం ఏకాదశి వ్రతాన్ని పాటించి శ్రీ మహావిష్ణువును పూజించి, ఉపవాస జాగరణను అనుసరిస్తే గోదావరి నదిలో ఒక సంవత్సరం స్నానం చేసిన ఫలం, సంక్రాంతి నాడు కేదారేశ్వరుని దర్శనఫలం, సూర్యగ్రహణ సమయంలో కురుక్షేత్రంలో స్నానఫలం, అశ్వ, గజ, భూదాన, గోదానా, సువర్ణ దాన ఫలములు లభిస్తాయి. అంతేకాకుండా సంచిత పాపాలన్నీ తొలగిపోతాయి.

## కృషి పౌర్ణమి ఏరువాక

తెలుగువారికి వ్యవసాయం ఒక పవిత్రకార్యం. పుణ్యకార్యం. వ్యవసాయమే కాదు, అన్ని వృత్తులూ పుణ్యప్రదమైనవే మనకి. ఒక వైద్యుడు తన ద్వారా రోగికి స్వస్థత చేకూర్చాలని ప్రార్థిస్తాడు. ఒక వడ్రంగి ఆకులు కట్టి బండి చక్రం చేస్తే, ఒక కమ్మరి దానికి ఇనప కర్ర తొడుగుతూ, ఈ బండి పదికాలాల పాటు పుట్టెడే సి వడ్లు రవాణా చేయాలని కోరుకుంటాడు. ఇది మన సంస్కృతి. ఇది మన ఆచారం.

ద్వాపరయుగం నాటి ప్రజలు వ్యవసాయానికి కావలసిన వర్షాన్ని ఇంద్రుడు కురిపిస్తాడని భావించేవారు. మహాభారతంలో ఇంద్రుడిని పూజించే ఘట్టం గోవర్ధనగిరి కథాంశంలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. వ్యవసాయం పనులు ప్రారంభించడానికి మంచి నక్షత్రం జ్యేష్ఠ అని జ్యోతిష శాస్త్రం చెబుతోంది. ఆ నక్షత్రంతో చంద్రుడు కూడి ఉండే రోజు జ్యేష్ఠ పూర్ణిమ. చంద్రుడు ఓషధులకు అధిపతి. ఓషధులు, మంచి ఎరువు, సూక్ష్మ ధాతువులు పుష్కలంగా ఉంటేనే వ్యవసాయం అధిక ఫలసాయాన్ని ఇస్తుంది. అందుకే జ్యేష్ఠ పూర్ణిమనాడు ఈ పర్వదినాన్ని జరుపుతారు.

మన రైతులు జ్యేష్ఠ శుద్ధ పూర్ణమిను ఏరువాక పూర్ణిమ అంటారు. ఇది మతసంబంధ పండుగ కాదు. మనుగడ పండగ. ప్రతి ఒక్కరి కడుపు నింపే వారి గింజ పండాలంటే దానికి ఏరువాకే సాధనం. అందుకే ఈ పండుగకు రైతు అత్యంత ప్రాధాన్యం ఇస్తాడు. పురాణాల్లో కూడా ఏరువాక ప్రస్తావన కనిపిస్తుంది. గీతాచార్యుడైన శ్రీ కృష్ణ పరమాత్మ సైతం ఏరువాక గురించి ప్రస్తావించాడు.

సీతా యజ్ఞాశ్చ కర్షకా |
గిరి యజ్ఞ స్తదా గోహః
ఇజ్యోభిర్గి రిర్వనే ||

బ్రాహ్మణులకు మంత్రం జపమే యజ్ఞం. రైతుకు నాగలితో పొలం దున్నడమే యజ్ఞం. పశుపాలకులకు గిరి, వన ప్రాంతాలకు పశువులను మేతకు తీసుకువెళ్లడమే యజ్ఞం అని అర్థం. ఏరువాక పౌర్ణమి సీతా యజ్ఞము అని పేరు పెట్టింది విష్ణుపురాణం. సీత అంటే నాగలి. నాగలితో దుక్కి దున్నుతూ వ్యవసాయాన్ని ఆరంభించి పంటలు పండిస్తారు. ఇది కర్షకులకు యజ్ఞంతో సమానమని వివరిస్తుంది విష్ణుపురాణం.

వృత్తే దైవంగా భావించే ఏ వ్యక్తి అయినా తాను ఉపయోగించే పరికరాన్ని దైవంగా భావించి పూజిస్తాడు. అలాగే...రైతు కూడా ఈ రోజు పొలం పనులకు సహకరించే పశువులు, వ్యవసా య పరికరాలను కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తాడు. ఇందుకోసం ముందుగా పశువుల కొట్టాలను, పొలాలను శుభ్రం చేసి పశు

వులు, పరికరాలను పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. అనంతరం ఎడ్లబల్లేను, ఎద్దు కట్టిన నాగళ్లను తీసుకుని ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేసు కుంటూ పొలానికి బయలుదేర తాడు. రైతులు నాగళ్లను, పశువులకు మంగళహారతులిచ్చి నాగళ్ళ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. రైతులంతా కలిసి మంగళవాద్యాలతో సామూహికంగా ఎద్దులు తోలుకుని పొలాలకు వెళ్లి భూమి దుక్కి దున్ని ఏరువాక ప్రారంభిస్తారు. దీన్ని కారు వున్నవి అని, కృషి పూర్ణిమ అని, హేల పూర్ణిమ అని అనేక పేర్లతో ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా వ్యవహరిస్తారు.

ఉత్తర భారతదేశంలో దీన్ని ఉద్వృషభ యజ్ఞం అని పిలుస్తారు. వృషభం అంటే ఎద్దు. ఉద్ధృతం అంటే లేపడం. అంతవరకూ వేసవి వల్ల కాస్త విశ్రమించిన పశువులను వ్యవసాయం కోసం సిద్ధపరచడమని అర్ధం.

కొన్ని ప్రాంతాలలో రైతు తమ పొలాల్లో దుక్కి దున్నడం ప్రారంభించడానికి ముందు గోగునారును తోరణంగా పేని మళ్ళీ దాన్ని విడదీసి అలా ఊడిన పీచును ఎవరికి అందింది వాళ్ళు తీసుకు వెళ్లి దాన్ని పొలాల్లోనూ, ఇళ్లలోనూ, పశువుల కొట్టం లోనూ చల్లుతారు. మిగిలినది భద్రపర చుకుంటారు. ఈవిధంగా చెయ్యడం వల్ల ఎంతో ధాన్యలాభం చేకూరుతుందని రైతు విశ్వాసం. పొలం పనులకు ఎలాంటి అవరోధాలు కలుగనీయకుండా గణపతిని పూజిస్తారు. పశుపాలకులైన బలరామకృష్ణులు పాడీపంటలకు ఎలాంటి లోటూ రానివ్వ కుండా కాపాడాలని, ఈనాటి ఈ తొలకరి చినుకే రేపటి పంటసిరికి అవసరమైన నీటిబాట కావాలని ఆశీర్వదించమని నిండు మనసుతో ప్రార్థిస్తారు. ఆ తరువాత పంటలు పండేందుకు సృష్టిని, వర్షించాల్సిన వరుణదేవుని, దిక్పాలకులకు అధిపతి అయినా దేవేంద్రుణ్ణి ఆరాధిస్తారు.

వానల్లు కురవాలి వానదేముడా
వరిచేలు పండాలి వానదేముడా
నల్లని మేఘాలు వానదేముడా
చల్లంగా కురవాలి వానదేముడా!

అని ప్రార్థిస్తారు.

ఇరు అంటే ఎడ్ల జత అని అర్థం. ఏరువాక అంటే దున్నడానికి ప్రారంభం అని! ఇరు కలప అంటే నాగలికి కట్టే ఒక పనిముట్టు. ఏరువాక చేయడం అంటే తొలిసారి దుక్కిదున్నడం. ఆరవ అంటే ఎడ్లను పూన్చటానికి సిద్ధంగా ఉన్న నాగలి. ఉత్తర భారతదేశంలో వ్యవసాయ పనులు చినుకులు పడగానే ప్రారంభిస్తారు. ఐరోపాలోని దేశాల్లో కూడా ఏరువాక నిర్వహిస్తారు. దీనిని 'మేషాప్' నే పేరుతో జరుపుతారు. అలాగే, కొన్ని చోట్ల ఈరోజు కాడిని ఒకవైపు ఎద్దు మెడపై వేసి మరోవైపు రైతు తన భుజంపై వేసుకుని నేలను దున్నుతాడు. పశువులు పడే కష్టంలో కొంత తామూ పాలుపంచుకోవడమే ఇందులోని పరమార్థం. పంటపొలాలకు తేరవించే ప్రక్రియ కూడా ఈ పూర్ణిమ నాడే ప్రారంభిస్తారు.

ఈరోజు రైతు, శ్రామికులు తమ తమ క్షేత్ర పాలకుణ్ణి తాము చేస్తున్న పనిలోకి విజయాన్ని కలుగజేయమని వేసుకుంటారని ఋగ్వేదం తెలియజేస్తుంది. శ్రీకృష్ణ దేవరాయలు రైతన్న కృషికి మెచ్చి ఏరువాక పున్నమినాడు కానుకలను అందించి సత్కరించినట్లు చారిత్రిక ఆధారాలున్నాయి. కపిలవస్తు నగరంలో శుద్ధోదనుడు వర్షాకాలం ఆరంభం కాగానే ఏరువాక పండుగను ప్రారంభిస్తూ రైతులందరికీ బంగారు నాగళ్లను అందజేసేవాడు. పురాణాల్లోనూ కృషి పూర్ణిమ ప్రసక్తి ఉంది. వరాహమిహిరుడు రచించిన బృహత్సంహిత లోనూ, పరాశరుడు వ్రాసిన కృషి పరాశరం లోనూ ఈ ఉత్సవ ప్రసక్తి ఉంది. వ్యవసాయాధారిత పండుగలకు ప్రాశస్త్యం, ప్రచారం తగ్గిపోతుండడం వల్ల క్రమేణా ఇలాంటి పర్వాలు కాస్తా మరుగవుతున్నాయి. ఇప్పటికీ సంప్రదాయ పద్ధతుల్ని పాటించే రైతులు లేకపోలేదు. అందుకే ఇంకా పర్వం తెలుగునేలపై ఉనికిని చాటుకుంటోంది.

- ది . 28 - 6 - 2018 న ఏరువాక పౌర్ణమి

# జనార్ధన ఠాకూర్

## జూన్ 2018 లో మీ రాశి ఫలాలు



9963933371, 9490189713

**జూన్ నెలలో:** రవి 18 వరకు వృషభంలో తదుపరి మిథునంలో, బుధుడు 11 వరకు వృషభంలో తదుపరి మిథునంలో, కుజుడు మాసాంతం వరకు మకరం, 27 నుండి వక్రగతిలో సంచారంగురు డు తులారాశిలో వక్రగతి-లో సంచారం, శుక్రుడు 8 వరకు మిథునంలో, తదుపరి కర్కాటకంలో, శని ధనస్సులో వక్రగతిలో, రాహువు కర్కాటకంలో, కేతువు మకరం లో

**మేష రాశి:**

ఈ మాసంలో అనేక విషయాలలో అనుకూలంగా వుండును. మోసపోయే ప్రమాదం కలదు. జాగ్రత్తగా వుండవలెను. గృహంలో పెద్దవారి ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. స్పెకులేషన్ లో రాణింపు వుంది. గృహ వాతావరణం అనుకూలంగా వుండును. దైవ కార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగస్తులు సహచరులతో జాగ్రత్తగా మెలగవలెను. వ్యాపారస్తులు లాభాలు గడిస్తారు. దూర ప్రయాణాలు చేస్తారు. వాటివలన లాభాలు గడిస్తారు. విద్యార్థులు తమ ప్రతిభను చదువులో చూపిస్తారు. పరిశోధన చేయువారికి అత్యంత అనుకూలసమయం జూన్ 24 రాత్రి 10. 36 నుండి 27 ఉదయం 9. 35 వర కు ప్రతికూల సమయం. ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) శ్రీ సూర్యనారాయణమూర్తికి ఉద యం అర్ఘ్యం సమర్పించుట 2) గోధుమలు దానం చేయుట ద్వారా మంచి ఫలితాలు లభిస్తాయి.

**వృషభరాశి:**

ఈ మాసంలో ఆర్థిక విషయాలలో ఆచితూచి వ్యవ-హరించవలెను. ఋణ బాధలు ఇబ్బంది పెట్టును. ఉద్యోగ విషయములో జాగ్రత్త వహించవలె-ను. సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించవలెను. గృహంలో అశాంతి, సహనం కోల్పోవుట జరగవ-చ్చును. కావున దైవ ప్రార్థన నిత్యం జరుపవలెను. ఉద్యోగస్తులకు ఆటుపోట్లు ఉండును. భాగస్వామ్య వ్యాపారంలో విరోధములు తలెత్తు అవకాశం కలదు. ప్రచురణ రంగంలో ఉన్నవారికి అనుకూలం. విద్యా-ర్థులకు చదువునందు క్రమశిక్షణ అవసరం. జూన్ 27 ఉదయం 9. 35 నుండి 29 రాత్రి 10. 08 వరకు ముఖ్యమైన పనులు వాయిదావేయుట శ్రేయస్కరం. వైదిక సూచన: 1) శివాలయంలో రుద్రాభిషేకం చేయుట 2) శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ చేయుట ద్వారా అనుకూల ఫలితాలు లభించును.

**మిథున రాశి:**

ఈ మాసంలో అధికంగా ఉన్నతిని సాధిస్తారు కానీ వ్యయమును నియంత్రించవలెను. ఆరోగ్య విష యంలో ముందు జాగ్రత్తలు తీసుకోవలెను. సోషల్ కార్యక్రమాలలో పాలుపంచుకున్నవారికి గుర్తింపు లభించును. ఉద్యోగస్తులకు బదిలీ కానీ ప్రమోషన్ లభించు సూచనలు కలవు. వ్యాపారస్థులు తమ వ్యాపార విస్తరణకు అనుకూల సమయం. గృహం లో శుభకార్యం జరుగు అవకాశం కలదు మరియు బంధు మిత్రులు సందడి చేయుదురు. విద్యార్థు-లు తమ ప్రతిభను చాటెదరు. ఉన్నత చదువులకై ప్రయత్నము చేయువారికి అనుకూల సమయం. జూన్ 2 వ తేదీ మధ్యాహ్నం 3. 38 నుండి 4 వ తేదీ ఉదయం వరకూ, తిరిగి 29, 30 తేదీలలో ముఖ్య-మైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన:

1) విష్ణు ఆలయంలో తులసిమాల సమర్పించుట

2) దుర్గాదేవి ఆలయ సందర్శన వలన శుభఫలితా-లు పొందుతారు.

## కర్కాటక రాశి :

ఈ మాసంలో ఆర్థిక నష్టాల వలన మరియు అధిక వ్యయం వలన చికాకులు ఎదురు అగును. కంటి సమస్యల వలన బాధలు కలుగవచ్చును. మీ ప్రాణ స్నేహితుడు మీనుంచి దూరం అగు అవకాశం కలదు. మీలో ఆధ్యాత్మిక భావన పెరుగును. గృహంలో వాదప్రతివాదనలకు దూరంగా ఉండవలెను. ఉద్యోగస్తులకు కోరుకున్న చోటుకు బదిలీ అయ్యే అవకాశం కలదు. దూరప్రయాణాలు అనుకూలించును. వ్యాపారస్తులు పోటీ ఎదురుకొందురు. సమయస్ఫూర్తి అవసరం. విద్యార్థులకు, ముఖ్యంగా పరిశోధన చేయువారికి అనుకూల సమయం. జూన్ 4 నుండి 7 వ తేదీ వరకు ముఖ్యమైన పనులు వాయిదావేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1)గురువారంనాడు గురుచరిత్ర పారాయణ చేయుట 2)అరటిచెట్టుకు నీరుపోయుట ద్వారా శుభ ఫలితా లు పొందుతారు.

## సింహ రాశి:

ఈ మాసంలో ఆర్థిక పరిస్థితి అత్యంత అనుకూలంగా ఉండును. నూతన వస్తువులు కొనుగోలు చేయుదురు. ఆరోగ్య పరిస్థితి అనుకూలంగా ఉండును. ఇరుగు పొరుగు వారితో జాగ్రత్త అవసరం. గృహంలో శుభకార్యం జరుగు అవకాశం కలదు. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. పై అధికారుల మెప్పు పొందుదురు. వ్యాపారస్తులకు అనుకూల సమయం. ఇచ్చిన మాట నిలబెట్టుకొనుటలో విఫలం అవుతారు. విద్యార్థులకు అనుకూల సమయం. జూన్ 7 వ తేదీ నుండి 9 వ తేదీ మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) కాలి నడకన దుర్గా అమ్మవారి ఆలయ సందర్శన 2) మాంసాహారము విసర్జించుట ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.

## కన్యారాశి:

ఈ మాసంలో ఆర్థికస్థితి బాగుండును. మనోవాంఛ నెరవేరును. దీర్ఘకాల రోగముతో బాధపడువారు జాగ్రత వహించవలెను. అపరిచితులతో జాగ్రత్తగా ఉండవలెను. గాయములబారిన పడే అవకాశం కలదు. ఉద్యోగస్తులు అనుకున్నది సాధిస్తారు. స్థిరాస్తి విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాపారాభివృద్ధి జరుగును. ప్రజా జీవితంలో ఉన్నవారికి మంచి అవకాశం లభించును. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. జూన్ 9 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదికసూచన: 1)శని గ్రహము వద్ద నువ్వుల నూనెతో దీపారాధన 2) మాసశివరాత్రి రోజు ఈశ్వరునికి అభిషేకం చేయుట ద్వారా ఉత్తమ ఫలితాలు లభించును.

## తులా రాశి:

ఈ మాసంలో అధిక ఖర్చుల వలన పరిస్థితి దుర్భరంగా ఉండును. ఉదర సంబంధిత వ్యాధుల వలన బాధపడుదురు. అవివాహితులకు వివాహ సంబంధము కుదిరే కాలం. బంధు మిత్రులతో ఆచితూచి వ్యవహరించవలెను. మానసిక అశాంతి కలుగవచ్చును. ఉద్యోగస్తులకు చేయు పనిలో మార్పు కలుగు సూచనలు కలవు. వ్యాపారస్తులకు అభివృద్ధి కనపడును. వ్యాపారణ విస్తరణ చేయుదురు. విద్యార్థులకు ఉన్నత చదువులకు అనుకూల సమయం. జూన్ 12 వ తేదీ నుండి 14 వ తేదీ మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) గురువారం నాడు పసుపు దానం చేయుట 2) దక్షిణామూర్తి ధ్యానం చేయుట ద్వారా అనుకూల ఫలితాలు లభించును.

## వృశ్చిక రాశి :

ఈ మాసంలో ఆర్థిక స్థితి అనుకూలంగా ఉండును. స్పెకులేషన్ కి దూరంగా ఉండవలెను. ఆరోగ్యము పరిస్థితి బాగున్నా చిన్న చిన్న ప్రమాదములు జరగవచ్చును. మీ పెడసరం మాటల వలన గృహంలో అశాంతి. అవివాహితులకు వివాహం కుదిరే అవకాశం కలదు. ఉద్యోగస్తులకు చేయు పనిలో మంచి గుర్తిము మరియు పదోన్నతి కలుగు అవకాశం

కలదు. వ్యాపారస్తులకు లాభములు కలుగును. రచయితలకు మరియు ప్రచురణ రంగంలో ఉన్న-వారికి మంచి అనుకూల సమయం. విద్యార్థులకు పోటీ పరీక్షలలో విజయం. జూన్ 14 వ తేదీ నుండి 16 వ తేదీ మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) నిత్యం రుద్రా జపం చేయుట 2) జన్మ నక్షత్రం రోజున పసుపు గుడ్డ గానం చేయుట ద్వారా శుభఫలితాలు పొందుతారు.

**ధను రాశి :**

ఈ మాసంలో ఆర్థిక పరిస్థితి సామాన్యముగా ఉండును. ఖర్చులపై నియంత్రణ అవసరం. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ఆహారపు అలవాట్లు పాటించవలెను. గృహ వాతావరణం అనుకూలంగా ఉండును. స్నేహితుల సహకారం లభించును. ఉద్యోగస్తు-లకు అనుకూల సమయం. వ్యాపారస్తాలకు అత్యంత అనుకూల సమయం. విద్యార్థులకు మంచి కాలం. జూన్ 16 వ తేదీ నుండి 18 వ తేదీ మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) కాలభైరవ ఆరాధన 2) హనుమాన్ దేవాలయంలో సింధూరం మరియు నారింజ పళ్ళు సమర్పించుటద్వారా మంచి ఫలితాలు పొందుతారు

**మకర రాశి:**

ఈమాసంలో ఆర్థికచిక్కులు కలిగే అవకాశం కలదు. చక్కని ఆర్థిక ప్రణాళిక రచించవలెను. ప్రమాదము-లు గురి అయ్యే అవకాశం కలదు. చెడు స్నేహితు-లవలన ఇబ్బందికి గురి అవుతారు. కావలసినవారికి దూరంగా ఉండు అవకాశం కలదు. ఉద్యోగస్తులకు అనుకోలా సమయం కాదు. ఓపిక అవసరం. వ్యా-పారస్తులకు లాభాలు తగ్గును. కొత్త వ్యాపారం మొ-దలుపెట్టవద్దు. విద్యార్థులకు చదువులో ఆటంకము ఎదురు అవును. శ్రద్ధ వహించవలెను. జూన్ 18 వ తేదీ నుండి 20 వ తేదీ మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) నిత్యం శివాలయ సందర్శన మరియు నవగ్రహ ప్రదక్షిణ చేయుట 2) దక్షిణామూర్తి ఆరాధన చేయుట ద్వారా కొంత మేర ప్రతికూల ఫలితాలు తగ్గును.

**కుంభ రాశి:**

ఈ మాసంలో ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉండును కానీ స్పెకులేషన్ కి దూరంగా ఉం-డవలెను. చిరుతిళ్లు వలన మీ ఆరోగ్యమునకు భంగము వాటిల్లవచ్చును. ప్రమాదములు కలుగు సూచనలు కలవు. జాగ్రత్త వహించవలెను. గృహ వాతావరణం అనుకూలంగా ఉండును. తీర్థ యాత్రలు చేయుదురు. ఉద్యోగస్తులకు కొంత వ్యతిరేక వాతావరణం ఉన్నా ఓపికతో అధిగమించుదురు. వ్యాపారస్తులకు పోటీ ఉన్నా లాభాలలో నడచును. న్యాయపరమైన మరియు స్థిరాస్తి విషయాలు వాయిదా వేయుట మంచిది. విద్యా-ర్థులు అధిక శ్రమ వలన ఫలితాలు సాధించెదరు. జూన్ 20 వ తేదీ నుండి 22 వ తేదీ మధ్య ముఖ్య-మైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) ప్రతి మంగళవారం శ్రీ కార్తికే-యుని ఆలయ సందర్శన 2) దుర్గాసూక్తం పఠనం ద్వారా శుభ ఫలితాలు సాధిస్తారు.

**మీన రాశి :**

ఈ మాసంలో ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉండును. ఖర్చులు అదుపులో ఉంచవలెను. సకాలంలో వైద్య సేవలద్వారా ఆరోగ్య సమస్యల నుండి బయటపడుదురు. శుభకార్యములు వాయిదా పడును. గృహ వాతావరణం సామాన్య-ముగా ఉండును. ఉద్యోగస్తులు టీమ్ వర్క్ ద్వారా మంచి ఫలితాలు సాధిస్తారు. వ్యాపారస్తులు తమ వ్యాపారం అభివృద్ధి చేసి విజయం సాధిస్తారు. విద్యార్థులకు ఆటలలో విజయ ప్రాప్తి. చదువులో గ్రూప్ స్టడీస్ అనుకూలం. జూన్ 22 వ తేదీ నుండి 24 వ తేదీ మధ్య ముఖ్యమైన పనులు వాయిదా వేయుట శ్రేయస్కరం.

వైదిక సూచన: 1) దేవాలయంలో పులిహోర పంచుట ద్వారా 2) శివాలయంలో రుద్రాభిషేకం జరిపించుట ద్వారా శుభ ఫలితాలు పొందుతారు.



# తెలంగాణ

## ప్రభుత్వ పథకాలు.. దేశానికి మార్గదర్శకాలు



### పారిశ్రామిక అభివృద్ధి

- TS iPass - సింగిల్ విండో పారిశ్రామిక విధానం... ప్రపంచంలోనే అత్యుత్తమం
- అంతర్జాతీయ పెట్టుబడులను పెద్ద యెత్తున ఆకర్షిస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆర్థిక విధానం
- రాష్ట్రంలో నాలుగు లక్షలమందికి ఉద్యోగాలు కలిపించే దిశగా రూ.1,10,154 కోట్ల పెట్టుబడులతో 6070 యూనిట్ల స్థాపన
- ఐటి ఉత్పత్తుల ఎగుమతులలో 12% వాటతో దేశంలోనే రెండో స్థానం

### రైతు సంక్షేమం

- దేశంలోనే మొదటిసారిగా వ్యవసాయానికి 24 గంటలపాటు నిరంతరాయ ఉచిత విద్యుత్ సరఫరా
- **రైతుబంధు పథకం:** రైతులందరికీ రెండు పంటకాలాలలో పెట్టుబడులకు ప్రతి ఎకరాకు రూ.8000 సహాయం
- ట్రాక్టర్ల కొనుగోలుపై 50% సబ్సిడి, పన్నుల మినహాయింపులు
- భూమి రికార్డుల సంస్కరణ, రైతులందరికి పట్టాదారు పాసు పుస్తకాలు





### రైతులకు రూ.5 లక్షల జీవిత బీమా

- రాష్ట్రంలో 18 నుంచి 60 ఏళ్ల వయస్సులోపు ఉన్న రైతులందరికీ 5 లక్షల రూపాయల జీవిత బీమా సౌకర్యం.
- ప్రతీ రైతుకు రూ.2271 ప్రీమియం ప్రభుత్వం పక్షాన చెల్లింపు
- జూన్ 2వ తేదీ నుంచి బీమా పొందుతున్న రైతుల నుంచి నామినీల ప్రతిపాదనల స్వీకరణ.
- వచ్చే 15 ఆగస్టు నుంచి రైతులకు బాండ్ సర్టిఫికేట్‌ల జారీ.

### మిషన్ కాకతీయ

- తెలంగాణకు జీవనాడులైన 45,000 చెరువుల పునరుద్ధరణ
- **సాగునీటి ప్రాజెక్టులు వేగవంతం:** కాళేశ్వరం, పాలమూరు, సీతారామ డిండి & కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలు
- కొత్తగా సాగుబడిలోకి కోటి ఎకరాలు
- ఏటా రూ.25,000 కోట్ల బడ్జెట్ కేటాయింపులు
- అవసరమైన మేరకు ఇతర రాష్ట్రాలతో ఒప్పందాలు





### విద్యుత్ సరఫరాలో మైలురాళ్లు

- నిరంతరాయ విద్యుత్ సరఫరా నుంచి మిగులు విద్యుత్ స్థాయికి ఎదుగుదల
- రాష్ట్ర ఆవిర్భావ సమయంలో విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం 6574 మెగావాట్లు
- 3 సంవత్సరాలలో 7981 మెగావాట్ల అదనపు విద్యుత్ సాధన
- రానున్న 3 సంవత్సరాలలో 14000 మెగావాట్ల అంచనా విద్యుత్ సాధన

### డబుల్ బెడ్‌రూమ్ గృహాలు

- పేదల ఆత్మగౌరవాన్ని సంరక్షించే దిశగా గృహాల నిర్మాణం
- ప్రభుత్వంచే పూర్తి వ్యయం భర్తీ
- జయప్రదంగా సాగుతూ పేదలందరికీ అందుబాటులో గృహాలు





### కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్

- ఆడపిల్ల వివాహ సమయంలో రూ.1,00,116 సహాయం
- ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీలకు, ఇతర వెనుకబడిన కులాల వారికి



### మిషన్ భగీరథ

- రాష్ట్రంలో ప్రతీ ఇంటికి పైపుల ద్వారా మంచి నీటి సరఫరా
- 52,18,225 గృహాలకు కనెక్షన్లు
- అంచనా వ్యయం రూ. 43,792 కోట్లు



|| కేసిఆర్ కిట్ || ఆరోగ్య లక్ష్మి || అమ్మ ఒడి || స్త్రీ నిధి || షీ టీమ్స్ ||
|| ఆసరా పెన్షన్లు || టిఎస్ ప్రైడ్ || మైనారీటి రెసిడెన్షియల్ పాఠశాలలు ||
|| టిఎస్ ప్రైమ్ || నేతన్నకు చేయూత || హరితహారం ||

జారీ చేయువారు: కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

**RNI No. APTEL/2011/39497 JUNE 2018 Postal No. HSE/1043/2017-19**

Date of Publishing: 1st June Date of Posting: 8th June






Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001